ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 25 మార్చి 2025



13న గురుకుల విద్యాలయాల ప్రవేశ పరీక్ష

నెల్లూరు (హరనాథపురం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల విద్యాలయాల్లో 5వ తరగతి, ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష జరుగుతుందని ఏపీఎస్‌డబ్ల్యూఆర్ఈఐ సొసైటీ కో ఆర్డినేటర్ టి.పద్మజ ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశానికి 13న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, మొదటి సంవత్సరం ఇంటర్‌లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష మాధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు జరుగుతుందని తెలిపారు. ఏప్రిల్ 6న జరగాల్సిన ఈ పరీక్ష 13వ తేదీకి వాయిదా పడిందని పద్మజ పేర్కొన్నారు.

అక్కరకు రాని ఆరోగ్యశ్రీ

వైద్యసేవలు



- ఒరిజినల్ కార్డు ఉంటేనే వైద్యం
- నెంబర్, నకలు ఉంటే సరిపోదట
- వ్యాధిగ్రస్థులకు తేల్చిచెబుతున్న ఆసుపత్రివర్గాలు
- కార్డు డౌన్‌లోడ్‌ను ఆపేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ఆసుపత్రులు, ఆరోగ్యశ్రీ, ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం
- సచివాలయ సిబ్బంది వినతులూ బేఖాతరు
- అప్పులను పోగొట్టుకోలేక పేదల అవస్థలు
- ఆస్తులు, ఆభరణాలు తెగనమ్మి వైద్యం పొందుతున్న వైనం

ఇటీవల కావలికి చెందిన ఒక వ్యక్తి నెల్లూరుకు వస్తుండగా మార్గమధ్యంలో ప్రమాదానికి గురయ్యాడు. ఆయన్ను 108లో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తీసుకొచ్చారు. వైద్యానికి ఎంత ఖర్చు అవుతుందో ఆసుపత్రి వర్గాలు క్షతగాత్రుడి భార్యకు చెప్పాయి. ఆరోగ్యశ్రీ కార్డు ఉంటే తీసుకురండని చెప్పారు. కళ్లలో నుంచి ఉబికి వస్తున్న కన్నీళ్లను తుడుచుకుంటూ ఇంటికి వెళ్లిన ఆమెకు ఆరోగ్యశ్రీ కార్డు ఎక్కడుందో కనిపించలేదు. ఎంత ఆలోచించినా స్ఫురణకు రాలేదు. పరుగున మళ్లీ ఆసుపత్రికి చేరుకుని విషయం చెప్పింది. ఆన్‌లైన్‌లో పరిశీలించగా ఆ కుటుంబ యజమాను రాలి పేరుతో కార్డు ఉంది. ప్రాణం లేచి వచ్చినట్లు ఊపిరి పీల్చుకుంది. అంతలోనే మరో కబురు. ఆన్‌లైన్‌లో ఉంటే సరిపోదు.. ఒరిజనల్ కార్డు ఉండాల్సిందేనని ఆసుపత్రివర్గాలు చెప్పడంతో ఏం చేయాలో దిక్కుతోచలేదు. అసలే పేద కుటుంబం. అద్దె ఇళ్లలో జీవనం. ఇల్లు మారే క్రమంలో ఎక్కడైనా మిస్ అయ్యిందో ఏమో ఎంత వెతికినా ఆరోగ్యశ్రీ కార్డు కనిపించలేదు. కార్డు కోసం సచివాలయానికి పరుగులు తీసిందా ఇల్లాలు. వారూ చేతులెత్తేశారు. 'ఇదివరకులా కార్డులు డౌన్‌లోడ్ కావమ్మా.. మేము ఏమి చేయలేమన్నారు. అప్పుడు మా పక్కంటోళ్లకు తీసిచ్చావు కదన్నా! అని అడిగింది. అప్పట్లో వచ్చేవి. ఇప్పుడు రావడం లేదు' అని సమాధానం చెప్పారు. ఇక ఆ మహిళ ఆరోగ్యశ్రీ కోసం ఆలోచించలేదు. జీవితకాలమంతా పోగుచేసుకున్న సొమ్ముతో కొన్న నగనట్రా అమ్మేసి భర్తకు వైద్యం చేయించుకుంది.

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : స్థిరాస్తికి సంబంధించిన దస్తావేజులు దారిపోతే రిజిస్ట్రేషన్ కార్యాలయంలు నకలు తీసుకోవచ్చు. ఆధార్ కార్డు కనిపించకుండాపోతే మరొకటి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. నెంబరు ఉంటే చాలు రేషన్ కార్డు లేకపోయినా నిత్యావసరాలు పొందవచ్చు. అవసరం అనుకుంటే సచివాలయానికి వెళితే కొత్త కార్డు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కానీ పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రాణాధారమైన ఆరోగ్యశ్రీ కార్డు పొరపాటున మిస్ అయితే ఇక ఆరోగ్యశ్రీలో వైద్యం మరచిపోవాల్సిందే. మరోమార్గంలో ఉచిత వైద్యం పొందాలంటే వ్యాధికన్నా తీవ్ర నరకయాతన అనుభవించాల్సిందే. ఆరోగ్యశ్రీ కార్డు అదృశ్యమైతే మరొకటి డౌన్‌లోడ్ చేసుకోవడం సాధ్యం కాదు. ఒరిజినల్ కార్డు చూపనిదే ఆరోగ్యశ్రీ తరఫున వైద్యమూ దొరకదు. నకలు కార్డు చూపినా, ఆన్‌లైన్‌లో రోగి తాలూకు పేరు ఉన్నా ఆసుపత్రిలో అడ్మిషన్ వరకు ఓకే. ఆ తర్వాత వైద్యసేవలు పొందాలంటే ఒరిజినల్ కార్డు తప్పనిసరి అంటున్నాయి ఆసుపత్రి యాజమాన్యాలు. అయితే, ఆరోగ్యశ్రీ అధికారులు మాత్రం 'అబ్బే.. అలా ఏం లేదే!' అని సర్దిచెబుతున్నారు. పోనీ మరో కార్డు డౌన్‌లోడ్ చేసుకుందామంటే సాధ్యపడదు. ఆ కార్డు డౌన్‌లోడ్ కాదు. ఇందుకు ఎప్పటినుంచో ఇలాగే ఉందా!? రాష్ట్రంలో ప్రభుత్వం మారిన క్రమంలో సంక్షేమ పథకాలకు సంబంధించిన పలు కార్యక్రమాలను కొద్ది రోజులు స్తంభింపజేశారు. ఆ తరువాత అవి మామూలు స్థితికి వచ్చాయి. వైసీపీ హయాంలో ఉన్న వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని ఎన్డీఏ కూటమి ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవా పథకంగా మార్పు మార్చారు. అయితే, ఆరోగ్యశ్రీ కార్డుల వ్యవస్థలో మాత్రం ఇప్పటికీ స్తబ్దత కొనసాగుతూనే ఉంది. కొత్త కార్డులు ఇవ్వలేరు. పాత కార్డులను డౌన్‌లోడ్ చేసుకోలేరు. ఏమైనా మార్పు, చేర్పులు చేయలేరు. దీంతో ఒరిజనల్ కార్డులు పోగొట్టుకున్న పేద, మధ్య తరగతి ప్రజలు వైద్యం కోసం నరకం అనుభవిస్తున్నారు. ఆరోగ్యశ్రీ అక్కరకు రాకపోవడంతో జీవితకాలం పొదుపు చేసుకున్న డబ్బులనో, ఆస్తులనో, ఆభరణాలనో అయిన కాడికి తెగనమ్మి వైద్యం చేయించుకొంటున్నారు.

డౌన్‌లోడ్ ఆపడంతోనే సమస్య

గతంలో సచివాలయాల్లో ఆరోగ్యశ్రీ కార్డును డౌన్‌లోడ్ చేసి ఇచ్చే అవకాశం ఉండేది. కానీ రాష్ట్రంలో ప్రభుత్వం మారినప్పటి నుంచి ఆరోగ్యశ్రీ కార్డులు సచివాలయంలో డౌన్‌లోడ్ కాకుండా నిలుపుదల చేశారు. దీనివల్ల ఈ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. డౌన్‌లోడ్ అవకాశాన్ని తిరిగి పునరుద్ధరించమని పలుమార్లు ప్రభుత్వాన్ని, జిల్లా యంత్రాంగాన్ని కోరినా ఆ సౌకర్యాన్ని పునరుద్ధరించలేదని సచివాలయ సిబ్బంది అంటున్నారు. ప్రభుత్వం ఏ కారణంతో డౌన్‌లోడ్ ఫెసిలిటీని ఆపేసిందో తెలియదు కానీ దీనివల్ల పొరబాటునో, గ్రహపాటునో ఆరోగ్యశ్రీ కార్డులు పోగొట్టుకున్న వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.

నిర్దిష్ట ఆదేశాలు ఇవ్వాలి

ఒకవేళ ఇప్పట్లో ఒరిజినల్ కార్డుల డౌన్‌లోడ్ అవకాశం కల్పించలేని పక్షంలో ఆన్‌లైన్ కార్డుతో వైద్యం చేయాలని ఆరోగ్యశ్రీ పరిధిలోకి వచ్చే ఆసుపత్రులను ప్రభుత్వం ఆదేశించాలి. ఈ విషయంలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా ఆసుపత్రుల్లోని ఆరోగ్యశ్రీ కౌంటర్ల వద్ద ఒరిజినల్ కార్డు లేకున్నా వైద్యం అందుతుందన్న విషయాన్ని తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేసేలా ఆసుపత్రి వర్గాలను ఆదేశించాలి. లేని పక్షంలో దురదృష్టవశాత్తు కార్డు పోగొట్టుకున్న ప్రజలకు అన్యాయం జరుగుతుంది. వైద్య సేవలు అందించడంలో అలస్యం జరుగుతుంది.

కోటకు చెందిన ఓ వ్యక్తి గుండెపోటుతో నెల్లూరులోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరారు. స్టంట్ వేయాలని వైద్యులు సూచించారు. ఇప్పుడు మళ్లీ అదే సీన్. ఒరిజినల్ కార్డు లేకపోతే మరో పద్ధతి ఉందని సీఎంసీఓ లేఖ గురించి చెప్పారు. అది కావాలంటే తహసీల్దార్ ఆఫీసుకు వెళ్లాలి. ఆయన దారిద్ర్యరేఖకు దిగువున ఉన్నారని సర్టిఫై చేస్తూ ఆదాయ ధ్రువీకరణ పత్రం తీసుకురావాలి. ఇది కావాలంటే తహసిల్దార్ కన్నా ముందు వీఏఓ ఎక్కడున్నాడో ఆయన్ను ప్రసన్నం చేసుకోవాలి. ఈ లెటర్ తీసుకొని ఆరోగ్యశ్రీ సిబ్బందికి ఇవ్వాలి. వారు దానిని జిల్లా ఆరోగ్యశ్రీ కార్యాలయానికి పంపుతారు. వారు సీఎంసీఓ లెటర్ ఇస్తారు. అక్కడ నుంచి అనుమతి వచ్చిన తరువాత వైద్యం మొదలు పెట్టాలి. ప్రాణాపాయ స్థితిలో ఆసుపత్రికి చేరిక వ్యక్తి ఇవన్నీ చేసుకొని రాలేక, అంతవరకు ప్రాణం ఉంటుందో పోతుందో తెలియక స్థోమత లేకున్నా సొంత ఖర్చులతో వైద్యానికి సిద్ధపడ్డారు. ఒరిజినల్ ఆరోగ్యశ్రీ కార్డు పోగొట్టుకున్న రోగులు పడుతున్న పాట్లకు ఇవి ఉదాహరణలు మాత్రమే.

ఏ సమస్య ఉన్నా ఫోన్ చేయండి

ఒరిజనల్ ఆరోగ్యశ్రీ కార్డును పోగొట్టుకున్నంత మాత్రాన ఆరోగ్యశ్రీ వైద్యం ఆగదు. ఒరిజనల్ కార్డు లేనివారికి సీఎంసీఓ లెటర్ ద్వారా ఆరోగ్యశ్రీ వైద్యం చేయిస్తున్నాము. అయితే ఈ లెటర్ ఎక్కడ పొందాలి ఎలా పొందాలి అనే విషయంలో ఏమైనా అనుమానాలు ఉన్నా, లేదా ఆరోగ్యశ్రీ ఒరిజనల్ కార్డు లేని కారణంగా ఉచిత వైద్యం అందడం లేదనే పిర్యాదులు ఉన్నా 9281068169 నెంబర్‌కు ఫోన్ చేస్తే తక్షణ సాయం అందలే చర్యలు తీసుకుంటాము. ఈ ఫోన్ నంబర్‌ను నెట్వర్క్ పరిధిలోని ఆసుపత్రుల వద్ద ప్రచారంలోకి తెస్తాము. ఆరోగ్యశ్రీ ఒరిజనల్ కార్డు లేదు కాబట్టి ఉచిత వైద్యం అందదేమో అనే ఆందోళన చెందాల్సిన పనిలేదు.

- సుధీర్‌కుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కోర్డినేటర్



పరీక్షల ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న డీఆర్వో ఉదయభాస్కర్‌రావు

నేడు, రేపు ఏపీపీఎస్సీ పరీక్షలు

నాలుగు కేంద్రాల్లో నిర్వహణ ● కట్టుదిట్టంగా ఏర్పాట్లు

నెల్లూరు (హరనాథపురం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఏపీపీఎస్సీ పరీక్షలను జిల్లాలో మంగళ, బుధవారాల్లో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) ఉదయభాస్కర్‌రావు తెలిపారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సోమవారం ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీపీఎస్సీ పరీక్షలకు అన్నీ ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. 4 కేంద్రాల్లో 2 వేల మందికిపైగా హాజరయ్యే ఈ పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పోలీసు బందోబస్తుతోపాటు మహిళా పోలీసులను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రతి సెంటర్‌లోనూ ప్రాథమిక వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని, ఎండలు ఎక్కువగా ఉన్నందున ఓఆర్ఎస్ ప్యాకెట్లను సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో 108 అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏపీపీఎస్సీ ప్రతినిధి గిరిజారాణి, పరీక్ష కేంద్రాల కళాశాలల ప్రతినిదులు, అధికారులు పాల్గొన్నారు.

నేటి నుంచి కలెక్టర్ల సదస్సు

అమరావతికి చేరుకున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అమరావతిలో మంగళ, బుధవారాల్లో జరిగే కలెక్టర్ల సదస్సులో పాల్గొనేందుకు కలెక్టర్ ఆనంద్ సోమవారం అక్కడకు వెళ్లారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఇది మూడో సదస్సు తొలి సదస్సులో ప్రభుత్వం తమ లక్ష్యాలను వివరించగా, రెండో సదస్సులో జిల్లాస్థాయిలో రానున్న ఐదేళ్లలో చేయాల్సిన అభివృద్ధికి సంబంధించి సీఎం దిశానిర్దేశం చేశారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యంగా ప్రతి జిల్లాకు ప్రత్యేక విజన్ డాక్యుమెంట్ తయారు చేయాలని ఆ సదస్సులో ఆదేశించారు. ఇప్పుడు జరగనున్న మూడో సదస్సులో జిల్లా విజన్ ప్లాన్‌లపై సమీక్ష జరగనుంది. గత సమావేశం తర్వాత జిల్లాస్థాయిలో స్వర్ణాంధ్ర 2047 విజన్ ప్లాన్ తయారు చేశారు. అన్ని ప్రభుత్వ శాఖలతోపాటు ప్రజలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ వర్గాల నుంచి సలహాలు, సూచనలు తీసుకొని వాటన్నిటినీ క్రోడీకరించి 2025-26 యాక్షన్ ప్లాన్‌ను కలెక్టర్ రూపొందించారు. వ్యవసాయం, పరిశ్రమలు ప్రధానంగా రానున్న ఆర్థిక సంవత్సరంలో 15 శాతం వృద్ధిరేటు సాధించడమే లక్ష్యంగా ఈ యాక్షన్ ప్లాన్ తయారు చేశారు. దీనిని సదస్సులో కలెక్టర్ ప్రదర్శించనున్నారు. తొలిరోజు మధ్యాహ్నం వరకూ సీఎం ప్రసంగంతోపాటు రాష్ట్రస్థాయి హెచ్‌వోడీల ప్రెజంటేషన్ ఉంటుంది. మధ్యాహ్నం తర్వాత జిల్లాలపై సమీక్ష జరుగుతుంది. కాగా కలెక్టర్ల కాన్ఫరెన్స్‌కు సంబంధించి కలెక్టర్ ఆనంద్ పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో సోమవారం ప్రజా విజ్ఞప్తుల కార్యక్రమానికి కూడా ఆయన హాజరు కాలేదు.

16 మండలాల్లో శనగల కొనుగోలు కేంద్రాలు

దుత్తలూరు (ఉదయగిరి), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లావ్యాప్తంగా 16 మండలాల్లో శనగల కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ పవన్ తెలిపారు. సోమవారం ఉదయగిరిలోని కమ్మవారిపాళెం సొసైటీ కేంద్రంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విలేకరులతో పవన్ మాట్లాడుతూ క్వింటం రూ.5,650 మద్దతు ధరతో నిర్దేశించిన ప్రమాణాలు పాటిస్తూ రైతుల నుంచి శనగలు కొనుగోలు చేయనున్నట్లు చెప్పారు. ఆయా కేంద్రాల ద్వారా 2 వేల టన్నుల శనగ దిగుబడులను కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ పీ.చెన్నారెడ్డి, పర్సన్ ఇన్‌చార్జి శ్రీనివాసులరెడ్డి, సొసైటీ సీఈవో లోక్‌నాథరెడ్డి, ఏఈవో భోగ్యం సుధీర్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ వేణు, టీడీపీ నాయకులు చీదర్ల మల్లికార్జున, కాకర్ల మధు, చుండి అంజిరెడ్డి పాల్గొన్నారు.

● వరికుంటపాడు (ఉదయగిరి రూరల్) : విరువూరు రైతుసేవా కేంద్రంలో కంది, శనగ కొనుగోలు కేంద్రాలరె మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పవన్‌కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్వింటం కందికి రూ.7,550, శనగకు రూ. 5,650వంతున కనీస మద్దతు ధర ఇవ్వనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏవో రవికుమార్, డీసీఎంఎస్ నిర్వాహకులు సుధాకర్, పాల్గొన్నారు.



వరికుంటపాడు : విరువూరులో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజరు పవన్‌కుమార్

రంజాన్ వేళలు
ఇఫ్తార్ : 6.26 (మంగళవారం సాయంత్రం)
సహరి : 4.54 (బుధవారం ఉదయం)

భూగర్భ జలం.. పుష్కలం!

సరాసరి 5.96 మీటర్ల లోతులోనే నీరు ● ఇప్పటి వరకూ అధిక వర్షపాతం నమోదు

ప్రస్తుతం ప్రాజెక్టుల్లో దండిగా నీరు ● వేసవిలో మంచినీటికి తప్పనున్న ఇక్కట్లు


నెల్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో భూగర్భ జలమట్టం ఆశాజనకంగా ఉంది. గతేడాది భారీగా వర్షాలు కురవడంతో ఈ ఏడాది తక్కువ లోతులోనే భూగర్భ జలాలు ఉన్నాయి. దీని ఫలితంగా ఎక్కడా మంచినీటి సమస్య తలెత్తడం లేదు. ఇప్పటికే రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీరు పుష్కలంగా ఉండటంతో రెండో పంట కూడా సాగు జరగనుంది. కాబట్టి భూగర్భ జలాలు మరింత రీచార్జ్ అయ్యేందుకు అవకాశాలు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. దీంతో వేసవిలో కూడా చాలా వరకూ తాగునీటి సమస్యను అధిగమించవచ్చని అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లా సరాసరి భూగర్భ జలమట్టం 5.69 మీటర్లుగా ఉంది. అంటే దాదాపు అన్ని మండలాల్లో ఆరు మీటర్లలోపే భూగర్భ జలాలు కనిపిస్తున్నాయి. గతేడాది ఫిబ్రవరిలో 5.75 మీటర్లు లోతున జలం ఉండగా, మేలో అది 7.07 మీటర్లకు పడిపోయింది. అప్పుడు ప్రాజెక్టులు, రిజర్వాయర్లు, చెరువుల్లో నీరు లేకపోవడం, తద్వారా రెండో పంట సాగు జరగకపోవడంతో జలాలు జారిపోయినట్లు అధికారులు చెబుతున్నారు. ఆ తర్వాత అక్టోబరు, నవంబరు నెలల్లో భారీ వర్షాలు కురవడంతో భూగర్భ జలాలు మళ్లీ రీచార్జ్ అయ్యాయి. దీంతో నవంబరులో భూగర్భ జలమట్టం 5.76 మీటర్లకు పెరిగింది. ఆ తర్వాత పూర్తి ఆయకట్టు సాగు జరగడంతో పెన్నా నదితోపాటు కాలువల్లో పుష్కలంగా నీరు పారింది. చెరువులు, రిజర్వాయర్లలో నీరు నిల్వ ఉండటంతో జలమట్టం పడిపోలేదు. రాష్ట్రంలో సరాసరిన 8.81 మీటర్లుగా ఉంటే నెల్లూరు జిల్లాలో మాత్రం అది 5.69 మీటర్లుగా ఉండటం విశేషం. జిల్లాలో దాదాపు 20 మండలాల్లో ఆరు మీటర్లలోపే భూగర్భ జలాలు అందుబాటులో ఉన్నాయి. కాగా ఈ దఫా వర్షాలు కూడా జిల్లాలో పుష్కలంగా కురిశాయి. గతేడాది జూన్ నుంచి ఫిబ్రవరి వరకూ 981.73 మీ.మీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 1084.36 మి.మీ వర్షపాతం నమోదైంది. అంటే 10.45 శాతం ఎక్కువ వర్షం కురిసింది. భూగర్భ జలాలు ఆశాజనకంగా ఉండడానికి ఇదే ప్రధాన కారణంగా అధికారులు చెబుతున్నారు. వేసవి ప్రారంభమైన నేపథ్యంలో జిల్లా యంత్రాంగం తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలు రూపొందించింది. అందులో భాగంగా జిల్లాలోని పరిస్థితులను అధ్యయనం చేసి నివేదిక రూపొందించింది. ప్రస్తుత పరిస్థితుల్లో ఈ ఏడాది జిల్లాలో తాగునీటి సమస్య ఏర్పడదని యంత్రాంగం అంచనా వేస్తోంది. ఒకటీ రెండు చోట్ల ఇబ్బందులు తలెత్తినా నీటిని సరఫరా చేసే విధంగా ప్రణాళిక రూపొందించింది.



దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు (విద్య) : ప్రధాన మంత్రి యోగా అవార్డు-2025కి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సెట్నెల్ సీఈవో నాగేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో ప్రతిభ చూపిన వ్యక్తులు, సంస్థలు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. వ్యక్తిగత విభాగంలో 40 ఏళ్లలోపు, సంస్థలైతే 20 ఏళ్ల లోపు అనుభవం ఉండాలన్నారు. ఆసక్తి కలిగిన వారు ఈనెల 31లోగా innovetev india.my gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని వివరించారు.





సచివాలయ కేంద్రం.. పందుల పెంపకం

మండల కేంద్రమైన గుడ్లూరులో గత వైసీపీ పాలనలో నిర్మించిన సచివాలయం, రైతుభరోసా కేంద్ర భవనాలు ఇవి. అప్పట్లోనే 90 శాతం పనులు పూర్తయ్యాయి. రూ.లక్షల వెచ్చించి అప్పటి పాలకులు ఈ భవన నిర్మాణాలు చేపట్టారు. అయితే, బిల్లులు సకాలంలో ఇవ్వకపోవడంతో అర్ధంతరంగా పనులు ఆగిపోయాయి. ఇంకేముంది ఈ భవనాల్లో కింది గదుల్లో పందుల పెంపకం జరుగుతుండగా, పై గదుల్లో మందుబాబులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిపోయాయి. ఈ భవనాల సమీపంలోనే వైద్య ఆరోగ్య కేంద్రం, బాలుర వసతిగృహం ఉండటంతో ప్రజలు, విద్యార్థులు దుర్వాసన భరించలేక అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పూర్తయిన భవనాలను ప్రారంభించి వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.



సచివాలయ భవనంలో దొడ్లు కట్టి పెంచుతున్న పందులు

- గుడ్లూరు, (ఆంధ్రజ్యోతి)

త్రైత సిద్ధాంత భగవద్గీతపై ఇంటింటా ప్రచారం

సంగం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దువ్వూరు, అనసూయ నగర్, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం గ్రామాల్లో త్రైత సిద్ధాంత ప్రబోధానంద సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా త్రైత సిద్ధాంత భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు, ఈ కార్యక్రమంలో ప్రబోధానంద సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.8441
వెండి కిలో ధర	రూ. 1,00,000
వెండి ఒక గ్రాము	రూ.103.00

న్యూస్ బాక్స్

నేడు శ్రీనివాస కల్యాణం



ముస్తాబైన వేంకటేశ్వరస్వామి ఆలయం

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక జాతీయ రహదారి సమీపంలో ఉన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం శ్రవణా నక్షత్రం సందర్భంగా శ్రీనివాస కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు పెండ్యాల సూర్యనారాయణ, అమ్మాజీ దంపతులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ టీటీడీ ఆధ్వర్యంలోని వేదపండితులు స్వామివారి కల్యాణం నిర్వహిస్తారన్నారు. అనంతరం మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉభయకర్తలుగా అశోక్‌నగర్ గ్రామానికి చెందిన వడ్లమూడి నాగేంద్రబాబు, శిరీష దంప తులు, కుటుంబీకులు వ్యవహరిస్తార న్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని ము స్తాబు చేయడంతో పాటు భక్తులకు అన్ని వసతులను ఏర్పాటుచేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

మద్యం దుకాణం తొలగించాలి



సీఐకి సమస్యను వివరిస్తున్న సీపీఎం నాయకులు, గిరిజనులు

అనంతసాగరం మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మినగల్లు గిరిజన కాలనీ వద్ద ఉన్న రేవూరు మద్యం షాపును తొలగించాలని కాలనీ వాసులు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఎం నాయకులతో కలసి ఆత్మకూరు ఎక్సైజ్ సీఐ రమణమ్మకు వినతిపత్రం ఇచ్చారు. షాపును అక్కడనుంచి తొలగించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు లక్ష్మీపతి, అన్వర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

డీసీ పల్లిలో పొగాకు ధరలు

మర్రిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డీసీపల్లి పొగాకు వేలం కేంద్రానికి సోమవారం రైతులు 565 బేళ్లను తీసుకొని రాగా తొమ్మిది కంపెనీల ప్రతినిధులు వేలంలో పాల్గొని 545 బేళ్లను కొనుగోలు చేశారు. వివిధ కారణాలతో 20 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర రూ. 280 కాగా, కనిష్ట ధర రూ. 260గా పలికినట్లు వేలం నిర్వహణాధికారి జి రాజశేఖర్ తెలిపారు.



అదుపు తప్పి బొలెరో వాహనం బోల్తా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వేగంగా వెళ్తున్న ఓ బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన సోమవారం బొగ్యం వారిపల్లి గ్రామ సమీపంలో చోటు చేసు కుంది. వివరాల మేరకు.. కడప జిల్లా బద్వేలు నుంచి అరటి పండ్ల లోడుతో జాతీయ రహదారిపై ఒంగోలుకు వెళ్తున్న ఆ వాహనం టైరు పంక్చర్ కావడంతో అదుపు తప్పి బోల్తాపడింది. దీంతో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి.

యువకుల శ్రమదానంతో రోడ్డుకు మరమ్మతులు

కలువాయి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బస్టాండు ప్రాంతంలో మెయిన్ రోడ్డు ఎత్తుగా ఉండి ద్విచక్ర వాహనదారులు బస్టాండులో నుంచి మెయిన్ రోడ్డు ఎక్కే సమయంలో అదుపుతప్పి కింద పడుతున్నారు. ఈ సమస్య చాలా కాలంగా ఉన్నా పంచాయతీ సిబ్బంది, అధికారులు పట్టించుకోలేదు. చివరకు ఒక దాత మట్టి తోలించడంతో బస్టాండులో చెక్కబండి నడుపుకునే యువకులు ఇద్దరు శ్రమదానం చేసి రోడ్డును చదునుచేసి సమస్య పరిష్కరించారు.

మందా కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం

సంగం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెక్‌పోస్టు ఎస్సీ కాలనీలో సోమవారం రాత్రి ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపకుడు మందా కృష్ణమాదిగ చిత్ర పటానికి పాలభిషేకం చేశారు. ఎస్సీ వర్గీకరణ కల నేరవేరిన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాలనీకి చెందిన పలువురు మాదిగలు పాల్గొన్నారు.

కేజ్ వీల్స్‌తో గ్రామీణ రహదారుల ఛిద్రం

రైతుల అవగాహన లోపం

పట్టించుకోని అధికారులు

సంగం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రైతుల అవగాహన లోపం అధికారుల నిర్లక్ష్యం కారణంగా లక్షల రూపాయలు వెచ్చించి నిర్మించిన గ్రామీణ రహదారులు కేజ్‌వీల్స్ కారణంగా ఛిద్రం అవుతున్నాయి. మండలంలోని తరుణవాయి, చెన్నవరప్పాడు, తలుపూరుపాడు, మక్తాపురం, పెరమన, పల్లిపాళెం, అన్నారెడ్డిపాళెం, మర్రిపాడు, కొరిమెర్ల తదితర గ్రామీణ రహదారులు గతంలో అధ్వానంగా ఉండడంతో గత టీడీపీ హయాంలో అన్ని గ్రామాలకు పంచాయతీరాజ్ ప్రాజెక్టు, రహదారులు భవనాల శాఖ ఆధ్వర్యంలో తారు రోడ్లు నిర్మించారు. కాగా, గ్రామీణ రహదారులకు ఇరువైపులా పొలాలు ఉండడంతో రైతులు పొలాల్లో బురద దుక్కుల్లో దున్నేందుకు ఇంటి వద్దనే కేజ్‌వీల్స్‌ను (ఇనుక చక్రాలు) ట్రాక్టర్లకు తగిలించుకొని రహదారుల మీద నడపడంతో ఛిద్రమవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి రైతులకు అవగాహన కల్పించి గ్రామీణ రహదారులు దెబ్బతినకుండా తగు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.



పల్లిపాళెం రహదారిపై కేజ్ వీల్స్‌తో వెళ్తున్న ట్రాక్టర్



కేజ్‌వీల్స్‌తో ఛిద్రమైన అన్నారెడ్డిపాళెం తారురోడ్డు

క్షయవ్యాధి నిర్మూలనలో భాగస్వాములు కావాలి

ఆత్మకూరు, మార్చి 24 : క్షయవ్యాధి నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని శ్వాసకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ బాలాజీ పిలుపునిచ్చారు. పట్టణంలోని ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రభుత్వ జిల్లా వైద్యశాల ఆర్ఎం డాక్టర్ ఎం ఉషా సుందరి, శ్వాసకోశ వ్యాధి నిపుణులు డాక్టర్ బాలాజీ, ఇన్‌చార్జ్ సూరింటెండెంట్ డాక్టర్ మునికృష్ణ మాట్లాడుతూ సమాజంలో క్షయవ్యాధి నివారణకు ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందన్నారు. రెండు వారాలకు మించి ఎడతెరపి లేని దగ్గు వస్తున్నట్లయితే స్థానిక వైద్యశాలలో సంప్రదించాలన్నారు. ప్రాథమిక దశలోనే గుర్తిస్తే త్వరగా నయం చేయవచ్చన్నారు. వైద్యం పొందేవారికి ప్రభుత్వం ప్రతినెలా రూ. 500 అందజేస్తుందని తెలిపారు. ముందుగా అర్బన్ వైద్యశాల నుంచి వైద్యులు, సిబ్బంది పట్టణ ప్రధాన రహదారి వెంబడి బ్యానర్లు చేతబట్టి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఏవో శ్రీనివాసులరెడ్డి, నర్సింగ్ సూపరిటెండెంట్ కృష్ణకుమారి, యునాని వైద్యులు డాక్టర్ అబ్దుల్‌రజాక్, గైనకాలజిస్ట్ డాక్టర్ కిరణ్, డాక్టర్ దత్తు ప్రసాద్, డాక్టర్ సాలేహా, టీబీ సూపర్ వైజర్లు సుధాకర్, వెంకటేశ్వర్లు, ట్యాబ్ టెక్నీషియన్ సుబహాన్, హెల్త్ సూపర్ వైజర్లు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



సీతారామపురం: క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

●సీతారామపురం : జాతీయ క్షయ వ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా డాక్టర్ ఏ స్వప్న ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ స్వప్న మాట్లాడుతూ మండలంలో క్షయ వ్యాధి నిర్మూలనకు మండల ప్రజలు, నాయకులు వైద్య సిబ్బందికి సహకరించాలని కోరారు.

ఆలయ నిర్మాణానికి సహకరించాలి

● ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వినతి

సీతారామపురం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన సీతారామపురంలో లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా నిధులు మంజూరు చేయించి సహకరించాలని టీటీడీ పాలక మండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని ఆలయ కమిటీ సభ్యుడు డీ వెంకటసుబ్బయ్య కోరారు. ఆయన నెల్లూరులో ప్రశాంతిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. గతంలో టీటీడీ అధికారులు గ్రామానికి విచ్చేసి ఆలయ నిర్మాణానికి ఎకరా స్థలం కావాలని కోరగా దాతలు సమకూర్చారని, సంబంధిత ఫైల్‌ను టీటీడీ పరిపాలన కార్యాలయంలో అందజేశామని, అంతలో ఎన్నికల కోడ్ రావడంతో పాటు ప్రభుత్వం కూడా మారడంతో ప్రక్రియ ముందుకు సాగలేదని ఎమ్మెల్యేకు విన్నవించారు. దీంతో స్పందించిన ఆమె నిర్మాణానికి చర్యలు తీసుకుంటామన్నారు.



ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డికి వినతిపత్రం అందచేస్తున్న వెంకటసుబ్బయ్య

ఉత్తమ సేవకులకు అవార్డులు



జిల్లా అధికారుల చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకుంటున్న వైద్యాధికారిణి శివకల్పన

దుత్తలూరు(ఉదయగిరి), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సీహెచ్‌వో ఓంకారయ్య, సోమల రేగడ ఏఎన్ఎం చంద్రావతిలు విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు పొందారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా నెల్లూరు డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో సుజాత, ఆడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదరవలిల చేతుల మీదుగా వారు ప్రశంసాపత్రాలు అందుకున్నారు. ఈ సందర్భంగా వారికి వైద్య ఆరోగ్య సిబ్బంది అభినందనలు తెలిపారు.

●ఉదయగిరి: మండలంలోని గండిపాళెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న వైద్యాధికారిణి శివకల్పన, హెచ్ఈ వెంకటసుబ్బయ్య, ఆరోగ్య సహాయకులు శ్రీనివాసులు, ఏఎన్ఎం సుప్రజలు డీఎంహెచ్‌వో సుజాత, ఆడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదరవలిల చేతుల మీదుగా ప్రశంసాపత్రాలు అందుకున్నారు.

●సీతారామపురం: విధి నిర్వహణలో ఉత్తమ సేవలు అందించిన ప్రాథమిక ఆరోగ్య సిబ్బందికి అవార్డులు వరించాయి. జిల్లా క్షయ నియంత్రణ అధికారి షేక్ ఖాదర్‌వలీ చేతుల మీదుగా సోమవారం ఎంపిహెచ్‌వో మజీద్, ఏఎన్ఎం సుహాసిని, ఎంఎల్‌హెచ్‌పి వెంకటేశ్వర్లు అవార్డులు అందుకున్నారు. వీరిని వైద్యాధికారి స్వప్న, సిబ్బంది అభినందించారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

ఆత్మకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజలు బకాయిపడిన ఇంటి, నీటి పన్నులు వెంటనే చెల్లించాలని, లేనట్లయితే నోటీసులు జారీచేసి మున్సిపల్ చట్టం 1965 ప్రకారం నీటి కుళాయి కనెక్షన్ తొలగించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ సి గంగాప్రసాద్ సోమవారం తెలి పారు. పన్నులను మున్సిపల్ కార్యాల యంలో గాని, వార్డు సచివాలయంలోగాని ఆన్‌లైన్ ద్వారా అయినా చెల్లించవచ్చన్నారు. మార్చి నెలాఖరులో ఆన్‌లైన్ సర్వర్ సరిగా పనిచేసే అవకాశం ఉండదు కావున వెంటనే పన్నులు చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని కోరారు. పన్నులు సకాలంలో చెల్లించని వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన పేర్కొన్నారు.

సోమశిలలో 54.207 టీఎంసీల నీరు

అనంతసాగరం మార్చి24 (ఆంధ్ర జ్యోతి): సోమశిల జలాశయం పూర్తి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారం నాటికి 54.207 టీఎంసీలు నిల్వ ఉంది. డెల్టాకు 500, ఉత్తర కాలువకు 400, దక్షిణ కాలువకు 350, కండలేరుకు 200 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

ఎస్టీవోగా షేక్ ఉస్మాన్ బాధ్యతల స్వీకరణ

ఉదయగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి ఉప ఖజానాధికారిగా షేక్ ఉస్మాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వెంకటగిరి ఉప ఖజానా కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన పదోన్నతిపై ఉదయగిరి ఎస్టీవోగా నియమితులు కావడంతో బాధ్యతలు చేపట్టారు.



కలెక్టర్ ఆదేశాలతో రైతుల సమస్య పరిష్కారం

కలువాయి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పొలం వద్దకు వరికోత మిషన్ తీసుకెళ్లేందుకు దారిలేక ఆందోళన చెందుతున్న రైతులకు సోమవారం జిల్లా కలెక్టర్ ఆదేశాలతో రెవెన్యూ అధికారులు దారి ఏర్పాటుచేశారు. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బ్రాహ్మణపల్లిలో రైతులు సాగు చేసిన వరిపైరు కోతలు ప్రారంభించడానికి వరికోత మిషన్ వెళ్లెందుకు మొదట్లో పొలం ఉన్న వ్యక్తి దారి ఇవ్వలేదు. దీంతో రైతులు స్థానిక రెవెన్యూ, పోలీసులకు ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కాకపోవడంతో సోమవారం జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకుపోయారు. దీంతో కలెక్టర్ ఆదేశాలతో సోమవారం సాయంత్రం ఆర్ఐ, వీఆర్వో, సర్వేయర్ పొలం వద్దకు వెళ్ళి సర్వేచేసి వరికోత యంత్రం లోపలికి వెళ్లేందుకు దారి తీయించారు. కాగా, దారి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు అధికారులను కోరుతున్నారు.



పొలం సర్వే చేసి రైతులకు దారి చూపుతున్న అధికారులు

పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలి : సీపీఎం

ఆత్మకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి కె డేవిడ్‌రాజు కోరారు. సోమవారం ప్రజాచైతన్య యాత్రలో భాగంగా సీపీఎం ఆధ్వర్యంలో పట్టణ ప్రధాన రహదారి వెంబడి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో మూడు నెలలుగా పేదలకు రేషన్ బియ్యం సక్రమంగా అందడం లేదన్నారు. మున్సిపాల్టీ పరిధిలో సర్వే నెం 1953ను ఫ్రీహోల్డ్ చేసి పేదప్రజల నివాస స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఈమేరకు వారు ఆర్డీవో బి పావనికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ నాయకులు యస్థానీబాషా, ఐద్వా నాయకురాలు గుల్జార్‌బేగం, సీపీఎం ఏకలవ్యనగర్ కార్యదర్శి నందా శ్రీను, పలువురు మహిళలు పాల్గొన్నారు.



ఆర్డీవోకి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

మేత పోరంబోకు భూమిని కళాశాలకు కేటాయించొద్దు

ఉదయగిరి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సున్నంవారి చింతల గ్రామంలోని సర్వేనెంబర్ 152-ఏలో వంద ఎకరాల మేతపోరంబోకు భూమిని ఉదయగిరి ఎంజీఆర్ ప్రభుత్వ వ్యవసాయ కళాశాలకు కేటాయించవద్దని సోమవారం గ్రామస్థులు తహసీల్దారు సుభద్రకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఆ భూమిలో మూగ జీవాలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. రెవెన్యూ అధికారులు గ్రామసభ నిర్వహించి ప్రజల అభిప్రాయాలను సేకరించకుండా కళాశాలకు కేటాయించేందుకు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కళాశాలకు భూమిని కేటాయిస్తే ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు.



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్థులు

కాలనీల్లో సమస్యల పరిష్కారం కోసం గిరిజనుల ధర్నా

అనంతసాగరం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తమ కాలనీల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మండల గిరిజనులు సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేశారు. కొత్తబస్టాండ్ నుంచి ర్యాలీగా తహసీల్దారు కార్యాలయం వద్దకు చేరుకుని బైఠాయించి సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. అనంతరం తహసీల్దారు సుభాషిణికి వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, వేము పెంచలయ్య, గాడి సుధాకర్, సత్తార్, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న గిరిజనులు, నాయకులు


ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి: డీఎల్‌డీవో

మర్రిపాడు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గతంలో మంజూరై అర్థాంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలను, ప్రారంభ దశలో ఉన్న వాటిని త్వరితగతిన పూర్తిచేయాలని డిఎల్‌డివో రమణయ్య సూచించారు. మండల ప్రత్యేకాధికారిగా వ్యవహరిస్తున్న డిఎల్‌డివో రమణయ్య సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం ఏర్పాటుచేశారు. ఇళ్ల నిర్మాణం భారంగా మారుతుండటంతో ఎస్సీ, బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు అదనంగా ప్రభుత్వం ఇస్తుందని, లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరప్రసాద్, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఇ సయ్యద్ అబ్దుల్ జమీల్ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

భయపెడుతున్న తుపాకీ చప్పుళ్లు

- నగరంలో పేలిన లైసెన్స్‌డ్ గన్
- గతంలోనూ దోపిడీ కోసం బెదిరింపులు
- ఇప్పటికీ కళ్లముందే తాడిపర్తి ఘటన
- కావలి తనిఖీల్లో వెలుగు చూసిన వెపన్



పోలీసులు స్వాధీనం చేసుకున్న లైసెన్స్‌డ్ పిస్టల్

నెల్లూరు(క్రైం),మార్చి 23 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గన్‌కల్చర్ పెద్దగా లేకపోయినా కొన్నేళ్లుగా జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. జిల్లాలో బ్యాంకులకు ఇచ్చిన తుపాకీలతోపాటు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన గన్‌లు 533పైగా ఉన్నాయి. లైసెన్స్ లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి తుపాకీ తీసుకువచ్చి యువతని హత్య చేసి, యువకుడు ఆత్మహత్య చేసుకోవడం కొంతకాలం క్రితం పొదలకూరులో జరిగింది. ఈడీ అధికారులమంటూ గన్ చూపించి నగరంలో బంగారు దోపిడీకి కొందరు యత్నించారు. ఇటీవల కావలిలో ఓ ఇంట్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఇక నగరంలోని ఆచారివీధిలో ఈనెల 22న ఆస్తి తగాదాల్లో పేలిన పిస్టల్ మరోసారి జిల్లాలో చర్చకు దారితీసింది.

● **సంచలనంగా మారిన తుపాకీ ఫైర్**

● 2022లో నగరంలోని లావణ్య జ్యూయలరీస్‌లో దోపిడీకి యత్నించిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి వద్ద నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు చెన్నైలో నకిలీ ఐడీ కార్డులు, పోలీసు యూనిఫారమ్ కొనుగోలు చేయడంతోపాటు రూ.7 వేలు చెల్లించి ఎయిర్ పిస్టల్‌ను కొనుగోలు చేసినట్లు తేల్చారు.

● పొదలకూరు మండలం తాడిపర్తిలో తనతో వివాహనికి అంగీకరించలేదని ఓ యువకుడు గన్‌తో యువతిని కాల్చి హత్య చేశాడు. అదే గన్‌తో తను కూడా కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో పోలీసులు లోతుగా పరిశీలించగా, ఆ యువకుడు బిహార్‌కు వెళ్లి పిస్టల్‌ను కొనుగోలు చేసి నెల్లూరుకి తీసుకు వచ్చినట్లు తేలింది.

● ఇకపోతే ఇటీవల కావలిలో పోలీసులు ఓ రౌడీషీటర్ ఇంట్లో తనిఖీలు చేయగా, తుపాకీ దొరికింది. ఇలా జిల్లాలో అనుమతులు లేని గన్‌లతో హత్యలు, దోపిడీ యత్నాలు, బెదిరింపులు జరుగుతున్నాయి.

● ఆస్తి పంపకాల విషయమై నగరంలోని ఆచారివీధిలో ఈనెల 22న రాత్రి హితేష్‌కుమార్ జైన్ తన స్నేహితులతో కలిసి తండ్రి ఇంటి వద్దకు వచ్చి తలుపులు తీయాలని కేకలు వేశాడు. తీయకపోవడంతో తన లైసెన్స్‌డ్ పిస్టల్‌ను తీసి తలుపుపై కాల్చారు. ఈ ఘటన కూడా జిల్లాలో చర్చనీయాంశమైంది.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

● పిస్టల్, 26 రౌండ్స్ స్వాధీనం

నెల్లూరు(క్రైం), మార్చి 24: హత్యాయత్నం కేసులో నగరంలోని చిన్నబజారు పోలీసులు సోమవారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పిస్టల్, 26 రౌండ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని రావూరివీధిలో రాజ్‌మల్ జైన్ నివాసం ఉంటున్నారు. ఆయన కుమారులు దిలీప్‌కుమార్ జైన్, హితేష్ కుమార్ జైన్, మనోజ్‌కుమార్. రెండో కుమారుడు హితేష్‌కుమార్ జైన్‌కు పెళ్లయ్యాక శిఖరంవారివీధిలో వేరుగా కాపురం ఉంటున్నాడు. పెద్దకుమారుడు వద్ద రాజ్‌మల్‌జైన్, ఆయన భార్య ఉంటున్నారు.ఈ క్రమంలో హితేష్‌కుమార్ జైన్‌కు ఆస్తిలో కొంతభాగం ఇవ్వడంతో ఆయన ప్రస్తుతం సుబేదారు పేటలో వ్యాపారం చేసుకుంటున్నారు. కాగా ఆస్తి పంపకాలు చేయాలని హితేష్‌కుమార్ జైన్ అప్పుడప్పుడు ఇంటికి వెళ్లి తండ్రిని అడిగేవాడు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య వివాదాలు జరుగుతూ ఉండేవి. ఈ నెల 22న అర్ధరాత్రి హితేష్‌కుమార్ జైన్ తన స్నేహితులు వంశీ, పల్లి భరత్, రాజశేఖర్‌రెడ్డి, సందీప్, కిషోర్ కలిసి దిలీప్‌కుమార్ ఇంటికి వచ్చి ఇంటితలుపులు కొట్టారు. తలుపులు తీయకపోవడంతో తన వద్ద ఉన్న పిస్టల్‌తో హితేష్‌కుమార్ జైన్ తలుపులను కాల్చి అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో దిలీప్‌కుమార్ జైన్ ఆస్తి పంపకాలు చేయక పోవడంతో తన తమ్ముడు స్నేహితులతో కలిసి వచ్చి పిస్టల్‌తో కాల్చి చంపే ప్రయత్నం చేశాడని ఈనెల 23న చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ముద్దాయిలను సోమవారం నగరంలోని వాకర్స్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో అరెస్టు చేసి వారి వద్ద నుంచి లైసెన్స్ పిస్టల్‌ను, 26రౌండ్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో ప్రతిభ కనబరి చిన అధికారులు, సిబ్బందిని నగర డీఎస్పీ సింధు ప్రియ అభినందించారు.

ట్రాప్ కెమెరాల చోరీ

ఉదయగిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తపల్లి బీట్ పరిధి దిరిశనమాను బండ ప్రాంతంలోని నీటికుంట వద్ద ఏర్పాటు చేసిన నాలుగు ట్రాప్ కెమెరాలు చోరీకి గురైన సంఘటన సోమవారం వెలుగుచూసింది. అటవీ ప్రాంతంలో జంతువుల, వేటగాళ్ల కదలికలను తెలుసుకునేందుకు ఇటీవల ఉదయగిరి అటవీశాఖ పరిధి లోని పలు ప్రాంతాల్లో అధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేశారు. అటవీ ప్రాంతానికి వేటకు వెళ్లినవారు ఈ కెమెరాలను చోరీచేసి ఉంటారని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాను వివరణ కోరగా కెమెరాల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.

లైంగిక వేధింపుల కేసులో జీవితఖైదు

నెల్లూరు (లీగల్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికకు మామిడికాయలు తీసిస్తానని చెప్పి, చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు సన్రెడ్డి సుబ్రహ్మణ్యంకు జీవితఖైదుతో పాటు రూ.22వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, సైదాపురం మండలం జప్లాపురంకు చెందిన బాలిక(10) 2021 ఏప్రిల్ 29వతేదీ ఉదయం 10గంటల సమయంలో ఆడుకుంటుండగా, అదే మండలం చాగణం ఎర్ర సంఘానికి చెందిన సన్రెడ్డి సుబ్రహ్మణ్యం బాలికకు మామిడికాయలు కొనిస్తానని సమీపంలోని చెట్ల పొదలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా జైలుతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ. చం ద్రశేఖర్ వాదించారు.

ఇరువర్గాల ఘర్షణ

● అక్కాచెల్లెళ్లకు గాయాలు

కావలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుడంగుంట కాలనీలో సోమవారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో అక్కాచెల్లెల్లు కీర్తి, తాళ్లూరు నాగమణికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు.. కాలనీలో నివాసముంటున్న కీర్తి, నాగమణిలు ఇం టి వద్ద నుంచి అల్పాహారం తెచ్చుకునేందుకు దుకాణం వద్దకు వె ళ్తుండగా పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని అదే ప్రాంతానికి చెం దిన బెల్లంకొండ నరేంద్ర, దివ్య, హజరత్, ప్రసన్నలు వారితో వివా దానికి దిగారు. ఈ ఘర్షణలో అక్కాచెల్లెల్లు కీర్తి, తాళ్లూరు నాగమణి లపై కర్రలతో దాడి చేసి కొట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గాయపడిన కీర్తి, నాగమణి

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 435



కందుకూరు పట్టణంలో అభివృద్ధి పనులు చేపట్టనున్న పామూరు రోడ్డు సర్కిల్

» పామూరు రోడ్డు సర్కిల్‌లో ఆక్రమణలు తొలగించేనా?
» యథావిధిగా అభివృద్ధి చేస్తే మరింత ఇబ్బంది
» రూపుమారిన ట్రాఫిక్ సమస్య తీరేనా?

కందుకూరు ముఖద్వారానికి

మహర్దశ పట్టేనా!

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణ ముఖద్వారంగా భావించే పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి ఎట్టకేలకు మోక్షం కలగడంపై ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది. అయితే గుడ్లూరు-కావలి రోడ్డుతో పాటు పట్టణంలోని ప్రధానరోడ్లు కలుస్తూ నాలుగురోడ్ల కూడలిగా, కందుకూరు ముఖద్వారంగా ఉన్న పామూరు రోడ్డు సర్కిల్ ఆక్రమణలతో కుచించుకుపోయింది. ఫలితంగా నాలుగువైపుల నుంచి వచ్చే వాహనాలు కనిపించక తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో గతంలో పలుమార్లు తాత్కాలికంగా ఆక్రమణల తొలగించినా ప్రయోజనం లేదు. ప్రస్తుతం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఈ సర్కిల్ అభివృద్ధిని ప్రాధాన్యతగా తీసుకుని రూ.1.07 కోట్ల నుడా నిధులతో పనులకు శ్రీకారం చుట్టారు. సర్కిల్‌లో కందుకూరుకు ఐకానిక్‌గా ఉండేలా స్వాగత నిర్మాణం చేయాలన్న ఆలోచనతో ఈ పనులకు రూపకల్పన చేశారు. అయితే ఈ సర్కిల్‌లో నాలుగువైపుల ఉన్న ఆక్రమణలు తొలగించాకే సర్కిల్ అభివృద్ధి చేయాలని ప్రజలు కోరుతున్నారు. ఆక్రమణలు తొలగించకుండా సర్కిల్ అభివృద్ధి చేసినా సమస్య మరింత పెరగటం తప్ప పరిష్కారం ఉండదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. పామూరు సర్కిల్‌తో పాటు అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు సెంట్రల్ డివైడర్ ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు గతంలో తెలుపగా ప్రస్తుతం కేవలం సర్కిల్ అభివృద్ధికి రూ.10 లక్షలు మాత్రమే కేటాయించి 97 లక్షలు గుడ్లూరు రోడ్డు డ్రైన్ నిర్మాణం కోసం మని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. ఆక్రమణల పూర్తిస్థాయిలో తొలగించకుండా రోడ్డు మధ్యలో సర్కిల్ నిర్మిస్తే సమస్య జటిలమవుతుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పామూరు రోడ్డు సర్కిల్ నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు డివైడర్, సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేయాలన్నా ఆక్రమణల తొలగింపుతో పాటు కొన్ని ప్రాంతాల్లో భూసేకరణ కూడా చేయాల్సి వస్తుందని అభిప్రాయం ప్రజల్లో వ్యక్తమవుతోంది. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి రిలయన్స్ స్మార్ట్ వరకు డివైడర్ ఏర్పాటుకు అనువుగా రోడ్డు విశాలంగా ఉన్నప్పటికీ అక్కడి నుంచి పామూరు రోడ్డు సర్కిల్ వరకు డివైడర్ ఏర్పాటు చేసేందుకు కావలసిన రోడ్డు లేదు. ప్రస్తుతం ఈ మార్గంలో నిత్యం ట్రాఫిక్ స్తంభిస్తూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇక డివైడర్ పెడితే రోడ్డు మరీ కుచించుకుపోతోంది. ఈ ప్రాంతంలో పలు బ్యాంకులు ఉండటంతో ద్విచక్రవాహనాలు రోడ్డుపైనే పార్కు చేయడం పరిపాటిగా మారింది. దీంతో ఎదురెదురుగా వాహనాలు వస్తే తొలిగే పరిస్థితి ఇప్పుడే ఉండటం లేదు.

డివైడర్, సెంట్రల్ లైటింగ్‌కు అంచనాలు రూపొందిస్తాం

కందుకూరు పట్టణం పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధికి మాత్రమే ప్రస్తుతం నిధులు కేటాయించాం. అక్కడి నుంచి ఎన్టీఆర్ విగ్రహం వరకు సెంట్రల్ లైటింగ్‌తోపాటు డివైడర్ ఏర్పాటుకు ఆలోచన చేస్తున్నాం. రాష్ట్ర ప్రభుత్వం రూ.5 కోట్ల నిధులు విడుదల చేసినందున ఆ నిధులతో పనులు చేసేలా అంచనాలు రూపొందిస్తున్నాం.

- గణపతి, మున్సిపల్ డీఈ

న్యూస్ బాక్స్

నేడు టీఆర్‌ఆర్‌లో జాబ్‌మేళా

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని టీఆర్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఒక ప్రకటనలో కోరారు. హెటిరో ల్యాబ్స్, ఏరీస్ ఆగ్రో, ఎస్‌బీఐ కార్డ్స్, డైకిన్, పేటీఎం తదితర సంస్థలు ఈ జాబ్ మేళాలో పాల్గొని 190మంది వరకు ఉద్యోగాలకు ఎంపిక చేసుకోనున్నాయని తెలిపారు.

ఉపాధి కూలీలకు కూలి బకాయిలు చెల్లించాలి

ఉలవపాడు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ కూలీల రోజువారి కూలి బకాయిలు రూ.3,422 కోట్లు వెంటనే విడుదల చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆర్ మోహన్ ఒక ప్రకటనలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేంద్రంలో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసేందుకు బడ్జెట్‌లో నిధులు కోత విధించిందని పేర్కొన్నారు. ఉపాధి నిధులు సక్రమంగా విడుదల కావడం లేదని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ ఈనెల 12న పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో పేర్కొందని తెలిపారు. ఆధార్‌కార్డు లింక్ కాలేదని సుమారు 90 లక్షల మంది కూలీలను పథకానికి దూరం చేసిందని, ఆధార్ తప్పనిసరి షరత్‌ను తొలగించాలని సూచిందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూలీల వేతనాలు విడుదలపై నిర్లక్ష్యం విడనాడాలని తెలిపారు. పని ప్రదేశాల్లో కూలీలకు రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు.

కేజీబీవీలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

కొండాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరంలో 6, 11 తరగతులలో ప్రవేశానికి దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపాల్ టీ.జయంతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన విద్యార్థినులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో ఆన్‌లైన్లో ఏప్రిల్ 11వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు.

పీజీఆర్‌ఎస్‌కు అధికారుల డుమ్మా

వలేటివారిపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి పలు శాఖల అధికారులు డుమ్మా కొట్టారు. కేవలం ఎంపీడీవో, తహసీల్దారు, ఉపాధిహామీ పథకం ఏపీవో, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మాత్రమే హాజరయ్యారు. మిగిలిన వివిధ శాఖలకు చెందిన మండలస్థాయి అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు అసహనం వ్యక్తం చేశారు. అధికారులు లేని ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ఎందుకని ప్రశ్నిస్తున్నారు. ఈ కార్యక్రమానికి డుమ్మా కొట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పీ-4 విధానంతోనే సమగ్రాభివృద్ధి

కొండాపురం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పీ-4 విధానంతో సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని మాజీ జడ్పీటీసీ దామా మహేశ్వరరావు అన్నారు. స్థానిక సచివాలయ ఆవరణలో ఈ విధానంపై గ్రామస్థులకు సోమవారం జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సర్పంచు పాలకీర్తి కోటేశ్వరమ్మ, గుడవళ్లూరు సొసైటీ మాజీ అధ్యక్షుడు కుంకు మోహనరావు, సెంట్రల్ టెలికాం బోర్డు అడ్వైజరీ మెంబరు తానికొండ అనూష, పంచాయతీ కార్యదర్శి ప్రదీప్, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు యువత దూరంగా ఉండాలి

బిట్రగుంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి సామాజిక సేవతో ముందుకు సాగాలని కావలి రూరల్ సీఐ పాపారావు అన్నారు. సోమవారం బోగోలు మండలం తిప్ప పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన ఆయన స్థానిక సమస్యలపై ఎస్సై భోజ్యను అడిగి తెలుసుకున్నారు. యువతను తప్పుదోవ పట్టించే బెట్టింగులపై గట్టి నిఘా ఉంచమన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కందుకూరు పట్టణంలో 11కేవీ వీఏపీ ఫీడర్ మీద లైన్‌వర్క్ ఉన్నందున మంగళవారం ఉదయం తొమ్మిదిన్నర నుంచి మధ్యాహ్నం మూడున్నర గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు టౌన్ ఏఈ టీవీ నరసింహం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని తూర్పు వడ్డిపాలెం, తూర్పు కమ్మపాలెం, సాలిపాలెం, మారెమ్మ మిట్ట, కోటారెడ్డినగర్, హీరోహోండా షోరూం ఏరియా, క్లబ్‌రోడ్డు, ఆదిఆంధ్ర కాలనీ ప్రాంతాల వినియోగదారులు అసౌకర్యాన్ని గుర్తించాలని కోరారు.

ముగిసిన సీపీఎం ప్రజా చైతన్య యాత్ర

● సమస్యలపై మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



ధర్నా నిర్వహిస్తున్న సీపీఎం నేతలు

కావలిటౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సీపీఎం ఆధ్వర్యంలో పట్టణంలో 10 రోజుల పాటు జరిగిన ప్రజా చైతన్య యాత్ర సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా గుర్తించిన పట్టణ పరిధిలోని సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేసి మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ పట్టణంలోని 40వార్డులలో పర్యటించామని ఎక్కడ చూసిన సమస్యలతో ప్రజలు సతమతమతున్నారన్నారు. ప్రధానంగా పేదలు, గిరిజనులు నివశించే కాలనీల్లో కనీస మౌలిక వసతులుఏ లేక దుర్భరజీవితాలు జీవిస్తున్నారని విమర్శించారు. మున్సిపాలిటీ ట్యాంకర్లు కూడా సరిగ్గా నీటి సరఫరా చేయడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో నేతలు కృష్ణయ్య, తిరుపాలు, కృష్ణమోహన్, మధుసూదన్‌రావు, మాల్యాద్రి, కాలేషా తదితరులు పాల్గొన్నారు.

కావలి ప్రజలకు సేవకుడిగా పనిచేస్తా

● ఎమ్మెల్యే కావ్య కృష్ణారెడ్డి



ప్రత్యేక అలంకరణలో ఉన్న స్వామి, అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే కృష్ణారెడ్డి

కావలి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కా వలి ప్రజలకు సేవకుడిగా పనిచేస్తానని ఎమ్మె ల్యే కావ్య క్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొత్తసత్రంలో సోమవారం జరిగిన వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభు త్వ లక్ష్యమన్నారు. కొత్తసత్రంలో 500 మంది రైతుల అనుభవంలో ఉన్న భూములకు పట్టాలు లేక పోవటంతో వారు ఏ పథకానికి అర్హులు కాలేకపోతున్నారని, ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి త్వరలో పట్టాలు ఇప్పిస్తామన్నారు. తాగునీటి అవసరాల కోసం సొంత నిధులతో వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తాని హామీ ఇచ్చారు. తుమ్మల పెంట రోడ్డు నిర్మాణంలో అడుగడుగున ఆటంకాలు సృష్టిస్తున్నారని, ఎన్ని అడ్డంకులు వచ్చినా త్వరలో రోడ్డు నిర్మాణం పూర్తి చేయిస్తానన్నారు. ఆయకట్టు స్థిరీకరణ కోసం రూ.52 కోట్లతో కొండేపి డ్రెయిన్ పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రూరల్ మండల అధ్యక్షుడు ఆవుల రామక్రిష్ణ, జనసేన నాయకుడు సిద్ధూ, స్థానిక నాయకులు సోమయ్యగారి రమణ, విక్రమ్‌రెడ్డి, మస్తాన్, పులి రమేష్, కొండూరు తిరుపతి, ఉప్పాల దినేష్, రవీంద్ర, తాతయ్య, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

కావలికి పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి పాదయాత్ర



పట్టణంలో పాదయాత్రగా వస్తున్న ప్రజ్ఞానంద సరస్వతి

కావలిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పెనుగొండ క్షేత్ర పీఠాధిపతి ప్రజ్ఞానంద సర్వతి తెనాలి నుంచి తిరుమలకు చేపట్టిన పాదయాత్ర సోమవారం కావలికి చేరింది. మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షుడు తటవర్తి రమేష్, శిరీష దంపతుల పర్యవేక్షణలో ఆర్యవైశ్యులు, పురప్రజలు ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఆయన కన్యకా పరమేశ్వరిని దర్శించుకుని పూజలు నిర్వహించి పాదయాత్రగా బృందావనం కాలనీ కల్యాణ మండపానికి చేరుకున్నారు. ప్రజలు, వ్యాపారులు ఆయనకు పాదాభివందనం చేసి ఆశీర్వాదం అందుకున్నారు. అనంతరం కల్యాణమండపంలో బాలస్వామీజి యాజ్ఞక నిర్వహణలో అర్చక బృందం మంత్రోచ్ఛరణలతో నిర్వహించిన శ్రీనివాస కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. కార్యమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ తటవర్తి వాసు, కొండ బిట్రగుంట బిలకూట క్షేత్రం పాలకమండలి మాజీ చైర్మన్ శ్రీరామ్ మాల్యాద్రి, సంఘం బాధ్యులు ఓరుగంటి రామకృష్ణ, చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి అవార్డులు



అడిషనల్ డీఎంహెచ్‌వో ఖాదర్‌వలితో ప్రశంసాపత్రాలు అందుకున్న కలిగిరి వైద్యసిబ్బంది

కలిగిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ నిర్మూలన దినోత్సవంలో భాగంగా మండలంలోని క్షయ వ్యాధిగ్రస్తులకు ఉత్తమ సేవలు అందించినందుకు గాను ఏఎన్ఎంలు కే అనిత, బీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ వై లక్ష్మీప్రసన్న, ఆశా కార్యకర్త పీ మంజులకు జిల్లా క్షయ నియంత్రణ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి జిల్లా కేంద్రంలో సోమవారం అవార్డుతోపాటు ప్రశంసాపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అవార్డు గ్రహీతలకు పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ బిజ్జం గీతారెడ్డి, సిబ్బంది అభినందనలు తెలిపారు.

కార్మికులపై వేధింపులు ఆపాలి : సీఐటీయూ



పూర్తిగా నిండిన చెత్తబండిని తోయలేక అవస్థ పడుతున్న కార్మికురాలు

కావలిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): కార్మికుల పట్ల వేధింపులు ఆపాలని సీఐటీయు పట్టణ కార్యదర్శి వై కృష్ణమోహన్ పేర్కొన్నారు. సోమవారం సీఐటీయు ఆధ్వర్యంలో వార్డుల్లో పర్యటించి పారిశుధ్య కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిశీలించారు. మహిళా కార్మికులు అధిక బరువుండే పుష్‌కార్టులు తోయలేక నానా అవస్థలు పడుతుండడాన్ని గుర్తించి ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని గతంలో పలు దఫాలు కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకో లేదని ఆరోపించారు.

పీజీఆర్‌ఎస్‌కు భూ సమస్యలు

బిట్రగుంట, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బోగోలు మండల తహసీల్దారు కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఏకే కండ్రిక, జక్కేపల్లి గూడూరు, ఎస్సీపాలెం, అక్కరాజు వారి కండ్రిక గ్రామాలకు చెందిన పలువురు రైతులు భూ సమస్యలపై అర్జీలు అందజేసినట్లు తహసీల్దారు సురేష్‌బాబు తెలిపారు. వాటిని స్వీకరించిన తహసీల్దారు పరిశీలించి త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లు, కాలువలు, వీధి దీపాలు, తాగునీటి సమస్యలపై మండల సీపీఎం నేత తుమ్మల వెంకయ్య ఎంపీడీవో సుబ్రహ్మణ్యంకు వినతిపత్రం అందచేశారు. ఆయన వెంట సీఐటీయు మండల నేతలు చల్లా నరహరి, అన్వర్‌బాషా, సీపీఎం నేతలు ఉప్పాల యానాదయ్య, బ్రహ్మయ్య, భాస్కర్ ఉన్నారు.

మినీ లారీ బోల్తా

● డ్రైవర్‌కి గాయాలు



బోల్తాపడిన బియ్యం లారీ

గుడ్లూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గుడ్లూరుకు సమీపంలో కందుకూరు-గుడ్లూరు రోడ్డుపై సోమవారం బియ్యం లోడుతో వెళుతున్న మినీలారీ అదుపు తప్పి బోల్తా పడింది. షాపులకు వేసేందుకు పాలీస్ రైస్‌ను కావలి నుంచి గుడ్లూరు మీదుగా కందుకూరుకు వెళుతుండగా గుడ్లూరు ఉప్పుటేరు దాటిన తరువాత ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి రోడ్‌మార్జిన్‌లో అదుపుతప్పి పొలంలో బోల్తా పడింది. ఈ ఘటనలో లారీ డ్రైవర్ గోవింద్‌కు స్వల్పగాయాలయ్యాయి. అనంతరం ఎక్స్‌కవేటర్‌తో వాహన్నా రోడ్డుపైకి తెచ్చారు.

నివాసాల మధ్య ప్రమాదకర గుంతలు

కావలి రూరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు ఇందిరమ్మకాలనీలో నివాసాల మధ్యన ఉన్న గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయని కాలనీవాసులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అట్టల ఫ్యాక్టరీ కాలనీ, వికలాంగుల కాలనీ, వినాయక కాలనీలకు సమీపంలో గతంలో బొంతరాయి తవ్వకాలు జరపడంతో ఈ గుంతలు ఏర్పడ్డాయి. ఒక్కో గుంట సుమారు 20 అడుగుల మేరకు లోతు ఉండటంతో పాటు వర్షాకాలంలో వర్షపు నీరు నిలుస్తుందని చెబుతున్నారు. చిన్నారులు ఆడుకుంటూ వెళ్లి అందులో పడి ప్రమాదాలకు గురవుతారని వాపోతున్నారు. అధికారులు, పాలకులు స్పందించి గుంతలు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



దివ్యాంగుల కాలనీ సమీపంలోని గుంతలు

ఎనిమిది నెలల్లో రూ.6 కోట్లతో అభివృద్ధి

● రూ.1.37 కోట్ల పనులకు ఎమ్మెల్యే ఇంటూరి శంకుస్థాపన



లింగసముద్రం: అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి ఛ్చిన 8 నెలల్లో కందుకూరు పట్టణంలో రూ.6 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. పట్టణంలో రూ.1.37 కోట్లతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. రూ.1.07 కోట్లతో పామూరు రోడ్డు సర్కిల్ అభివృద్ధి, అక్కడి నుంచి మాచవరం రోడ్డుకు స్టోమ్ వాటర్ డ్రైన్ నిర్మాణం, నాంచారమ్మ కాలనీలో రూ.30 లక్షలతో సిమెంటురోడ్డు, డ్రైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అలాగే పట్టణంలోని శంకర్ బుక్‌స్టాల్ ఎదురుగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.అనూష, డీఈ గణపతి, టీడీపీ నాయకులు ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, చిలకపాటి మధుబాబు, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, బె జవాడ ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

● ముస్లింలకు ఇఫ్తార్ విందు

కందుకూరు పట్టణంలోని ముస్లింలకు పవిత్ర రంజాన్‌మాసం సందర్భంగా సోమవారం రాత్రి ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. శివాలయం సమీపంలోని పెద్దమసీదులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్‌లో ఎమ్మెల్యే స్వయంగా పాల్గొని ముస్లింలతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించటంతో పాటు భోజనం వడ్డించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, షేక్ రఫీ, షేక్ సలాం, నాయబ్‌రసూల్, మున్నా, మహబూబ్ బాషా, నజీర్, గౌస్‌బాషా, అహ్మద్‌బాషా, ఖలీల్, ఫాజిల్ తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి

లింగసముద్రం : మండలంలో భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు చెప్పారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం ఆవరణలో జరిగిన ప్రజా దర్బార్ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పలు గ్రామాల నుంచి వచ్చిన రైతులు, ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పశువుల మేత పోరంబోకు భూమిలో చాలా కాలం క్రితం ఇళ్లు నిర్మించుకున్న తమకు పొజిషన్ సర్టిఫికెట్లు ఇప్పించాలని బాధితులు ఎమ్మెల్యేను కోరారు. అసైన్డ్ భూములకు వెబ్‌సైట్‌లో 1బి, అడంగలు రాకపోవడంతో తాము పంట రుణాలు తీసుకోలేకపోతున్నామని బాధితులు వాపోయారు. అయితే వీటిని ప్రభుత్వమే నిలుపుదల చేసిందని తహసీల్దారు సీతామహాలక్ష్మి ఎమ్మెల్యేకు వివరించారు. అలాగే తాము కొనుగోలు చేసిన అసైన్డ్ భూములను తమ పేరుతో మ్యుటేషన్ చేసి పాస్ పుస్తకాలు ఇప్పించాలని మరికొందరు రైతులు కోరారు. దీంతో ఈ కార్యక్రమంలో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిశీలించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆయన చినపవని పంచాయతీకి మంజూరైన ట్రాక్టర్‌ను ప్రారంభించి అధికారులకు అప్పగించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ పీవీ నారాయణరెడ్డి, ఎంపీడీవో కె.శ్రీనివాసులు, ఏఈ నాగరాజు, ఏపీఎం కే.సింహాద్రిరావు, వైద్యాధికారి డాక్టర్ అనూరాధ, ఏఈ షేక్ ఫిరోజ్, టీడీపీ మండల అధ్యక్షుడు వేముల గోపాలరావు, తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న యూనియన్ నేత మల్లి అంకయ్య

కావలి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లి అంకయ్య కోరారు. ఈ మేరకు సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలసి ధర్నా చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ జీ.శ్రావణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని, వయస్సు రీత్యా తొలగించిన కార్మికుల ఈపీఎఫ్ సెటిల్‌మెంట్ చేసి వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగ అవకాశం కల్పించాలన్నారు. ఈపీఎఫ్, ఈఎస్ఐ సమస్యలు పరిష్కరించాలని చెప్పారు. కార్మికుల సంఖ్యను పెంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు వై.నారాయణ, టీ.వెంకటేష్, జీ.అంకయ్య, ప్రభావతి, కే.లక్ష్మి, బీ.వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

రెండు పొగాకు బ్యారన్ల దగ్ధం : రూ.8 లక్షల ఆస్తి నష్టం



పొగాకు బ్యారన్ నుంచి ఎగిసిపడుతున్న మంటలు

వలేటివారిపాలెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాకర్లవారిపాలెంలో ఆదివారం తెల్లవారుజామున 4 గంటల సమయంలో నల్లబోతుల అంకయ్య, మీనుగు మాల్యాద్రిలకు చెందిన రెండు పొగాకు బ్యారన్లు దగ్ధమయ్యాయి. ఈ ప్రమాదంలో సుమారు రూ.8 లక్షల ఆస్తినష్టం సంభవించింది. పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో పొగాకు కర్రలు జారి గొట్టాలపై పడి మంటలు వ్యాపించి బ్యారన్లు దగ్ధమైనట్లు బాధితులు అంకయ్య, మాల్యాద్రిలు తెలిపారు. సమాచారం తెలుసుకున్న కందుకూరు అగ్నిమాపక అధికారి వెంకటేశ్వర్లు తన సిబ్బందితో కలిసి హుటాహుటీన సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు. బోర్డు అధికారులు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధితులు కోరుతున్నారు.

క్రీడల్లో 'ప్రకాశం' విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న కరస్పాండెంట్ కంచర్ల రామయ్య, తదితరులు

కందుకూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మార్కాపురంలో ఇంజనీరింగ్ కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడాపోటీలలో ప్రకాశం ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థులు సత్తాచాటారని కళాశాల కరస్పాండెంట్ కంచర్ల రామయ్య తెలిపారు. ఏ1 గ్లోబల్‌లో జరిగిన పోటీలలో వాలీబాల్‌లో కళాశాల జట్టు విన్నర్స్‌గాను, క్రికెట్‌లో రన్నర్స్‌గా కప్పులు, ప్రశంసాపత్రాలు సాధించారని క్రికెట్ టీంలో ప్రకాష్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడని తెలిపారు. అలాగే శామ్యూల్ జార్జ్ ఇంజనీరింగ్ కళాశాలలో జరిగిన పోటీలలో కబడ్డీ విభాగంలో కళాశాల జట్టు విజేతగా నిలిచిందని తెలిపారు. దీంతో సోమవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులను రామయ్య, టెక్నికల్ డైరెక్టర్ విజయ్‌శ్రీనివాస్, ప్రిన్సిపాల్ డాక్టరు సీహెచ్ రవికుమార్, అకడమిక్ ఇంచార్జి ఎస్ఎన్ మీరావలి, జీ.ప్రసాద్ అభినందించారు.



ఇదేదో భలే బాగుందే!

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో ద్విచక్ర వాహనదారుల కష్టాలు ఎనలేనివి. భానుడి దెబ్బకు ఎవరైనా అబ్బా అనాల్సిందే. అలా అనకుండా ఉండాలంటే ఏం చేయాలో కొంతమంది ఆలోచిస్తూ వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుడుతున్నారు. ఈ క్రమంలో అల్లూరులో ఓ వ్యక్తి తన కుటుంబంతో కలసి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తుంటాడు. తనకు, తన కుటుంబ సభ్యులను ఎండ తీవ్రత నుంచి రక్షించుకునేందుకు వినూత్న ప్రయోగానికి శ్రీకారం చుట్టాడు. వాహనానికి పైన రేకుతో నీడ కోసం ఆటోకు వేసినట్లు టెంటును ఏర్పాటు చేసి అందులో ప్రయాణించడం స్థానికులను ఆకట్టుకుంటుంది. ఇదేదో భలే బాగుందే... అంటూ అందరూ ఆ వాహనాన్ని వింతగా చూస్తున్నారు. ఇటువంటివి మరికొన్ని వాహనాలు ఏర్పాటయ్యే అవకాశం ఉందని స్థానికులు చర్చించుకుంటున్నారు.

- అల్లూరు(ఆంధ్రజ్యోతి)

నెల్లూరు నుంచి అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన కవి పెరుగు రామకృష్ణ. పసి వయసు నుంచే కవన విద్యను ఒంటబట్టించుకుని అర్ధశతాబ్దంగా అక్షర సేద్యం చేస్తున్న నవతరం సాహితీవేత్త. ఆంధ్ర కవితల్లో దిట్ట అనిపించుకుని, అంతటితో ఆగక తాను రాసిన కవితలను దేశ విదేశీ భాషల్లో తర్జుమా చేసి తెలుగు కవితల కమ్మదనాన్ని విశ్వ వేదికలపైకి తీసుకెళ్లిన ఘనుడు. అలాగే, విదేశీ సాహిత్యాన్నీ తెలుగులోకి అనువదించి ఆ భాషలపై తనకున్న పట్టును ప్రదర్శించిన విభిన్న కవి. అభ్యుదయ రచయితగా, సంపాదకుడిగా తెలుగు విస్తృతికి కృషి చేస్తున్న భాషాభిమాని. 150కిపైగా జాతీయ పురస్కారాలు, 60 అంతర్జాతీయ అవార్డులు ఆయన సాహితీ సేవకు వరించిన కుసుమ మాలికలు.

- అంతర్జాతీయ కవి పెరుగు రామకృష్ణ
- పదో తరగతి నుంచే సాహితీ సేద్యం
- అర్ధశతాబ్దపు ఆంధ్ర కవి
- ఎన్నో భాషల్లోకి తర్జుమాలు
- దేశ, విదేశాల్లో పురస్కారాలు



● ఫ్లెమింగో దీర్ఘకావ్యం

అతిథులుగా ఏటా విహారానికి వచ్చే ఫ్లెమింగో పక్షులపై రామకృష్ణ దీర్ఘకావ్యాన్ని రాశారు. 2006లో వెలువడిన ఆ కావ్యంలోని 52 పంక్తులను కృష్ణ గీతికలు పేర 2023లో రాష్ట్ర ప్రభుత్వం 9వ తరగతి తెలుగు పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టడం ఆయన కవితా పటిమకు నిదర్శనం.

ఎల్లలు దాటిన కవిత్వం

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పెరుగు రామకృష్ణ నెల్లూరులో 1960 మే 27న పెరుగు కమలమ్మ, వెంకటేశ్వర్లుకు జన్మించారు. ఆయన పుట్టిన మే 27 యాదృచ్ఛికంగా విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ జన్మదినం కూడా కావడం విశేషం. ఠాగూర్ అంతటి వాడివి కావాలంటూ కుటుంబ సభ్యులు, సన్నిహితులు ప్రోత్సహించడంతో రామకృష్ణలో బాల్యంలోనే సాహిత్యం దిశగా పునాది పడింది. ఆయన పాఠశాల విద్యను నెల్లూరులో పూర్తి చేశారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం పరిధిలోని రాజమండ్రి ఆర్ట్స్ కళాశాల నుంచి ఆంగ్ల సాహిత్యంలో డిగ్రీ అందుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో నుంచి పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో ఎంఏ పట్టా పొందారు. శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం నుంచి పీజీ డిప్లమో చేశారు. పబ్లిక్ సర్వీసు కమిషన్ ద్వారా 1984లో వాణిజ్యపన్నుల శాఖలో ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించారు. 36 ఏళ్ల సర్వీసు అనంతరం జీఎస్టీ అధికారిగా విరమణ పొందారు.

● 50 ఏళ్ల సాహితీ ప్రయాణం

రామకృష్ణ తెలుగు సాహిత్యానికి 50 ఏళ్లుగా సేవలు అందిస్తున్నారు. ఆయన పదో తరగతి విద్యార్థిగా 1975లో తొలి కవిత రాశారు. అది ఆంధ్రజ్యోతి వార పత్రికలో ప్రచురితమైంది. 1980లో మానసవీణ అనే లిఖిత పత్రికను తన సంపాదకీయంలో నడిపారు. తెలుగు భాషకు ప్రాచీన హోదా కోసం జరిగిన ఉద్యమాల్లో తన వంతు పాత్రను పోషించారు. 1996లో తొలి కవిత్వ సంపుటిని ప్రచురించారు. 2024 వరకు ఆయన రాసిన 24 పుస్తకాలు వెలువడ్డాయి.

● విదేశీ వేదికలపై వెలుగు

తెలుగు సాహిత్యంపై పట్టు సాధించిన డాక్టర్ పెరుగు రామకృష్ణ 13 ఏళ్లకుపైగా విదేశీ వేదికలపై తెలుగు సాహిత్యానికి ఆంగ్ల అనువాదాలు వినిపించి అంతర్జాతీయ సాహిత్యకారుల్లో ఒకరిగా స్థానం సంపాదించారు. 2011లో గ్రీసు దేశంలో జరిగిన సాహితీ సభలో తెలుగు కవిత్వాన్ని వినిపించారు. అలాగే అమెరికా, యూరప్, మధ్యప్రాచ్యంలోని పలు వేదికలపై తెలుగు భాషా విశిష్టతను తెలియజేస్తూ, కవితలతోపాటు పత్రాలను సమర్పించారు. ఆయన కవితలు పలు విదేశీ పత్రికల్లో ప్రచురితమయ్యాయి.



చెక్ రిపబ్లిక్ దేశ రాజధానిలో గౌరవ డీలిట్ డిగ్రీని అందుకుంటున్న రామకృష్ణ



ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నుంచి సత్కారం అందుకుంటూ..

● జాతీయ, అంతర్జాతీయ పట్టాలు, పురస్కారాలు

రామకృష్ణ, మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం, మద్రాసు విశ్వ విద్యాలయాల్లో రెండు ఎంఫిల్ డిగ్రీలు, సమగ్ర కవిత్వం మీద పీహెచ్‌డీ పొందారు. 2016లో చెక్ రిపబ్లిక్‌లో నోబెల్ పురస్కార గ్రహీత ప్రొఫెసర్ ఎర్నెస్టో క హన్ నుంచి డిలిట్ గౌరవ పట్టా అందుకున్నారు. రామకృష్ణ కవితలు ఆంగ్లం, గ్రీక్, అరబ్, స్పానిష్, ఫ్రెంచి వంటి భాషల్లోకి అనువాదమై తెలుగు ఖ్యాతిని చాటాయి. రాష్ట్ర ప్రభుత్వం నుంచి విశిష్ట కవిగా పురస్కారం, తెలుగు విశ్వవిద్యాలయం ద్వారా కీర్తి పురస్కారం, గుజరాత్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారాలు... ఇలా 150కిపైగా జాతీయ అవార్డులు, 60 విదేశీ అవార్డులు అందుకున్నారు. రామకృష్ణ ఆంగ్లం నుంచి తెలుగుకి అనువాదం చేసిన పుస్తకాలను నేషనల్ బుక్ ట్రస్ట్ ఆఫ్ ఇండియా, కేంద్ర సాహిత్య అకాడమీ ప్రచురించాయి. ప్రస్తుతం అభ్యుదయ రైతు మాస పత్రిక సంపాదకులుగా, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా, అఖిల భారతీయ భాషా సాహిత్య సమ్మేళన జాతీయ సంస్థ ఆంధ్రప్రదేశ్ శాఖకు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు.

అర్జీదారులు సంతృప్తి చెందేలా

సమస్యలు పరిష్కారించాలి : జేసీ

నెల్లూరు (హరనాథపురం), మార్చి 24 (ఆంధ్ర జ్యోతి): అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలు పరిష్క రించాలని జేసీ కే. కార్తీక్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. అర్జీదారుల నుంచి జేసీ అర్జీలు స్వీకరించారు. సంబంధిత అధికారులను పిలిచి సత్వరమే సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ వేదికకు 309 అర్జీలు వచ్చా యి. వీటిలో 138 వినతులు రెవెన్యూ శాఖకు చెందినవి. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో ఉదయభాస్కర్‌రావు, జడ్పీ సీఈవో విద్యారమ, తదితరులు పాల్గొన్నారు.



అర్జీని పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ కార్తీక్

● రాయితీలు త్వరగా ఇవ్వాలి

అట్రాసిటీ కేసులో బాధితులకు ప్రభుత్వం ఇవ్వాల్సిన రాయితీలు త్వరగా మంజూరు చేయాలని ఆర్‌పీఐ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కె.మాబు జేసీ వినతిపత్రం అందించారు. వారిని ఆర్థికంగా ఆదుకోవాలని విన్న వించారు.

● కొత్తూరు ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో మంచినీటి వసతి కల్పించాలని ఆ ప్రాంతవాసులు వీ.రమేష్, జీ రమణారెడ్డి జేసీకి వినతిపత్రం సమర్పించారు. అక్కడున్న బావులను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకో వాలని కోరారు.

ఎస్పీ పీజీఆర్‌ఎస్‌కి 86 ఫిర్యాదులు



అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ సౌజన్య

నెల్లూరు(క్రైం), మార్చి 24: నగరంలోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్‌హాల్‌లో సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు జిల్లా వ్యాప్తంగా 86 మంది బాధితులు తరలివచ్చి ఎస్పీ జీ. కృష్ణకాంత్‌కు ఫిర్యాదులు అందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్వీకరించిన ఫిర్యాదులపై త్వరితగతిన స్పందించి పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ సీహెచ్ సౌజన్య, రూరల్ డీఎస్పీ ఘట్టమనేని శ్రీనివాసరావు, మహిళా పోలీసుస్టేషన్ డీఎస్పీ సీహెచ్ రామారావు వినతులు స్వీకరించారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

● కలెక్టరేట్ ఎదుట దళితుల ధర్నా

నెల్లూరు (హరనాథపురం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విడవలూరు మండలం ఊటుకూరులో దళితుల భూములను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని దళిత సంఘర్షణ సమితి జిల్లా అధ్యక్షుడు ఎస్ మల్లి కోరారు. ఈ మేరకు దళిత నాయకులు కలెక్టరేట్ ఎదుట సోమవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా మల్లి మాట్లాడుతూ 2018లో విడవలూరు మండలం ఊటుకూరులో ఎస్సీ కార్పొరేషన్ వారు భూమి కొనుగోలు పథకం ద్వారా సర్వే నెంబరు 1288 నుంచి 1294 వరకు 90.96 ఎకరాల భూమిని దళితులకు ఇచ్చారని తెలిపారు. దాంట్లో 50 ఎకరాలను కబ్జాదారులు ఆక్రమించుకుని పంటలు పండించుకుంటున్నారని తెలిపారు. వారిపై తహసీల్దారు చర్యలు తీసుకోవడంలేదని ఆయన ఆరోపించారు. అద్దంకి కార్తీక్, పీ.పాపయ్య మాట్లాడుతూ దాదాపు రూ.8కోట్ల విలువైన భూములను ఆక్రమణదారులు సాగుబడి చేసుకుని లబ్ధిపొందుతున్నారని తెలిపారు. తక్షణం కలెక్టర్ జోక్యం చేసుకుని హద్దులు చూపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆత్మకూరు కొండయ్య, ఇమ్మానియేల్, శివాజీ, జెడ్డా వాసు, తదితరులు పాల్గొన్నారు.



క్షయ నివారణకు కృషి చేయాలి

- 25 టీబీ ముక్త పంచాయతీల ఎంపిక
- అవగాహన ర్యాలీలో డీఎంహెచ్‌వో సుజాత

నెల్లూరు (వైద్యం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్షయవ్యాధి నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ సుజాత కోరారు. సోమవారం ప్రపంచ క్షయవ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా వైద్య ఆరోగ్యశాఖ నగరంలో అవగాహన ర్యాలీ జరిగింది. డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి బీఈడీ కళాశాల వరకు ఈ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జరిగిన సదస్సులో ఆమె మాట్లాడారు. జిల్లాలో క్షయ వ్యాధిగ్రస్తులకు అత్యుత్తమ వైద్య చికిత్సలు అందిస్తున్నామని, ఇందులో భాగంగా ఎంతో ఖరీదైన మందులను సైతం ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా అంద చేస్తున్నామని చెప్పారు. 92 గళ్ల పరీక్షల ద్వారా వ్యాధిగ్రస్తులను గుర్తిస్తున్నామన్నారు. టీబీ ముక్త పంచాయత్ కింద 25 పంచాయతీలు ఎంపికయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయా పంచాయతీలకు సర్టిఫికెట్‌తోపాటు గాంధీజీ జ్ఞాపికను అందచేశారు. అలాగే వ్యాధి నివారణలో ఉత్తమ ప్రతిభ చూపిన వైద్యులు, సూపర్‌వైజర్లు, సీహెచ్‌వో, ల్యాబ్ టెక్నీషియన్లు, ఆశా కార్యకర్తలకు ప్రతిభా పురస్కారాలు, జ్ఞాపికలు అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ ఖాదర్‌వలి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, న్యూక్లియస్ మెడికల్ అధికారి డాక్టర్ సురేంద్రబాబు, డీపీఎంవో డాక్టర్ రమేష్, డబ్ల్యూహెచ్‌వో కన్సల్టెంట్ డాక్టర్ భవానీ రామకృష్ణ, డెమో కనకరత్నం, డీఎంవో హుస్సేనమ్మ తదితరులు పాల్గొన్నారు.



నగరంలో క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యశాఖ



కృష్ణారెడ్డిని సత్కరిస్తున్న కళాశాలల ప్రతినిధులు

ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల సంఘం

జిల్లా అధ్యక్షుడిగా కృష్ణారెడ్డి

నెల్లూరు(విద్య), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల జిల్లా అధ్యక్షుడిగా ఆర్..కృష్ణారెడ్డి (కృష్ణచైతన్య) ఎంపికయ్యారు. నగరంలోని కృష్ణచైతన్య కళాశాల ప్రాంగణంలో సోమవారం అన్నీ కళాశాలల మేనేజ్‌మెంట్ సభ్యుల ఆధ్వర్యంలో వీఎస్‌యూ పరిధిలోని ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక జరిగింది. రాష్ట్రనేతల పర్యవేక్షణలో జరిగిన ఈ ఎంపికలో జిల్లా అధ్యక్షుడితోపాటు ప్రధాన కార్యదర్శిగా టీ.మనోహర్‌రెడ్డి(నాయుడుపేట వేమా), కోశాధికారిగా జీ.నారాయణరెడ్డి(పొదలకూరు విజ్ఞాన్)లను ఎంపిక చేశారు. ఉపాధ్యక్షులుగా జీ.రాజకుమార్ చౌదరి, పీ.నిరంజన్‌రెడ్డి, కేఎస్.రాజు, సంయుక్త కార్యదర్శులుగా జేవీ జయ్‌బాబు, జీ.రాంగోపాల్, టీ.దినేష్‌వర్ధన్‌ను ఎంపిక చేశారు. రాష్ట్ర గౌరవాధ్యక్షుడు విజయ్‌భాస్కర్‌రెడ్డి, అధ్యక్షుడు గుండారెడ్డి పర్యవేక్షణలో జరిగిన ఈఎంపికలో సభ్యులందరినీ ఏకగ్రీవంగా ఎంపిక చేసి, జిల్లాలో డిగ్రీ, పీజీ కళాశాలల ఉన్నతికి కొత్త కమిటీ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం అధ్యక్షుడితోపాటు సభ్యులందరినీ సత్కరించారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రతినిధులు ఎం.వెంకటేశ్వర్లు, ఎస్.వెంగల్‌రెడ్డి, పీ.జానకిరామ్, వై.శివసాకేత్, ఎం.సుబ్బారెడ్డి, ఎం.హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్ల సంఘం కార్యవర్గం ఎంపిక

నెల్లూరు(క్రైం), మార్చి (ఆంధ్రజ్యోతి) 24: జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల, హెడ్‌కానిస్టేబుళ్ల అసోసియేషన్ ఎన్నికలు సోమవారం జరిగాయి. ఈ ఎన్నికల్లో నూతన కార్యవర్గాన్ని ఎంపికచేశారు. జిల్లా అధ్యక్షులుగా మారెళ్ల కృష్ణయ్య, అరిగెల శీనయ్య, (ఒకరు రెండేళ్లు, మరొకరు మూడేళ్లు) అసోసియేట్ అధ్యక్షుడిగా ఎం కిరణ్‌సింగ్, జనరల్ కార్యదర్శిగా బీ. దయాకర్, ట్రెజరర్‌గా ఏ శ్రీరాములు, ఉపాధ్యక్షుడిగా టీ. సుబ్రహ్మణ్యం, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా కే.అజీజ్‌బాషా, జాయింట్ కార్యదర్శులుగా వై మాల్యాద్రి, ఎం అంకయ్య, ప్రెస్ కార్యదర్శులుగా ఎం. పెంచలయ్య, టీ. శ్రీనివాసులు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎం రవి, సీహెచ్ శ్రీహరి, పీ. సుబ్బయ్య, బీ. పుట్టయ్యలను ఎంపిక చేశారు. కొత్తగా ఎంపికయిన కార్యవర్గ సభ్యులు ఎక్సైజ్ కార్యాలయంలో ఈఎస్ శ్రీనివాసనాయుడును మర్యాదపూర్వకంగా కలిశారు.


టెన్త్ పరీక్షలకు 507 మంది గైర్హాజరు

నెల్లూరు(విద్య), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని 174 కేంద్రాల్లో జరుగుతున్న టెన్త్ పరీక్షల్లో భాగంగా సోమవారం జరిగిన మ్యాథ్స్ పరీక్షకు 507 మంది గైర్హాజరయ్యారు. మొత్తం 28,834 మంది హాజరు కావాల్సి ఉండగా, 28,327 మంది హాజరయ్యారు. 507 మంది గైర్హాజరయ్యారు. పరీక్షల నిర్వహణ తీరుపై జిల్లా అబ్జర్వర్ రవీంద్రనాథ్‌రెడ్డి ఆరు కేంద్రాలను, డీఈవో డాక్టర్ బాలాజీ రావు ఏడు కేంద్రాలను, పరీక్షల విభాగం ఏసీ రెండు, ఫ్లైయింగ్ స్క్వాడ్ 56 కేంద్రాలను పరిశీలించారు. అలాగే ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో భాగంగా మ్యాథ్స్‌కు 1535 మంది అభ్యాసకులు హాజరు కావాల్సి ఉండగా, 1324 మంది హాజరయ్యారు. 211 మంది గైర్హాజరయినట్లు డీఈవో వివరించారు.

డాక్టర్ శ్రావణికి

అరుదైన అవకాశం

- 74వ నోబెల్ లారియట్ సమావేశానికి ఎంపిక
- వీఎస్‌యూ వీసీ శ్రీనివాసరావు అభినందనలు



వెంకటాచలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వీఎస్‌యూ పూర్వ విద్యార్థిని డాక్టర్ బతినపట్ల శ్రావణికి 74వ లిండౌ నోబెల్ లారియట్ సమావేశంలో పాల్గొనే అరుదైన గొప్ప అవకాశం లభించడం శుభపరి ణామం అని వర్సిటీ వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ప్రశంసించారు. ఈ విషయంపై సోమవా రం ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా 600మంది యువశాస్త్రవేత్తల్లో డాక్టర్ శ్రావణి ఒకరిగా ఎంపికై ఈ ఏడాది జూన్, జూలైలో జర్మనీలోని లిండౌ నగరంలో జరుగనున్న సమావేశంలో పాల్గొం టారని చెప్పారు. శ్రావణి వీఎస్‌యూలో ఎంఎస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ), కడపలోని యోగి వేమన యూనివర్సిటీలో పీహెచ్‌డీ పూర్తి చేశారన్నారు. గత కొన్నేళ్లగా ఆమె హైడ్రోజన్ ఉత్పత్తికి భూమిలో విస్తృతంగా లభించే లోహాల ఆధారిత ఎలెక్ట్రోక్యాటలిస్ట్ అభివృద్ధిపై అనేక పరిశోధనలు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీలోని ఎంకే పోస్ట్ డాక్టోరల్ ఫెలోగా యూనివర్సిటీలో పని చేస్తున్నారని చెప్పారు. సమావేశంలో నోబెల్ బహుమతి గ్రహీతలతో సంప్రదింపులు జరిపి రసాయనశాస్త్ర రంగంలో అగ్రశ్రేణి పరిశోధనలో తనవంతు పాత్ర పోషించేందుకు శ్రావణికి అవకా శం లభించిందన్నారు. ఆమెకు వీఎస్‌యూ తరుపున ప్రత్యేక అభినందనలు తెలిపారు.

వేణుగోపాలస్వామి ఆలయానికి పూర్వవైభవం

పునర్నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ : మంత్రి ఆనం

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఎంతో ప్రాశస్త్యం కలిగిన మూలాపేట వేణుగోపాలస్వామి ఆలయ పునర్నిర్మాణానికి మాస్టర్ ప్లాన్ రూపొందించామని, అందరి సహకారంతో ఆలయానికి పూర్వవైభవం వచ్చేలా నిర్మాణాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో జరిగిన పాలక మండలి సమావేశానికి మంత్రి అధ్యక్షత వహించారు. అనంతరం అనంతరం విలేకరులతో ఆనం మాట్లాడుతూ గతంలో ఈ ఆలయం భక్తులతో కళకళలా డేదని, ఆలయ సత్రాలలో వందలాది వివాహాలు జరిగేవని తెలిపారు. మంచి ముహూర్తంలో తిరిగి ఆలయ పునః నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. ఆలయ పునఃనిర్మాణ శంకుస్థాపన పనులకు శృంగేరి పీఠాధిపతులను ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే స్థపతులు, చీఫ్ ఇంజనీర్లు ఆలయాన్ని పరిశీలించి మాస్టర్ ప్లాన్ రూపొందించారని, దీనిని పాలక మండలి ఆమోదించి దేవదాయ శాఖకు పంపిన వెంటనే టెండర్ల ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. ముందుగా మంత్రి ఆనంకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. మంత్రి ఆలయంలో భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి చైర్మన్ మజ్జిగ చంద్రమౌళిరెడ్డి, ధర్మకర్తలు మన్నెం లక్ష్మీకాంత్‌రెడ్డి, ఆనం చంద్రశేఖరరెడ్డి, తుమ్మల సుమన్‌తేజారెడ్డి, ఆర్‌జేసీ చంద్రశేఖర్ ఆజాద్, దేవదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ కోవూరు జనార్దన్‌రెడ్డి, ఆలయ సహాయ కమిషనర్ శ్రీనివాసరావు, పలువురు ఈవోలు, సిబ్బంది పాల్గొన్నారు.



ఆలయ పాలక మండలి సమావేశంలో మంత్రి ఆనం

కోవూరు
సర్వేపల్లి

విద్యార్థులకు వాటర్ పంపిణీ

తోటపల్లిగూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిన్న చెరుకూరు హైస్కూల్‌లో పదో తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సోమవారం నియోజకవర్గ జనసేన సమన్వయకర్త బొబ్బేపల్లి సురేష్‌నాయుడు సుగంధ వాటర్‌ను పంపిణీ చేశారు. అనంతరం బొబ్బేపల్లి మాట్లాడారు. తోటపల్లిగూడూరు మండలా ధ్యక్షుడు అంకెం సందీప్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో చేపట్టామన్నారు. కార్యక్రమంలో గుమినేని వాణి భవానీనాయుడు, సందూరి శ్రీహరి, మండల కార్యదర్శి పుట్టా రాకేష్, అంకెం నాగేశ్వరరావు పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.8441
వెండి కిలో ధర	రూ. 100,000
వెండి ఒక గ్రాము	రూ.103.00

న్యూస్ బాక్స్

వివరాలు తెలిస్తే సమాచారమివ్వండి

ముత్తుకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కప్పలదొరువు సమీపంలో 50ఏళ్ల గుర్తు తెలియని వ్యక్తిని ఆదివారం రాత్రి నెల్లూరు వెళ్లే వాహనం ఢీకొనడంతో దుర్మరణం చెందాడు. మృతుడి ఎత్తు 5.5అడుగులు, ఎరుపు రంగు, కుడిచేతిపై జైశ్రీరామ అను హిందీ అక్షరాలతో పచ్చబొట్టు ఉన్నాయి. న ల్లని నెక్‌లెస్ హాఫ్‌హ్యాండ్ టీ షర్ట్, నీలం రంగు ప్యాంటు ధరించి వున్నాడు. వివరాలు తెలిస్తే సెల్: 94407 96322 నెంబరుకు సమాచారమివ్వాలని ఎస్ఐ విశ్వనాథరెడ్డి కోరారు.

బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జానకీ ప్రసాద్

● జిల్లా నాయకుల అభినందనలు

తోటపల్లిగూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):విజయవాడలోని బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో సోమవారం జరిగిన సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జానకిప్రసాద్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు బందెల గౌతమ్ ఆధ్వర్యంలో ఎన్నిక జరిగనట్టు జానకిప్రసాద్ తెలిపారు. అంతేకాక బాపట్ల, ప్రకాశం, నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల ఇన్‌చార్జి బాధ్యతలు ఇచ్చారని చెప్పారు. తన ఎన్నికపై రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా అధ్యక్షురాలు కాకుటూరు పుష్పాంజలి, జిల్లా ఇన్‌చార్జ్ శ్రీరామ్, జీకే.అబ్దుల్, వెంకటేశ్వర్లు, అశోక్, మర్రి రామచంద్రయ్య, అభినందనలు తెలిపారు.

ప్రసన్నాంజనేయుడికి అష్టోత్తర శత కలశాభిషేకం



కొలువుదీరిన ప్రసన్నాంజనేయస్వామి

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 24(ఆంధ్రజ్యోతి):పెద్దూరు కోదండరామస్వామి ప్రసన్నాంజనేయస్వామిమండలాభిషేకంలో భాగంగా సోమవారం ఆలయ పండితులు అష్టోత్తర శతకలశాభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం సామూహిక సింధూరంతో సహస్రానామార్చన చేశారు. సాయంత్ర పల్లకీసేవ నిర్వహించారు. మండల పూజలకు చెందిన ఉభయకర్తలు, స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. పూజలు ఆలయ వ్యవస్థాపక దర్మకర్త దొడ్ల మురళి కృష్ణారెడ్డి పర్యవేక్షన జరిగాయి.

మైపాడులో చోరీ

● రూ.లక్ష నగదు అపహరణ

● పోలీసులకు ఫిర్యాదు

ఇందుకూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):మైపాడు గ్రామంలో సోమవారం ఉదయం 6గంటలు 7.30కు మధ్య ఆర్ఎంపీ వైద్యులు సంగం వెంకటేశ్వర్లు ఇంట్లోని కబోర్డ్‌లో దాచుకున్న రూ.లక్ష సొమ్ము చోరీకి అయ్యాయి. ఈ సందర్భంగా బాధితుడు మాట్లాడారు. ఉదయం 6గంటలకు తాను పైకం లెక్కపెట్టుకుని ఇంట్లో దాచి బయటకు వెళ్లి ఉదయం 9గంటల సమయంలో డబ్బు కోసం వెతకగా కనిపించలేదన్నారు. అందరం ఇంట్లో ఉండగానే డబ్బు మాయం కావడం అర్థం కావడం లేదని బాధితుడు వాపోయాడు. ఈ మేరకు ఇందుకూరుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ నాగార్జునరెడ్డి వచ్చి చోరీ జరిగిన ప్రాంతాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు.

సైబర్ నేరాలపై సీఐ అవగాహన



సదస్సులో పాల్గొన్న సాల్మానుపురంగ్రామస్థులు

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 24: (ఆంధ్రజ్యోతి): ఫోన్ వాట్సప్‌లు, మెసేజ్‌లతో తక్కువ పెట్టుబడి తో ఎక్కువ ఆదాయం, రుణాలు ఇస్తామని నమ్మించి బ్యాంకు ఖాతాలు, ఆదార్ నెంబర్లు సేకరించేలాంటి గుర్తుతెలియని సైబర్ నేరగాళ్ల సంచారాలపై ప్రజలు అప్రమత్తంగా వుండాలని అలాంటివారి కదలికలను గుర్తించి వెంటనే పోలీసులకు సమాచారమిచ్చి సహకరించాలని సీఐ శ్రీనివాసులురెడ్డి కోరారు. సోమవారం రాత్రి సాల్మానుపురంలో సైబర్ నేరాలు, గ్రామాల్లో గుర్తుతెలియని వ్యక్తుల సంచారాలపై బుచ్చి సీఐ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ప్రధాన కూడళ్లలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ వెంకయ్య, స్థానిక నాయకులు వెంకటేశ్వర్లు రెడ్డి, సిద్దన కొండారెడ్డి పాల్గొన్నారు.

ఈతకు వెళుతున్నారా జాగ్రత్త సుమా!

● చెరువులు, వాగుల్లో స్నానాలకు వెళుతున్న విద్యార్థులు

● సరదాగా ఆడుతూ ప్రమాదాల బారిన..

పొదలకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఈత సరదా చిన్నారుల ఉసురు తీస్తోంది. ఆడుతూ పాడుతూ ఈ వేసవిలో సరదాగా గడిపే చిన్నారులు ఉత్సాహంగా చెరువులు, కాలువలు, కుంటల్లో దిగి మృత్యువాత పడుతున్నారు. బంగారు భవిష్యత్తును నీటిపాలు చేస్తున్న ఈ ఘటనలు వారి కుటుంబాలలో అంతులేని విషాదాన్ని నింపుతున్నాయి. మండలంలో రెండేళ్ల కిందట 2023 ఫిబ్రవరి 26న మండలంలోని తోడేరు చిన చెరువులో ఈతకెళ్లిన 10మంది యువకుల్లో ఆరుగురు మరణించారు. అప్పట్లో ఆ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశం అయ్యింది. ఒకే వీధికి చెందిన ఆరుగురు యువకులు దుర్మరణం చెందడం ఇప్పటికీ ఆ గ్రామప్రజలను కలచివేస్తుంది.



చిట్టేపల్లి చెరువు

● చెరువులు ఉన్న గ్రామాలివే..

మండలంలోని చాటగొట్ల, పొదలకూరు, వావింటపర్తి, మర్రిపల్లి, మరుపూరు, తాటిపర్తి, నల్లపాలెం గ్రామాల సమీపంలో చెరువులు ఉన్నాయి. అలాగే విరువూరు, సూరాయపాలెం, సంగం బ్యారేజీ నీటిలో ఈతకు వెళ్లకుండా మొగళ్లూరు, పులికల్లు గ్రామాల్లోని వారు కండలేరు డ్యాం కాలువలు ఉన్నాయి. సమీప గ్రామాల విద్యార్థులు ఒంటి పూటబడులు కావడంతో స్కూళ్లు, కళాశాలల అనంతరం మధ్యాహ్నం స్నేహితులతో కలిసి సరదా ఈతకు వెళతారు. మరికొందరు కుంటలు, వాగులు, వంకలు వెళతారు. వెళ్లిన వారిలో నీళ్ల లోతుపై సరైన అవగాహన లేకపోవడం, మరి కొందరికి ఈత రాకపోవడం అందుకు కారణమవుతోంది. ఇలా ప్రాణాలు కోల్పోతున్న వారిలో చిన్నారులు అధికంగా ఉంటున్నారు. కనీసం వేసవిలోనైనా కొంతమేర ముందస్తు జాగ్రత్తచర్యలు తీసుకుంటే కొంతవరకు చిన్నారులను కాపాడుకునేందుకు అవకాశం ఉంటుందని బాధితగ్రామాల ప్రజలు కోరుతున్నారు. సాయంత్రం వేళ ఆయా పోలీస్‌స్టేన్ల పరిధిలోని నీటివనరుల వద్ద గస్తీ, సచివాలయ సిబ్బంది పర్యవేక్షణ ఉంటే బాగుంటుందనే అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రత్యేకించి వేసవిలో ప్రమాదాలు చోటు చేసుకుంటుండగా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాల్సి న పరిస్థితి ఉంది. లేకుంటే ప్రమాదాలను వారిం చలేని పరిస్థితి నెలకొంది. చెరువులు, కుంటల రక్షణ చర్యలు కల్పించే పరిస్థితి యంత్రాంగం వద్ద లేదు.

పిల్లలకు ఈత నేర్పిస్తే మంచిది

వేసవి సెలవుల్లో తల్లిదండ్రులు దగ్గర ఉండి తమ చిన్నారులకు ఈత నేర్పిస్తే మంచిది. ఈత వల్ల భవిష్యత్తులో వారు నీటి ప్రమాదాలను నుంచి తప్పించుకొని సురక్షితంగా బయటపడే అవకాశం ఉంటుంది. తల్లిదండ్రులు కూడా నిశ్చింతగా ఉండొచ్చు.

\- సీహెచ్. వెంకటకృష్ణ, పొదలకూరు

పిల్లల కదలికలను గమనిస్తూ ఉండాలి

ఒంటిపూట బడులు, ఈ వేసవి సెలవుల్లో పిల్లలను తల్లిదండ్రులు, ఇంటిలోని పెద్దలు ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి. వారు కనపడినప్పుడు వెంటనే అప్రమత్తం చేయాలి. అలాగే ఫ్రెండ్స్‌తో బయటకు చెరువులు, కాలువల వద్దకు వెళ్లడానికి ఎట్టిపరిస్థితుల్లో అంగీకరిం చకూడదు.

\- కె.పాపయ్య, పార్లపల్లి

దేశాభివృద్ధిలో యువత భాగస్వాములవ్వాలి: ఎమ్మెల్యే సోమిరెడ్డి

వెంకటాచలం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యువత రొటీన్ లైఫ్‌తో సరిపెట్టుకోకుండా దేశాభివృద్ధిలో భాగస్వాములవ్వాలని సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి పిలుపునిచ్చారు. కాకుటూరు సమీపంలోని వీఎస్‌యూలో సోమవారం జరిగిన వికసిత్ భారత్- యూత్‌పార్లమెంట్ సెమినార్‌లో వర్సిటీ వీసీ అల్లం శ్రీనివాసరావుతో కలిసి ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఒకే దేశం- ఒకే ఎన్నికల అంశంపై మాట్లాడారు. విద్యార్థులు సత్తాచాటి జాతీయస్థాయిలో జరిగే యువజన పార్లమెంటు 2025లో ప్రాతినిధ్యం వహించాలని ఆకాంక్షించారు. రాష్ట్రంలోనూ 175మంది యువతతో యువజనఅసెంబ్లీ నిర్వహించే సన్నాహాల్లో యువమంత్రి నారా లోకేష్‌బాబు ఉన్నారని చెప్పారు. ఎన్నికల కారణంగా పరిపాలనకు అవాంతరాలు లేకుండా కేంద్రం జమిలి ప్రతిపాదనలు తెచ్చిందని ఆ ఎన్నికలతో కలిగే ప్రయోజనాలు వివరించారు. సీఎం చంద్రబాబు అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. గత వైసీపీ పాలకులు మూడు రాజధానుల పేరుతో ఐదేళ్లు కాలయాపన చేశారన్నారు. రాజకీయ నాయకులు ఓట్ల కోసమే కాదని, ప్రజలు.. సమాజం కోసం పనిచేయాలన్నారు. కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ సునీత, వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్.విజ య, ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త అల్లం ఉదయ్‌శంకర్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

● టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

ముత్తుకూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని డమ్మాయపాలెం పంచాయతీ పరిధిలో వైసీపీకి చెందిన 26 కుటుంబాలు సోమవారం పడాల నరసారెడ్డి, సన్నారెడ్డి సుధాకర్ ఆధ్వర్యంలో టీడీపీలో చేరారు. వీరికి నియోజకవర్గ ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ఆత్మీయ ఆహ్వానించారు. కార్యక్రమంలో ఈదూరు రామ్మోహన్‌రెడ్డి, మునుకూరు రవికు మార్ రెడ్డి, సన్నారెడ్డి కల్పనారెడ్డి, మునిరెడ్డి, డమ్మాయి శ్రీనివాసులు, వల్లం గంగాధర్, వెంకటరత్నం పాల్గొన్నారు.

● ట్రాక్టర్ల పంపిణీ

వెంకటాచలం (ఆంధ్రజ్యోతి):ఎమ్మెల్యే సోమిరెడ్డి ఎంపీడీవో కార్యాలయం వద్ద సోమవారం సాయంత్రం ఆరు ట్రాక్టర్లను ఆయా పంచాయతీలకు పంపిణీ చేశారు. అనంతరం కసుమూరు దర్గా వద్ద తాగునీటి పైప్‌లైన్, మరుగుదొడ్లను ప్రారంభించారు. దర్గా ప్రాంగణ మసీదులో ముస్లిం సోదరులతో కలిసి ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం పుంజులూరు పాడులోని నూతన అయ్యప్పస్వామి ఆలయాన్ని సందర్శించారు. కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో కల్పన, నేతలు రావూరి రాధాకృష్ణమనాయుడు, చల్లా నాగార్జున్‌రెడ్డి, సురేష్‌నాయుడు, అన్వర్, షరీఫ్, మౌలాన, హనీఫ్ గ్రామస్థులు, తదితరులున్నారు.

నేటి నుంచి మెరైన్ సిస్టమ్స్ ఆవిష్కరణపై సమాలోచన

● రెండురోజులు జరగనున్న సమావేశం

వెంకటాచలం, మార్చి 24(ఆంధ్రజ్యోతి):వీఎస్‌యూలో మెరైన్ సిస్టమ్స్ నూతన ఆవిష్కరణలపై మంగళవారం నుంచి అంతర్జాతీయ సమ్మేళనాన్ని నిర్వహించనున్నట్లు వర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్, సదస్సు కన్వీనర్ ప్రొఫెసర్ సీహెచ్.విజయ సోమవారం ప్రకటనలో తెలిపారు. వీసీ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు నేతృత్వంలో రెండురోజులు సమావేశం జరుగుతుందన్నారు. సముద్ర పరిశోధన, ఆక్వాకల్చర్, సముద్ర జీవ వైవిధ్య సంరక్షణ, కాలుష్య నివారణ, బ్లూ ఎకానమీ వంటి ప్రాధాన్యతపై ప్రముఖ శాస్త్రవేత్తలు, పరిశోధకులు, విద్యావేత్తలు సదస్సులో చర్చించనున్నారని పేర్కొన్నారు.

డాక్యుమెంట్ రైటర్ మృతదేహానికి అంత్యక్రియలు

కోవూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):స్థానిక తాలూకా ఆఫీసు కూడలిలోని డాక్యుమెంట్ రైటర్ మల్లికార్జున అనారోగ్యంతో ఆదివారం మృతి చెందాడు. కుటుంబ సభ్యులు అందుబాటులో లేకపోవడంతో సహచర డాక్యుమెంట్ రైటర్లు పూండ్ల జాన్సన్, విజయానందం, కైలాస భూమి అభివృద్ధి కమిటీ సభ్యుడు దేవిరెడ్డి సురేష్‌రెడ్డిలు మృతదేహానికి అంత్యక్రియలు చేపట్టారు. ఈయన జిల్లాస్థాయి షటిల్ బ్యాడ్మింటన్ ఆటగాడు.

ధాన్యం కొనుగోలులో జాప్యం

ఏపీ రైతు సంఘం నేత రాజగోపాల్

బుచ్చిరెడ్డిపాళెం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ధాన్యం పండించిన రైతులు దివాళా తీసే పరిస్థితి ఉందని ఏపీ రైతు సంఘం నాయకుడు చంద్ర రాజగోపాల్ అన్నారు. సోమవారం ఆయన మండల వ్యవసాయాదికిరి సురేంద్రరెడ్డిని కలిసి మాట్లాడారు.మండ లంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలిపారు. ధాన్యం కొనుగోలులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. రైతాంగం పండించిన దిగుబడిలో 3శాతం ధాన్యం కూడా ప్రభుత్వం కొనుగోలు చేయలేదన్నారు. పుట్టికి 919 కేజీలకు గాను 950కేజీలకు పైబడి ధాన్యం సేకరిస్తున్నట్లు చెప్పారు. కొనుగోలు కేంద్రాల్లో అధికారులు, మిల్లర్లు, దళారులు కుమ్మక్కై రైతుల ధాన్యాన్ని తక్కువ ధరలకు దోచుకుంటున్నారని ఆరోపించారు. ఇప్పటికైనా ధాన్యం రైతులకు బోనస్ ప్రకటించి ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు ముత్యాల గుర్నాదం, జానీబాష, చల్లకొలుసు మల్లికార్జున పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

పొదలకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అల్లూర్తి ఉప సర్పంచ్ ఖాదర్‌బాషా రంజాన్‌ను పురస్కరించుకుని ముందస్తుగా పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. రంజాన్ దానధర్మాలకు ప్రతీక అన్నారు. ఈ పండుగను పురస్కరించుకుని ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. అలాగే పండుగ రోజు బిర్యానీ పొట్లాలతో పాటు, మిఠాయిలు పంపిణీ చేస్తామన్నారు. గ్రామంలో పదేళ్లగా కార్యక్రమాన్ని తూచా తప్పకుండా చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖాదర్‌బాషా, కుటుంబ సభ్యులు, మసీద్ పెద్దలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

● ఇఫ్తార్ విందు..

పట్టణంలోని జామియా మర్కజ్ మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ముందుగా మత పెద్దలతో ప్రత్యేక ప్రార్థనలు చేసి ముస్లిం సోదరులకు ఉపవాస దీక్షను విరమింపజేశారు. రంజాన్ మాసం మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ఇఫ్తార్ విందులతో సోదరభావం పెరుగుతుందన్నారు. ముస్లిం సోదరులకు ముందస్తు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముస్లింల మత పెద్ద మౌలానా ముస్తాక్ మదని పాల్గొన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న ఉపసర్పంచి ఖాదర్‌బాషా

చక్కెర ఫ్యాక్టరీ కార్మికుల బకాయిలు చెల్లించాలి

కోవూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని కోవూరు, పొదలకూరు చక్కెర ఫ్యాక్టరీల కార్మికులకు వెంటనే బకాయిలు చెల్లించాలని బీజేపీ నాయకులు మిడతల రమేష్, ఐనకోట రఘురామయ్య, నరాల సుబ్బారెడ్డి డిమాండు చేశారు. ఈ విషయంపై సోమవారం వారు కార్మికులతో కలిసి లేబర్ డిప్యూటీ కమిషనర్ వెంకటేశ్వరరావు, అసిస్టెంటు కమిషనర్ గౌస్ బాషను కలిసి వినతిపత్రాలు అందజేశారు. 2019లో పొదలకూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులు 120మంది లేబర్ కోర్టును ఆశ్రయించి బకాయిలు రూ.4కోట్లు పొందే విధంగా ఉత్తర్వులు పొందారన్నారు. పొదలకూరు షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యం లేబర్ కోర్టు ఆదేశాల్ని పట్టించుకోలేదన్నారు. కోవూరు షుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు రూ23కోట్లు మంజూరు చేయగా ఆ నిధుల్ని రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించినట్లు చెప్పారు. బకాయిల కోసం ఎదురుచూసిన చాలా మంది కార్మికులు మృతి చెందారన్నారు. ఆర్థిక సమస్యలతో అల్లాడుతున్న కార్మికుల కుటుంబాల్ని ఆదుకోవాలని కోరారు.



లేబర్ ఆఫీసర్‌కు వినతిపత్రం ఇస్తున్న మిడతల రమేష్, ఐనకోట రఘురామయ్య, నరాల సుబ్బారెడ్డి

విధులకు సక్రమంగా రాని కార్యదర్శి

● వరిగొండ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు

● అక్కడే పూర్తిస్థాయి విధుల నిర్వహణ

● పనుల కోసం సచివాలయం వద్ద పడిగాపులు కాస్తున్న నరుకూరు ప్రజలు

తోటపల్లిగూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శి ప్రవళిక విధులకు సక్రమంగా రాకపోవడంతో నరుకూరు గ్రామ ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమకు కార్యదర్శి ఉన్నా లేనట్లే అనిపిస్తుందని ప్రజలు చర్చించుకుంటు న్నారు. ఈమెకు కొన్ని నెలల కిందట వరిగొండ కార్యదర్శిగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. దానికిభిన్నంగా అధికార, రాజకీయ అండదండలతో కార్యదర్శి విధులను వరిగొండ గ్రామ పంచాయతీలో నిర్వహిస్తుంది. జీతం మాత్రం నరుకూరు సచివాలయంలో తీసుకుంటుంది. వరిగొండ సచివాలయంలో ఎలా పనిచేస్తార ని ప్రజలు ఆరోపిస్తున్నారు. తమ పనుల కోసం సచి వాలయానికి కాళ్లు అరిగేలా తిరుగున్నా కార్యదర్శి లేకపోవడంతో వెను దిరిగి వెళ్లిపోతున్నట్లు వాపోతున్నారు. అసలు విషయం ఏమిటంటే వరిగొండ పంచాయతీలో కార్యదర్శి పనిచేయాలంటే గ్రేడ్-1 చేసిన వారి మాత్రమే అర్హులు. వారు విధుల్లో ఉండాలి కానీ నరుకూరు పంచాయతీ కార్యదర్శి గ్రేడ్-4 ఆమెను వరిగొండ ఇన్‌చార్జ్‌గా ఎలా పంపుతారని ఈ గ్రామ ప్రజలు ప్ర శ్నిస్తున్నారు. నరుకూరు సచివాలయంలో విధులు నిర్వహించి 30రోజు లు గడుస్తున్నా ఇప్పటికీ ఆ సచివాలయం వైపు కన్నెత్తి చూడలేదు. దీంతో గ్రామంలో పారిశుధ్యం అధ్వానంగా మారింది. ఉన్నతాధి కారులు స్పందించి నరుకూరు పంచాయతీకి మరో కార్యదర్శిని నియమించాలని ప్రజలు కోరుతున్నారు.



నరుకూరు సచివాలయం

● ఈ విషయంపై మండల అభివృద్ధి అధికారి వెంకటేశ్వర్లు వివరణ కోరగా విధులు నిర్వహణ గురించి తమ దృష్టికి వచ్చిందని ఈ విషయాన్ని ఉన్నత అధికారులు దృష్టికి తీసుకెళ్తామన్నారు.

● ఈ విషయంపై సర్పంచ్ అన్నం శారద మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శి నెల నుంచి విధులకు రావడంలేదు. స్థానికులు పనుల కాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పర్మినెంట్‌గా నరుకూరులోనే పంచాయతీ కార్యదర్శి ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

అధిక తూకాలతో ధాన్యం కొనుగోలు తగదు

కోవూరు, మార్చి24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో అధిక తూకంతో రైతుల నుంచి ధాన్యం కొనగోలు చేయడం తగదని రైతుసంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులు పులిగండ్ల శ్రీరాములు, మూలి వెంగయ్య అన్నారు. సోమవారం వారు రైతుసంఘం జిల్లా నాయకులతో కలిసి స్థానిక ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పడుగుపాడు సొసైటీని పరిశీలించి మాట్లాడారు. పుట్టి ధాన్యానికి 100 కిలోల పైన తూకంతో కొనుగోలు చేస్తున్నట్లు రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వం కేవలం 5లక్షల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించిందని, కానీ జిల్లాలో సుమారు 15లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు పండించారని చెప్పారు. మిగతా 10 లక్షల టన్నుల ధాన్యాన్ని రైతులు ఎలా అమ్ముకో వాలని వారు ప్రశ్నించారు. ఈ సందర్భంగా పడుగుపాడు సొసైటీ సీఈఓ కొండూరు గోవర్ధన్‌రెడ్డితో సమస్యపై మాట్లాడారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు చంద్ర రాజగోపాల్,బాబు, వెంకటేశ్వర్లు ఉన్నారు.

అసంపూర్తి గృహాలు పూర్తి చేయండి

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

తోటపల్లిగూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మల్లికార్జునపురం గిరిజనకాలనీలో వివిధదశల్లో నిలిచిపోయిన జగనన్న గృహ నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ తెలిపారు. ఈ విషయంపై సోమవారం వారు బాధితులతో కలిసి తహసీల్దారు కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న కాలనీలోని అసంపూర్తి గృహాలను పూర్తిచేయాలని, పులిదిబ్బ గిరిజనకాలనీలో గిరిజనులకు ఇచ్చిన స్థలాలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. పోలీసుస్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న కాలేజి వద్ద అల్లరిమూకలు ఎక్కువైనట్లు చెప్పారు. ఈ మేరకు తహసీల్దారు కృష్ణ ప్రసాద్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ వీరేంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మండ ల వ్యవసాయ కార్యదర్శి మధు, మండల కార్యదర్శి లక్ష్మయ్య, ఉండ్రాళ్ల శ్రీనివాసులు, రాజా, రమణమ్మ పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

భయపెడుతున్న తుపాకీ చప్పుళ్లు

● నగరంలో పేలిన లైసెన్స్‌డ్ గన్

● గతంలోనూ దోపిడీ కోసం బెదిరింపులు

● ఇప్పటికీ కళ్లముందే తాడిపర్తి ఘటన

● కావలి తనిఖీల్లో వెలుగుచూసిన వెపన్

నెల్లూరు(క్రైం),మార్చి 23 (ఆంధ్రజ్యోతి):జిల్లాలో గన్‌కల్చర్ పెద్దగా లేకపోయినా కొన్నేళ్లుగా జరుగుతున్న సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. జిల్లాలో బ్యాంకులకు ఇచ్చిన తుపాకీలతోపాటు ప్రైవేటు వ్యక్తులకు ఇచ్చిన గన్‌లు 533పైగా ఉన్నాయి. లైసెన్స్ లేకుండా ఇతర రాష్ట్రాల నుంచి తుపాకీ తీసుకువచ్చి యువతని హత్య చేసి, యువకుడు ఆత్మహత్య చేసుకోవడం కొంతకాలం క్రితం పొదలకూరులో జరిగింది. ఈడీ అధికారులమంటూ గన్ చూపించి నగరంలో బంగారు దోపిడీకి కొందరు యత్నించారు. ఇటీవల కావలిలో ఓ ఇంట్లో పోలీసులు చేపట్టిన తనిఖీల్లో తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఇక నగరంలోని ఆచారి వీధిలో ఈనెల 22న ఆస్తి తగాదాల్లో పేలిన పిస్టల్ మరోసారి జిల్లాలో చర్చకు దారితీసింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న లైసెన్స్ పిస్టల్

● సంచలనంగా మారిన తుపాకీ ఫైర్

● 2022లో నగరంలోని లావణ్య జ్యూయలరీస్‌లో దోపిడీకి యత్నించిన ముఠా సభ్యులను పోలీసులు అరెస్ట్‌చేశారు. వారి వద్ద నుంచి తుపాకీని స్వాధీనం చేసుకున్నారు. ఈ క్రమంలో విచారణ చేపట్టిన పోలీసులు చెన్నైలో నకిలీ ఐడీ కార్డులు, పోలీసు యూనిఫారమ్ కొనుగోలు చేయడంతోపాటు రూ.7 వేలు చెల్లించి ఎయిర్ పిస్టల్‌ను కొనుగోలు చేసినట్లు తేల్చారు.

● పొదలకూరు మండలం తాడిపర్తిలో తనతో వివాహానికి అంగీకరించలేదని ఓ యువకుడు గన్‌తో యువతిని కాల్చి హత్య చేశాడు. అదే గన్‌తో తను కూడా కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ కేసులో పోలీసులు లోతుగా పరిశీలించగా, ఆ యువకుడు బిహార్‌కు వెళ్లి పిస్టల్‌ను కొనుగోలు చేసి నెల్లూరుకి తీసుకు వచ్చినట్లు తేలింది.

● ఇకపోతే ఇటీవల కావలిలో పోలీసులు ఓ రౌడీషీటర్ ఇంట్లో తనిఖీలు చేయగా, తుపాకీ దొరికింది. ఇలా జిల్లాలో అనుమతులు లేని గన్‌లతో హత్యలు, దోపిడీ యత్నాలు, బెదిరింపులు జరుగుతున్నాయి.

● ఆస్తి పంపకాల విషయమై నగరంలోని ఆచారివీధిలో ఈనెల 22న రాత్రి హితేష్‌కుమార్ జైన్ తన స్నేహితులతో కలిసి తండ్రి ఇంటి వద్దకు వచ్చి తలుపులు తీయాలని కేకలు వేశాడు. తీయకపోవడంతో తన లైసెన్స్‌డ్ పిస్టల్‌ను తీసి తలుపుపై కాల్చారు. ఈ ఘటన కూడా జిల్లాలో చర్చనీయాంశమైంది.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

● పిస్టల్, 26 రౌండ్స్ స్వాధీనం

నెల్లూరు(క్రైం), మార్చి 24: హత్యాయత్నం కేసులో నగరంలోని చిన్నబజారు పోలీసులు సోమవారం ఐదుగురు నిందితులను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి పిస్టల్, 26 రౌండ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు, నగరంలోని రావూరివీధిలో రాజ్‌మల్ జైన్ నివాసం ఉంటున్నారు. ఆయన కుమారులు దిలీప్‌కుమార్ జైన్, హితేష్ కుమార్ జైన్, మనోజ్‌కుమార్. రెండో కుమారుడు హితేష్‌కుమార్ జైన్‌కు పెళ్లయ్యాక శిఖరంవారివీధిలో వేరుగా కాపురం ఉంటున్నాడు. పెద్దకుమారుడు వద్ద రాజ్‌మల్‌జైన్, ఆయన భార్య ఉంటున్నారు.ఈ క్రమంలో హితేష్‌కుమార్ జైన్‌కు ఆస్తిలో కొంతభాగం ఇవ్వడంతో ఆయన ప్రస్తుతం సుబేదారు పేటలో వ్యాపారం చేసుకుంటున్నారు. కాగా ఆస్తి పంపకాలు చేయాలని హితేష్‌కుమార్ జైన్ అప్పుడప్పుడు ఇంటికి వెళ్లి తండ్రిని అడిగేవాడు. ఈ క్రమంలో అన్నదమ్ముల మధ్య వివాదాలు జరుగుతూ ఉండేవి. ఈ నెల 22న అర్ధరాత్రి హితేష్‌కుమార్ జైన్ తన స్నేహితులు వంశీ, పల్లి భరత్, రాజశేఖర్‌రెడ్డి, సందీప్, కిషోర్ కలిసి దిలీప్‌కుమార్ ఇంటికి వచ్చి ఇంటితలుపులు కొట్టారు. తలుపులు తీయకపోవడంతో తన వద్ద ఉన్న పిస్టల్‌తో హితేష్‌కుమార్ జైన్ తలుపులను కాల్చి అక్కడ నుంచి పరారయ్యారు. దీంతో దిలీప్‌కుమార్ జైన్ ఆస్తి పంపకాలు చేయక పోవడంతో తన తమ్ముడు స్నేహితులతో కలిసి వచ్చి పిస్టల్‌తో కాల్చి చంపే ప్రయత్నం చేశాడని ఈనెల 23న చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన చిన్నబజారు ఇన్‌స్పెక్టర్ చిట్టెం కోటేశ్వరరావు ప్రత్యేక బృందాలతో నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ముద్దాయిలను సోమవారం నగరంలోని వాకర్స్ రోడ్డులో నిర్మాణంలో ఉన్న అపార్ట్‌మెంట్‌లో అరెస్టు చేసి వారి వద్ద నుంచి లైసెన్స్ పిస్టల్‌ను, 26రౌండ్స్‌ను స్వాధీనం చేసుకున్నామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. నిందితుల అరెస్ట్‌లో ప్రతిభ కనబరి చిన అధికారులు, సిబ్బందిని నగర డీఎస్పీ సింధు ప్రియ అభినందించారు.

ట్రాప్ కెమెరాల చోరీ

ఉదయగిరి, మార్చి 24(ఆంధ్రజ్యోతి):మండలంలోని కొత్తపల్లి బీట్ పరిధి దిరిశనమాను బండ ప్రాంతంలోని నీటికుంట వద్ద ఏర్పాటు చేసిన నాలుగు ట్రాప్ కెమెరాలు చోరీకి గురైన సంఘటన సోమవారం వెలుగుచూసింది. అటవీ ప్రాంతంలో జంతువుల, వేటగాళ్ల కదలికలను తెలుసుకునేందుకు ఇటీవల ఉదయగిరి అటవీశాఖ పరిధి లోని పలు ప్రాంతాల్లో అధికారులు ట్రాప్ కెమెరాలు ఏర్పాటుచేశారు. అటవీ ప్రాంతానికి వేటకు వెళ్లినవారు ఈ కెమెరాలను చోరీచేసి ఉంటారని అధికారులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై రేంజ్ అధికారి బీఎస్ కుమారరాజాను వివరణ కోరగా కెమెరాల చోరీపై పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు.


లైంగిక వేధింపుల కేసులో జీవితఖైదు

నెల్లూరు (లీగల్), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఓ బాలికకు మామిడికాయలు తీసిస్తానని చెప్పి, చెట్ల పొదల్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడన్న కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడు సన్రెడ్డి సుబ్రహ్మణ్యంకు జీవితఖైదుతో పాటు రూ.22వేల జరిమానా విధిస్తూ నెల్లూరు పోక్సో కోర్టు స్పెషల్ న్యాయాధికారి సిరిపిరెడ్డి సుమ సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు, సైదాపురం మండలం జప్లాపురంకు చెందిన బాలిక(10) 2021 ఏప్రిల్ 29వతేదీ ఉదయం 10గంటల సమయంలో ఆడుకుంటుండగా, అదే మండలం చాగణం ఎర్ర సంఘానికి చెందిన సన్రెడ్డి సుబ్రహ్మణ్యం బాలికకు మామిడికాయలు కొనిస్తానని సమీపంలోని చెట్ల పొదలోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేసు విచారణలో నిందితుడిపై నేరం రుజువు కావడంతో న్యాయాధికారి పైవిధంగా జైలుతోపాటు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డీ. చం ద్రశేఖర్ వాదించారు.

ఇరువర్గాల ఘర్షణ

● అక్కాచెల్లెళ్లకు గాయాలు

కావలి రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక బుడంగుంట కాలనీలో సోమవారం రెండు కుటుంబాల మధ్య జరిగిన ఘర్షణలో అక్కాచెల్లెళ్లు కీర్తి, తాళ్లూరు నాగమణికి గాయాలయ్యాయి. బాధితుల వివరాల మేరకు.. కాలనీలో నివాసముంటున్న కీర్తి, నాగమణిలు ఇం టి వద్ద నుంచి అల్పాహారం తెచ్చుకునేందుకు దుకాణం వద్దకు వె ళ్తుండగా పాత గొడవలను దృష్టిలో పెట్టుకుని అదే ప్రాంతానికి చెం దిన బెల్లంకొండ నరేంద్ర, దివ్య, హజరత్, ప్రసన్నలు వారితో వివా దానికి దిగారు. ఈ ఘర్షణలో అక్కాచెల్లెళ్లు కీర్తి, తాళ్లూరు నాగమణి లపై కర్రలతో దాడి చేసి కొట్టారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇరువురి ఫిర్యాదుల మేరకు రూరల్ పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



గాయపడిన కీర్తి, నాగమణి

చికెన్ ధరలు
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	108
స్కిన్ చికెన్	200
స్కిన్‌లెస్	220

కోడిగుడ్ల ధర (100): 435

న్యూస్ బాక్స్

బ్రోచర్ ఆవిష్కరణ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అన్నీ రకాల వ్యాపారాలు, స్టార్టప్ కంపెనీలకు అవసరమైన టెక్నాలజీని అందించడంతోపాటు, వారు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపాలనే ఉద్దేశ్యంతో చంద్రకాంత్‌రెడ్డి డీజీ ఎంపవర్ ఇండియా అనే సంస్థను నెల్లూరులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ కంపెనీ బ్రోచర్‌ను సోమవారం దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆవిష్కరించారు. తన నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ సంస్థ ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ నెల్లూరు పార్లమెంటు ప్రధాన కార్యదర్శి చేజర్ల వెంకటేశ్వరరెడ్డి, ముదిరాజ్ సాధికారక సమితి రాష్ట్ర కన్వీనర్ పీఎల్.రావు, తదితరులు పాల్గొన్నారు.

చీరల పంపిణీ

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నేత ఆసిఫ్ బాషా ఆధ్వర్యంలో రంజాన్ సందర్భంగా నగరంలోని వెంగళరావునగర్‌లో సోమవారం ముస్లింమైనార్టీలకు దుస్తులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాహిద్, ఖాసిఫ్, జావెద్, చాన్‌బాషా, బాబు పాల్గొన్నారు.

క్యాన్సర్ రోగులకు అన్నీ రకాల సేవలు

నెల్లూరు (వైద్యం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో క్యాన్సర్ రోగులకు అన్నీ రకాల వైద్యసేవలు అందిస్తున్నామని అబైండింగ్ హోప్ ట్రస్ట్, పబ్లిక్ రిలేషన్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ టైటస్ నిర్మల్‌కుమార్ తెలిపారు. సోమవారం ట్రస్ట్ కార్యాలయంలో నిర్వహించిన సదస్సులో ఆయన మాట్లాడారు. అనంతరం రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాసరావు, చీఫ్ మెడికల్ అధికారి డాక్టర్ లక్ష్మి, రేడియేషన్ అంకాలజిస్ట్ డాక్టర్ గీత ఉషశ్రీ తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా 50 మంది క్యాన్సర్ రోగులకు మందులతోపాటు న్యూట్రిషన్ ఫుడ్ అందించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ క్యాన్సర్ ఆసుపత్రి మేనేజర్ డాక్టర్ భక్తవత్సలరెడ్డి, మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ ఉషాకిరణ్, జయప్రకాశ్, మాధురి, డాక్టర్ దీప్తి, మోహనాంబ తదితరులు పాల్గొన్నారు.

భార్య అనుమానించిందని భర్త ఆత్మహత్య

నెల్లూరు రూరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భార్య తనపై అనుమానం పెంచుకున్నదని మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన నెల్లూరు రూరల్ మండలం కొత్తకాలువ సమీపాన ఉన్న కామాక్షినగర్‌లో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం మేరకు.. కామాక్షినగర్‌లో నివాసముంటున్న పాకం శ్రీనివాసులు (35)కి మరో మహిళతో సంబంధం ఉన్నట్లు భార్య రాజేశ్వరి అనుమానించడంతో ఇరువురి మధ్య వివాదం ఏర్పడింది. దీంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీనివాసులు ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లో ఊరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. అందిన సమాచారంతో సోమవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ గుంజి వేణు తెలిపారు.

నర్సింగ్ క్వార్టర్స్‌లో లార్వా సర్వే

నెల్లూరు (వైద్యం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని జీజీహెచ్‌లోని నర్సింగ్ క్వార్టర్స్‌లో అనుమానిత చికెన్‌గున్యాపై మలేరియా నివారణ అదనపు అధికారి నాగార్జునరావు సోమవారం లార్వా సర్వే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌యూవోలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

టీటీడీ పంచాంగాల విక్రయం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : టీటీడీ ప్రచురించిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర పంచాంగాలను నగరంలోని టీటీడీ కల్యాణ మండపంలో విక్రయిస్తున్నారు. కావాల్సిన వారు కొనుగోలు చేయవచ్చని మండపం మేనేజర్ విజయనిర్మల ఒక ప్రకటనలో తెలిపారు. విడిపత్రి వెల రూ.75లు మాత్రమేనని ఆమె పేర్కొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి): ఆచారివీధిలో సోమవారం నెల్లూరు ప్రింటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ వేలూరు మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఏర్పాట్లను ప్రింటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వరరావు, నాయకులు పర్యవేక్షించారు.



5న పుత్ర కామేష్టియాగం

నెల్లూరు (సాంస్కృతికం, ఆంధ్రజ్యోతి) : సంతానం లేని దంపతులు ఏప్రిల్ 5న నగరంలోని బాలాజీనగర్ సీతారామ మందిరంలో జరిగే పుత్రకామేష్టి యాగంలో పాల్గొనాలని నిర్వాహకుడు మాచవోలు కోటేశ్వరశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ యాగాన్ని 60 ఏళ్లుగా నిర్వహిస్తున్నామని, రుషి సంప్రదాయంలో జరిగే యాగంలో పాల్గొని సంతానప్రాప్తిని పొందాలని కోరారు.

వీనుల విందు!

మైమరిపించిన ప్రియా సిస్టర్స్ గాత్ర కచేరి

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని పుర మందిరంలో జరుగుతున్న 60వ త్యాగరాజ స్మరణోత్సవాలు సోమవారం నాటికి ఆరో రోజుకి చేరాయి. రాత్రి చెన్నైకి చెందిన ప్రియా సిస్టర్స్ బృందం గాత్ర కచేరి శ్రోతలను మైమరిపింపజేసింది. ఈ కచేరీలో త్యాగరాజ స్వామి కృతులను షణ్ముఖ ప్రియ, హరిప్రియ వీనుల విందుగా ఆలపించి సంగీత ప్రియుల ప్రశంసలు పొందారు. వీరికి మృదంగం కృష్ణస్వామి, కె.రమేష్ ఘనం, ట్రిచు మురళీ అందించారు. ఉదయం మహారథి కర్ణ హరికథను నంది వసంతకుమారి భాగవతార్, పొద్దుటూరుకు చెందిన నాయని లక్ష్మీకుమారి, తులసీ జలంధర హరికథ గానం శ్రోతలను మంత్ర ముగ్ధులను చేసింది. సాయంత్రం స్థానిక సంగీత విద్వాంసులు త్యాగరాజస్వామి పంచరత్న కృతులు ఆలపించారు. వీరిని బిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ కార్యవర్గం ఘనంగా సత్కరించింది. ఈ సందర్భంగా యోగ రాముడి అలం కారం ఆకట్టుకుంది.

మోడల్ స్కూళ్లుగా మున్సిపల్ పాఠశాలలు

● పురపాలక మంత్రి పొంగూరు నారాయణ



ఇసుకడొంక మున్సిపల్ పాఠశాల వద్ద టీచర్లు, ప్రజలతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ

నెల్లూరు(సిటీ), మార్చి24, (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని మున్సిపల్ పాఠశాలలను మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతున్నట్లు పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. సోమవారం నగరంలోని పలు ప్రాంతాల్లోని ఎన్ఎంసీ పాఠశాలలు, పార్కులను ఆయన కమిషనర్ సూర్యతేజతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ పాఠశాలలోని మైదానాన్ని ఆధునీకరిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు అవసరమైన వసతులన్నీ సమకూర్చుతున్నామ న్నారు. పార్కుల్లో ఆహ్లాదం పెంచి, జిమ్ పరికరాలు అందుబాటులోకి తీసుకువస్తున్నామని చెప్పారు. నెల్లూరు మున్సిపల్ పాఠశాలలను అన్నీ వసతులతో రాష్ట్రంలోనే మొదట స్థానంలో ఉంచేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.

రంగడి హుండీల లెక్కింపు



నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని తల్పగిరి రంగనాథస్వామి ఆలయంలో సోమవారం హుండీల లెక్కింపు జరి గింది. 2024 అక్టోబరు నుంచి సోమవారం వరకు భక్తులు సమర్పించిన కానుకలు లెక్కించగా రూ.25,68,806 ఆదాయం వచ్చింది. ఈ నెల 9 నుంచి 20 వరకు బ్రహ్మోత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన తాత్కాలిక హుండీలు లెక్కించగా రూ.2,23,583 వచ్చింది. ఈ కార్యక్రమానికి పర్యవేక్షకుడిగా వేణుగోపాలస్వామి ఆలయ ఈవో, సహాయ కమిషనర్ జె శ్రీనివాసరావు వ్యవహరించారు.

యాప్ అప్‌డేట్ చేయగానే పూడికతీత



కాలువలో పూడికతీతను పరిశీలిస్తున్న టీడీపీ నాయకులు

నెల్లూరు (వైద్యం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ యాప్ అప్‌డేట్ చేయగానే ఉయ్యాల కాలువ పూడికతీత ప్రారంభమైందని టీడీపీ బీసీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధర్మవరం సుబ్బారావు పేర్కొన్నారు. సోమవారం 47వ డివిజన్‌లో ఉయ్యాల కాలువ పూడికతీతను టీడీపీ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డివిజన్ పరిధిలోని కుక్కలగంట ప్రాంతం లో ఇళ్ల మధ్యన ఉన్న ఉయ్యాల కాలువలో పలు వ్యర్థాలు, చెత్త పేరుకుపోయి దోమల బెడద ఎక్కువగా ఉందని స్థానికులు ఫిర్యాదు చేశారన్నారు. ఈ నేపథ్యంలో మంత్రి నారాయణ చొరవతో ముందుగా పూడికతీత చేపట్టామన్నారు. కార్యక్రమంలో డివిజన్ ఇన్‌చార్జ్ డాక్టర్ గణేష్‌కుమార్, షేక్ మాబాషా, భాస్కర్, మునికుమార్, కంచికృష్ణ, మునికృష్ణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆకస్మిక తనిఖీల్లోనూ విజ్ఞప్తులను పరిష్కరిస్తా..

నెల్లూరురూరల్, మార్చి24, (ఆంధ్రజ్యోతి) : సీసీరోడ్లు, డ్రైనేజీ కాలువల పనులపై నిర్వహిస్తున్న ఆకస్మిక తనిఖీల్లోనూ ప్రజల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిష్కరిస్తానని రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం స్కూటర్‌పై తిరుగుతూ 20వ డివిజన్‌లోని పనులను పరిశీలించారు. పనులు ఎట్టిపరిస్థితుల్లోనూ అనుకున్న సమయానికి పూర్తి చేయాల్సిందేనని అన్నారు. తాను కారులో కాకుండా స్కూటర్‌పై పనుల పరిశీలనకు వస్తున్నానని తెలిపారు. దీనివల్ల తాను ఎక్కడకి వెళ్తున్నానో ఎవరికీ తెలియదని అన్నారు.



కోడూరుపాడు దళితవాడలో వృద్ధురాలితో మాట్లాడుతున్న గిరిధర్‌రెడ్డి

● వాస్తవాలు తెలుసుకునేందుకే...

ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నారో వాస్తవాలు తెలుసుకునేందుకు గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నట్లు టీడీపీ నేత కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి అన్నారు. 1వ డివిజన్‌లోని దళితవాడలో ఆయన ఇంటింటికి వెళ్లారు. ప్రజల సమస్యలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నగరంలో సినిమా షూటింగ్

నెల్లూరు (సాంస్కృతికం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాయాజీవీధి ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం 'రాముడు అందరివాడు' అనే సినిమాకు పూజాదికార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం షూటింగ్‌లో తొలిషాట్‌కి అమరావతి కృష్ణారెడ్డి క్లాప్ కొట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ ఉమామహేశ్వరరావు, దర్శకుడు మైకేల్, హీరో శ్రీరామ్, చిత్ర సిబ్బంది, నగర ప్రముఖులు పాల్గొన్నారు.

జనసేన ఇఫ్తార్ విందు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), మార్చి24 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో ఉపవాసాలు ఉంటున్న ముస్లింలకు జనసేన జిల్లా కార్యదర్శి షేక్ ఆలియా ఆధ్వర్యంలో సోమవారం నవాబుపేటలోని బాబామియా మసీదులో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పార్టీ నగర అధ్యక్షుడు దుగ్గిశెట్టి సుజయ్‌బాబు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో నాయకులు చప్పిడి శ్రీనివాసులు రెడ్డి, కోల విజయలక్ష్మి, గుడ్లూరు నాగరత్నం, తదితరులు పాల్గొన్నారు.

శబరి శ్రీరామ క్షేత్రంలో 30 నుంచి వసంత నవరాత్రులు

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో ఈనెల 30 నుంచి ఏప్రిల్ 6 వరకు వసంత నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకుడు చెన్నూరు వెంకటేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు హాజరై ఉత్సవాలను జయప్రదం చేయాలని కోరారు.

వాహనాల ఫిట్‌నెస్ రవాణా శాఖే చేపట్టాలి



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీఐటీయూ, ఆటోకార్మిక సంఘం నాయకులు

సీఐటీయూ, ఆటోకార్మిక సంఘం నిరసన ప్రదర్శన

నెల్లూరు (వైద్యం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ అమలు విధానాన్ని ప్రైవేట్ సంస్థలకు అప్పగించరాదని, సోమవారం సీఐటీయూ, ఆటోకార్మిక సంఘం నాయకులు నిరసన ప్రదర్శన నిర్వహించారు. నగరంలోని ఆత్మకూరు బస్టాండ్ నుంచి పూలమార్కెట్ మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు ప్రదర్శన సాగింది. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శి నాగేశ్వరరావు, ఆటోకార్మిక సంఘం నగర కార్యదర్శి మురళి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం సెన్సార్ ట్రాకింగ్ పద్ధతిని అనుసరించి అన్ని వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌లు ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశించిందన్నారు. ఈ ఆదేశాలు ఏప్రిల్ 1 నుంచి అమలులోకి వస్తాయన్నారు. అయితే సర్టిఫికెట్‌ను రవాణా శాఖ నుంచి కాకుండా ప్రైవేట్ ఏజెన్సీల ద్వారా అందచేయాలని నిర్ణయం తీసుకోవటమే దారుణమన్నారు. రవాణాశాఖే ఆ పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆటోకార్మిక సంఘం నేతలు రాజా, నివాస్, రవీంద్ర, శ్రీనివాసులు, విజయ్, ముక్కు రమణయ్య, సురేష్ పాల్గొన్నారు.

ఉగాది ప్రతిభా పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

నెల్లూరు(విద్య), మార్చి 24 (ఆంధ్రజ్యోతి):జీవనయోగా ట్రస్ట్ ఆధ్వర్యంలో అందిం చనున్న ఉగాది ప్రతిభా పురస్కారాలకు అర్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవాలని ట్రస్టీ ప్రసన్నకుమార్ తెలిపారు. సోమవారం నగరంలోని స్వతంత్ర పార్కులో పురస్కారాలకు సంబంధించిన లోగోను ఆయన ఆవిష్కరించారు. ఈనెల 31లోగా మినీ టౌన్ హాలులో పురస్కారాలు అందచేయనున్నామని, అన్నీ రంగాల్లో ప్రతిభ కలిగిన స్త్రీ, పురుషులు, దరఖాస్తు చేసుకోవచ్చాన్నారు.

భక్తిశ్రద్ధలతో కన్య పూజ

నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని రాజరాజేశ్వరి ఆలయంలో సోమవారం చండీహోమం జరిగింది. ఈ హోమానికి ఉభయకర్తగా ఆనం జయకుమార్‌రెడ్డి వ్యవహరించారు. హోమం అనంతరం ఆనం చేత ఆలయ ఉపప్రధాన అర్చకులు రవిశర్మ, వేద పండితులు రామకృష్ణమాచార్యులు, 12ఏళ్ల చిన్నారికి కుమారి (కన్య) పూజ చేయించారు.

పీజీఆర్ఎస్‌కి హాజరుకాకుంటే జీతాలు ఆపండి

నెల్లూరు(సిటీ), మార్చి24, (ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలను వినతుల ద్వారా స్వీకరించి, వాటికి పరిష్కరించాల్సిన బాధ్యత పీజీఆర్ఎస్ కార్యక్రమానికి ఉందని, ఇందుకు హాజరుకాని అధికారులకు నోటీసులు జారీ చేసి, వీలైతే జీతం కూడా ఆపేయాలని ఏడీసీ నందన్ తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కి కొందరు అధికారులు గైర్హాజరయ్యారు. స్పందించిన ఆయన మేనేజర్ ఇనయతుల్లాకు ఈ మేరకు ఆదేశాలిచ్చారు. కాగా 11వ డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో డ్రైనేజీ కాలువకు కల్వర్టులు లేనందున, ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానిక బీజేపీ నాయకులు వినతిపత్రం అందచేశారు. జనసేన నాయకుడు నూనె మల్లికార్జున్ యాదవ్ పలు ప్రజా సమస్యలపై అధికారులకు వినతులిచ్చారు.



అర్జీదారుతో మాట్లాడుతున్న ఏడీసీ నందన్


పునఃప్రారంభం ఎప్పుడో..?

● రెండేళ్లుగా సాగుతున్న టీటీడీ కల్యాణ మండపం మరమ్మతులు
● ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నగరవాసుల దూరం
● దేవదాయశాఖ మంత్రి ఆనం చొరవ చూపాలని వినతి


నెల్లూరు (సాంస్కృతికం) మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని టీటీడీ కల్యాణ మండపం మరమ్మతులు పనులు రెండేళ్లకుపైగా సాగుతూనే ఉన్నాయి. ఈ కల్యాణ మండపం అందుబాటులో ఉంటే పేద, మధ్య తరగతి కుటుంబాలు తక్కువ ఖర్చుతో కల్యాణాలు చేసుకునే వీలుంటుంది. అంతేకాక శ్రీవారి సేవా కార్యక్రమాలు, ధార్మిక కార్యక్రమాలు, శ్రీవారి ప్రసాదాలు భక్తులకు అందుబాటులో ఉంటాయి. నగరంలోనే దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ పాలక మండలి సభ్యురాలు, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిలు ఉన్నారు. అయితే కల్యాణ మండపం పనులు త్వరగా చేయించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో టీటీడీ ఆధ్వర్యంలోని కల్యాణ మండపాలు నెల్లూరు మినహా మిగిలినచోట్ల ప్రైవేటు వ్యక్తులకు లీజుకి ఇచ్చారు. రెండేళ్లకుపైగా కల్యాణ మండపం మూతపడడంతో ఆలయ ఆదాయానికి గండిపడడంతోపాటు పేద, మధ్య తరగతి కుటుంబాలపై ఆర్థిక భారం పడింది.

● గతంలో టిక్కెట్లు, గదుల కేటాయింపు

గతంలో ఈ కల్యాణ మండపంలో శ్రీవారి దర్శన టిక్కెట్లు, గదుల కేటాయింపు సౌకర్యం ఉండేది. ప్రతీ ఏటా 120 నుంచి 140 కుటుంబాలు కల్యాణాలు జరుపుకునేవి. ఈ కల్యాణాల వల్ల టీటీడీకి ఏటా దాదాపు రూ.9లక్షల ఆదాయం వచ్చింది. మండపంలో నిత్యదీపారాధనలతో ఆధ్యాత్మిక శోభ వెల్లివిరిసేది. స్వామివారి జన్మనక్షత్రం శ్రవణ నక్షత్రం సందర్భంగా శ్రీవారి కల్యాణం, అన్నప్రసాద వితరణ జరిగేవి. ప్రతినెలా రెండో శనివారం శ్రీవారి లడ్డూల విక్రయాలు జరిగేవి. టీటీడీ, ధర్మప్రచార పరిషత్ ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఈ కల్యాణ మండపం ద్వారానే జరిగేవి. అన్నమాచార్య ప్రాజెక్టు సాంస్కృతిక కార్యక్రమాలు, పురాణ ప్రవచనాలు జరిగేవి. రెండేళ్లకుపైగా మూతబడడంతో శ్రీవారి ఆధ్యాత్మిక, ధార్మిక కార్యక్రమాలను నగర ప్రజలు దూరమయ్యారు. ఇప్పటికైనా కల్యాణ మండపం పునఃప్రారంభానికి ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు చొరవ చూపాలని జిల్లా ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




ప్రారంభానికి నోచుకోని టీటీడీ కల్యాణ మండపం



కల్యాణ మండపం లోపలిభాగం

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
మంగళవారం 25 మార్చి 2025





నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

● తూర్పుకనుపూరులో మొదలైన సందడి

6

నాయుడుపేటలో వైసీపీకి భారీ షాక్

● పార్టీ వీడిన ముగ్గురు కౌన్సిలర్లు, మరికొందరు నేతలు



● 2024-25 ఏడాదికి టీటీడీ రూ.5,141.74 కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసింది. సవరించిన అంచనాల మేరకు రూ.5,179.85గా పేర్కొంది. తాజాగా 2025-26 బడ్జెట్ అంచనాలో రూ.5,258.68 కోట్లు.

ఈ ఏడాది బడ్జెట్ అంచనా స్వల్పంగా రూ.78.83 కోట్లు పెరిగింది.

హుండీ.. వడ్డీ

టీటీడీకి ప్రధాన ఆదాయ వనరులివే

స్వల్పంగా పెరిగిన ఆదాయ అంచనా



తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): టీటీడీ తాజాగా ప్రవేశపెట్టిన నూతన బడ్జెట్‌లోనూ శ్రీవారి హుండీ, వడ్డీ ద్వారానే ఆదాయం భారీగా సమకూరుతుందని అంచనా వేసింది. గడిచిన ఏడాది హుండీ ద్వారా రూ.1,611 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,671 కోట్ల కానుకలు లభించాయి. ఈక్రమంలో 2025-26 ఆర్థిక సంవత్సరానికి రూ.1,729 కోట్ల హుండీ ఆదాయం లభిస్తుందని టీటీడీ అంచనా వేసింది. రూ.900 కోట్ల నుంచి రూ.వెయ్యి కోట్లలోపు ఉండే హుండీ ఆదాయ అంచనాలు కొవిడ్ అనంతరం భారీగా పెరిగిన విషయం తెలిసిందే. ఈక్రమంలో 2022-23 బడ్జెట్‌లో హుండీ ద్వారా రూ.వెయ్యి కోట్లు లభిస్తుందని అంచనా వేయగా ఎవరూ ఊహించని విధంగా రూ.1,613 కోట్లు లభించింది. అలాగే 2023-24కి గాను రూ.1,611, 2024-25కి గాను రూ.1,671 కోట్ల ఆదాయం లభించింది.

● మరోవైపు వడ్డీల ద్వారా గతేడాది రూ.1,167 కోట్లు ఆదాయం వస్తుందని అంచనా వేయగా, రూ.1,253 కోట్లు లభించింది. ఈక్రమంలో నూతన బడ్జెట్‌లో రూ.1,310 కోట్లు వడ్డీల ద్వారా లభిస్తుందని టీటీడీ అంచనా వేస్తోంది. కొవిడ్ ముందు వరకు వడ్డీల ద్వారా కేవలం రూ.800 కోట్లలోపే సమకూరేది.

● దర్శనంపై గతేడాది రూ.338 కోట్లు లభిస్తుందని టీటీడీ అంచనా వేసినప్పటికీ రూ.305 కోట్లు మాత్రమే సమకూరింది. దీంతో 2025-26 వార్షిక ఏడాదికి కేవలం రూ.310 కోట్లు మాత్రమే వస్తుందని అంచనా వేశారు.

● ప్రసాదాల ద్వారా రూ.600 కోట్లు లభిస్తుందని గతేడాది భావించగా రూ.50 కోట్లు తగ్గింది. అయినప్పటికీ రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.600 కోట్లు వస్తుందని భావిస్తున్నారు.

● గతేడాది ఇంజనీరింగ్ పనులకు, ఇంజనీరింగ్ నిర్వహణకు రూ.540 కోట్లు కేటాయించినప్పటికీ రూ.500 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. తాజా వ్యయాల అంచనాలోనూ రూ.500 కోట్లే కేటాయించారు.

● గతేడాది గరుడవారధి నిర్మాణానికి రూ.53 కోట్లు కేటాయించినప్పటికీ రూ.25 కోట్లే ఖర్చు చేశారు. దీంతో తాజా బడ్జెట్‌లో రూ.28 కోట్లు కేటాయించారు.

● గడిచిన ఏడాది ధార్మిక ప్రచారానికి రూ.131.50 కోట్లు ఖర్చు కాగా, నూతన బడ్జెట్‌లో రూ.10 కోట్లు తగ్గించారు.

బడ్జెట్‌లో పొందుపరిచిన అంచనాల వివరాలు

ఆదాయాల అంచనా..	(రూ.కోట్లలో)
ప్రారంభనిల్వ	488.90
హుండీ	1,729
వడ్డీ	1,310
ప్రసాదాలు	600
దర్శన టికెట్లు	310
ఆర్జితసేవలు	130
అద్దెగదులు, కల్యాణమండపాలు	157
తలనీలాల వేలం	176.50
రుణాలు, సెక్యూరిటీ-డిపాజిట్లు తదితరాల ద్వారా	76.38
ట్రస్టులు	90
అద్దెలు, విద్యుత్‌బిల్లులు, వాటర్ బిల్లులు	66
ప్రచురణల విక్రయాలు	31
ఇతర ఆదాయాలు(అగర్‌బత్తి, టోల్‌గేట్ వంటివి)	93.90
	5,258.68

వ్యయాల అంచనా..	(రూ.కోట్లలో)
మానవ వనరులు	1,773.75
వస్తువుల కొనుగోళ్లు	768.50
కార్పస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్	800
ఇంజనీరింగ్ పనులు	350
గరుడవారధి	28
స్విమ్స్ ఆస్పత్రి ఇంజనీరింగ్ క్యాపిటల్ వర్క్స్	60
స్విమ్స్ రెవెన్యూ గ్రాంట్స్	60
ఇంజనీరింగ్ నిర్వహణ పనులకు	150
ఫ్యాకల్టీ మేనేజ్‌మెంట్ సర్వీస్	80
ఇతర సంస్థలకు గ్రాంట్స్	130
హిందూధార్మిక ప్రచారానికి	121.50
రుణాలు, ముందుగా ఉద్యోగులకు చెల్లింపులు, ఈఎమ్‌డీ, సెక్యూరిటీ డిపాజిట్స్	177.62
పెన్షన్ ఫండ్ కాంట్రిబ్యూషన్స్	100
విద్యుత్ ఉత్పత్తికయ్యే వ్యయం	70
కాంట్రిబ్యూషన్స్ టు స్టేట్ గవర్నమెంట్	50
ఇతర క్యాపిటల్ పనులు	52.50
ఇతర చెల్లింపులు	50.08
ఇతర నిర్వహణ ఖర్చులు	40
ప్రకటనలు	8
క్లోజింగ్ క్యాష్, బ్యాంక్ నిల్వ	448.73
	5,258.68 కోట్లు



ఉద్యోగుల సిఫార్సులకు 'సుపథం' ద్వారా శ్రీవారి దర్శనం

● టీటీడీ కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్యల పరిష్కారానికి కమిటీ

● తిరుపతిలో స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధికి రూ.కోటి

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): టీటీడీ శాశ్విత ఉద్యోగుల సిఫార్సు లేఖలపై మూడు నెలలకోసారి సుపథం ద్వారా ప్రత్యేక ప్రవేశ దర్శనం కల్పించాలని తీర్మానించినట్టు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. సమావేశానికి ముందు టీటీడీ ఆస్థాన విద్వాంసుడు గరిమెళ్ల బాలకృష్ణప్రసాద్ మృతికి సంతాపం తెలుపుతూ రెండు నిమిషాలు మౌనం పాటించారు. బోర్డులో తీసుకున్న నిర్ణయాలను చైర్మన్ మీడియాకు వెల్లడించారు.

● తమకొచ్చే రూ.43 వేల జీతంలో జీఎస్టీ పేరుతో రూ.4,800 కోత విధిస్తున్నారని, మొత్తం జీతం వచ్చేలా చర్యలు తీసుకోవాలని పోటు కార్మికులు కోతల్లేకుండా జీతాలు అందించాలని తీర్మానించాం.

● తిరుమలకు వచ్చే వీఐపీ, నాన్ వీఐపీలకు మంచి వసతి ఇవ్వాలనే ఉద్దేశ్యంతో 12 బ్లాకుల్లోని 1,875 గదుల మరమ్మతులకు రూ.26 కోట్లు కేటాయించాం. మరికొన్నింటిని పూర్తిగా తొలగించి తిరిగి నిర్మించాల్సి ఉంది. మొత్తం 424 బ్లాకుల్లోని గదులను ఆధునికీకరిస్తాం.

● తిరుమలలో లైసెన్సు లేకుండా ఉన్న దుకాణాలు, తట్టలను తొలగించేలా రెవెన్యూ, విజిలెన్స్ విభాగాలతో టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తాం.

● టీటీడీ కళాశాల్లో 25 ఏళ్లుగా పనిచేస్తున్న 151 మంది కాంట్రాక్ట్ లెక్చరర్ల సమస్య పరిష్కారం కోసం కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

● తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ అభివృద్ధి పనులకు రూ. కోటి మంజూరు చేయాలని ఆమోదం తెలిపాం.

● జాతీయ బ్యాంకుల్లో టీటీడీ డిపాజిట్లపై మరోసారి బోర్డులో చర్చించాం. అధిక వడ్డీలు వచ్చేలా గుర్తింపు కలిగిన బ్యాంకుల్లోనే డిపాజిట్లు పెట్టే అంశంపై పరిశీలిస్తున్నాం.

● తిరుమలలో స్థలాక్రమణలకు పాల్పడుతున్న మఠాలకు ఇప్పటికే నోటీసులు జారీ చేశాం. త్వరలో మరోసారి చర్చించి నిర్ణయం తీసుకుంటాం.

● టీటీడీ ఉద్యోగులకు నేమ్ బ్యాడ్జీ అంశంపై పరిశీలించాలని అధికారులను బోర్డు కోరింది.

● కాశి మఠానికి నిత్యహారతులకు అనుమతివ్వాలని తీర్మానించాం.





ఫిబ్రవరి 2న పట్టుబడిన గ్రావెల్ నిల్వల వద్ద వీఆర్వో శ్రీదేవి (ఫైల్ ఫొటో).. అదే ప్రదేశంలో కనిపించని గ్రావెల్

పట్టుబడిన గ్రావెల్ ఎక్కడ?

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అధికారులు 50 రోజుల కిందట పట్టుకున్న గ్రావెల్.. నాలుగు రోజుల క్రితం మాయమైపోయింది. అక్రమార్కులు తీసుకెళ్లిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. దీని వెనుక కొందరు అధికారుల అండ ఉందన్న ఆరోపణలున్నాయి. ఫిబ్రవరి 2న సూళ్లూరుపేట మండలం మన్నారుపోలూరులోని జగనన్న ఇళ్ల కాలనీలోని ప్లాట్ల నుంచి గ్రావెల్‌ను అక్రమంగా తరలించి.. పెట్రోల్ బంక్ సమీపాన నిల్వ చేసి.. టిప్పర్ల ద్వారా వెంచర్లకు తరలిస్తున్నారు. గ్రామస్తుల ఫిర్యాదుతో గ్రావెల్ నిల్వలతో పాటు టిప్పర్‌నూ అధికారులు సీజ్‌చేశారు. పోలీసులకూ రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేశారు. దాదాపు 30 టిప్పర్లకుపైగా గ్రావెల్ నిల్వలను సీజ్‌చేశారు. కానీ.. నాలుగు రోజుల కిందట ఆ గ్రావెల్‌ను అక్రమార్కులు రాత్రివేళ ఎక్స్‌కవేటర్ల సాయంతో టిప్పర్లకు లోడ్‌చేసి తీసుకెళ్లారు. గ్రావెల్ నిల్వల మాయం వెనుక కొందరి అధికారుల సహకారం ఉన్నట్లు ఆరోపణలున్నాయి. దీనిపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపించాలని స్థానికులు డిమాండు చేస్తున్నారు.

స్మార్ట్ సిటీ.. పల్లె పండుగ పెండింగ్ బిల్లులు విడుదల చేయండి

బాలాజీ రిజర్వాయర్‌కు నిధులివ్వండి ● ప్రభుత్వానికి కలెక్టర్ వినతి

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సంబంధించిన పలు పెండింగ్ సమస్యలను కలెక్టర్ వెంకటేశ్వర్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. మంగళ, బుధవారాల్లో కలెక్టర్ల సమావేశాలు జరగనున్న నేపథ్యంలో ఆయన సోమవారం మధ్యాహ్నమే అమరావతి చేరుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో పాటు పలు శాఖల ముఖ్య కార్యదర్శులను కలిశారు. 'తిరుపతి స్మార్ట్‌సిటీ ప్రాజెక్టు కింద పూర్తయిన 12 పనులకు సంబంధించి రూ.60 కోట్ల బిల్లులు పెండింగులో ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న మరో 14 పనులకు రూ.వంద కోట్ల వరకూ బిల్లులు చెల్లించాలి. అలాగే, పల్లెపండుగ కింద జిల్లాలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రైన్లు, గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించి రూ.100 కోట్ల వరకూ బిల్లులు పెండింగులో ఉన్నాయి. ఉపాధి హామీ పథకం కింద ఆ నిధులను మంజూరు చేయాలి. తిరుపతి, తిరుమల తాగునీటి అవసరాలు తీర్చడంలో కీలకంగా మారిన బాలాజీ రిజర్వాయర్ నిర్మాణానికి త్వరితగతిన నిధులు కేటాయించాలి' అని అధికారులను కలెక్టర్ అభ్యర్థించారు. పలు పర్యాటక ప్రాజెక్టుల ప్రతిపాదనలనూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వీటితో పాటు మంగళ, బుధవారాల్లో జరగనున్న కాన్ఫరెన్సులో జిల్లాకు సంబంధించిన పలు అభివృద్ధి ప్రతిపాదనలను, అంచనాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేయనున్నారు.

ఉపాధి పనులను ఉదయాన్నే ప్రారంభించాలి

● తాగునీరు, మెడికల్‌కిట్లు అందుబాటులో ఉంచాలి

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ఉపాధి పనులను ఉదయాన్నే ప్రారంభించి 11 గంటల కల్లా ముగించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్‌గ్రీవెన్స్ హాల్‌లో అధికారులతో ఆయన మాట్లాడారు. ఉపాధి పనులు జరిగే ప్రాంతాల్లో షెడ్లు, తాగునీరు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్‌కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. ప్రజలూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. ఆస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ఐవీ ఫ్లూయిడ్స్, మందులు తగినంత స్టాక్ అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రంజాన్ వేళలు

ఇఫ్తార్: 6:27 (మంగళవారం సాయంత్రం)

సహర్: 4:54 (బుధవారం ఉదయం)

ఇద్దరు టెన్త్ విద్యార్థుల డీబార్

● ఇద్దరు ఇన్విజిలేటర్లను సస్పెండ్ చేసిన డీఈవో

తిరుపతి(విద్య), మార్చి 24(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం జరిగిన పదో తరగతి పరీక్షల్లో కేవీబీపురంలో కాపీయింగ్‌కు పాల్పడిన ఇద్దరు విద్యార్థులను డీబార్ చేసినట్లు డీఈవో కేవీఎన్ కుమార్ తెలిపారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకుగాను ఇన్విజిలేటర్లు బి. యాదగిరి, ఎస్.దివాకర్‌ను సస్పెండ్ చేశారు. కాగా, సోమవారం నాటి పరీక్షకు 26,625 మంది విద్యార్థులు హాజరయ్యారు. 518 మంది గైర్హాజరయ్యారు.



నటుడు సుమన్

కోరుకున్నదానికన్నా దేవుడు ఎక్కువే ఇచ్చాడు

● సినీనటుడు సుమన్

తిరుమల, మార్చి24(ఆంధ్రజ్యోతి): 'నేను కోరుకున్నదానికంటే దేవుడు నాకు ఎక్కువే ఇచ్చాడు' అని సినీనటుడు సుమన్ అన్నారు. ఎలాంటి సినిమా బ్యాగ్రౌండ్ లేని తాను తన తల్లిదండ్రులు చేసిన పుణ్యఫలంగా మంచి స్థాయికి ఎదిగానన్నారు. తన జీవితంలో ఏది జరిగినా, తాను ఏం చేసినా అది స్వామి లీలేనన్నారు. శ్రీవేంకటేశ్వరస్వామిగా, శ్రీరాముడిగా, సత్యనారాయణస్వామిగా దేవుడి పాత్రల్లో నటించడం గొప్పవరమన్నారు. స్వామి ఆశీస్సులతో అనేక సినిమాల్లో తాను బిజీగా గడుపుతున్నానని చెప్పారు. తొలిసారిగా తుళు భాషలో నటిస్తున్నాని సుమన్ తెలిపారు. అలాగే కాంత, సత్యంగారి అబ్బాయి, ధర్మస్థల నియోజకవర్గం అనే మూడు సినిమాల్లో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నాని, ప్రస్తుతం 'కాంత' చిత్ర షూటింగ్ గుజరాత్‌లో జరుగుతోందన్నారు.

తిరుమలేశుని సేవలో శిరూర్ మఠాధిపతి



తిరుమల, మార్చి24 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని శిరూర్ మఠాధిపతి వేదవర్ధనతీర్థ సోమవారం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఉదయం నైవేద్య విరామ సమయంలో ఆలయం వద్దకు చేరుకున్న ఆయనకు ఆలయ అర్చక బృందం, పేష్కార్ రామకృష్ణ ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. ఆలయంలోకి వెళ్లిన స్వామి ధ్వజస్తంభానికి మొక్కుకుని తర్వాత గర్భాలయంలోని మూలమూర్తిని దర్శించుకున్నారు.

సర్వదర్శనానికి 15 గంటలు



తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 15 గంటల సమయం పడుతోంది. సోమవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణతేజ సర్కిల్ వరకు వ్యాపించింది. ఇక, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచిఉన్నారు.

శనివారం హుండీ ఆదాయం: రూ.3.94 కోట్లు

ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 84,198

తలనీలాలు సమర్పించినవారు: 25,665



ముత్యాలమ్మ అమ్మవారి దేవస్థానం

నేటి నుంచి ముత్యాలమ్మ జాతర

● తూర్పుకనుపూరులో మొదలైన సందడి





బంగారుచీర అలంకరణలో అమ్మవారు (ఫైల్ ఫొటో) - పోలేరమ్మ (ఫైల్ ఫొటో)

చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): చిల్లకూరు మండలం తూర్పుకనుపూరులో ముత్యాలమ్మ జాతర మంగళవారం నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ఏర్పాట్లు పూర్తయ్యాయి. మంగళవారం రాత్రి గంగమిట్ట మీద ఘటం నిలిపి కుమ్మరి తయారు చేసిన పోలేరమ్మ విగ్రహాన్ని రజకులు తీసుకొచ్చి తాటాకు గుడిసెలో తాత్కాలికంగా ప్రతిష్ఠంచడంతో జాతర మొదలవుతుంది. జాతరలో ముత్యాలమ్మతో పాటు పోలేరమ్మకూ భక్తులు మొక్కులు తీర్చుకోవడం ఆనవాయితీ. జాతరలో పాల్గొనేందుకు వివిధ ప్రాంతాలలో స్థిర పడిన వారు గ్రామాలకు చేరుకోవడం.. బంధుమిత్రుల రాకతో సందడి నెలకొంది. కాగా, మంగళవారం రాత్రి పోలేరమ్మ నిలుపు, 26న యార గురునాథస్వామి, అంకమ్మ దేవతల గ్రామోత్సవం, గొల్లల వేడుకలు, 27న పగలు గురునాథస్వామి గ్రామోత్సవం, రాత్రి అమ్మణ్ణి ఉయ్యాల సేవ, 28న శుక్రవారం ఉదయం పోలేరమ్మను సాగనంపే ఉత్సవం, వేలం పాటలతో జాతర ముగుస్తుంది. ఈ జాతర కోసం పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీఎస్పీ గీతాకుమారి తెలిపారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా భద్రతా ఏర్పాట్లు చేసినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. జాతర ఏర్పాట్లను సబ్‌కలెక్టర్ రాఘువేంద్రమీనా పర్యవేక్షిస్తున్నారు.

భక్తులకు తగిన ఏర్పాట్లు

తూర్పు కనుపూరు జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, తమినాడు నుంచీ వేలాదిగా భక్తులు వస్తారు. వీరందరికీ తాగునీరు, వైద్యశిబిరాలు, తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగితే అదనపు జనరేటర్లు ఏర్పాటు చేస్తున్నారు.

ఆలయానికి ఇలా చేరుకోవాలి..

గూడూరుకు 30 కిలోమీటర్ల దూరంలో తూర్పుకనుపూరు ఉంది. గూడూరు, నెల్లూరు, వరగలి క్రాస్‌రోడ్డు, చింతవరం, కోట, నాయుడుపేట ప్రాంతాల్లో అందుబాటులో ప్రత్యేక బస్సుల ద్వారా చేరుకోవచ్చు.



అర్జీదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్వర్

సత్యవేడులో మట్టి మాఫియాను అరికట్టండి

'సత్యవేడులో గ్రావెల్, మట్టి మాఫియా చెలరేగిపోతోంది. మట్టి లారీల వల్ల అనేక రోడ్డు ప్రమాదాలు జరిగాయి' అంటూ బీజేపీ నేతలు వెంకటేశ్వర్లు, మోహన్‌బాబు, శ్రీకాంత్, ప్రభు, శ్రీరాజ్ అధికారులకు వినతిపత్రం అందజేశారు. మట్టిని అక్రమంగా తమిళనాడుకు తరలించి రూ.కోట్లు గడిస్తున్నారన్నారు. పోలీసులు, అధికారులు పట్టించుకోవడం లేదని అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

శెట్టిపల్లె భూసమస్యకు చొరవ చూపండి

శెట్టిపల్లె భూసమస్య పరిష్కారానికి చొరవ చూపి, తక్షణం జీవో విడుదల చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు డీఆర్వో నరసింహులును కోరారు. టీడీపీ అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా పరిష్కారం చూపకపోవడం బాధాకరమన్నారు. అధికారులు పట్టించుకోకపోతే ఆందోళనకు దిగుతామన్నారు.

ముప్పావు శాతం భూసమస్యలపైనే

కలెక్టరేట్‌లో పీజీఆర్ఎస్‌కు 304 వినతులు ● గంట ముందే ప్రారంభం

తిరుపతి(కలెక్టరేట్), మార్చి 24(ఆంధ్రజ్యోతి): తిరుపతి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 304 అర్జీలు అందగా, అందులో 201 భూసమస్యలపైనే ఉన్నాయి. రెవెన్యూ సదస్సులు, పీజీఆర్ఎస్‌లోను పదేపదే భూసమస్యలపై అర్జీలు వస్తున్నా పరిష్కారం పట్ల రెవెన్యూ యంత్రాంగం నిర్లక్ష్యంగా ఉండటంతోనే వీటి సంఖ్య పెరుగుతోంది. ఇక, వేసవిని దృష్టిలో ఉంచుకుని ఉదయం 9గంటలకే పీజీఆర్ఎస్ ప్రారంభమైంది. ప్రజల నుంచి కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ శుభం బన్సల్, డీఆర్వో నరసింహులు, పలువురు డిప్యూటీ కలెక్టర్లు అర్జీలు స్వీకరించారు. ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అర్జీ తీసుకోనని చెప్పారు



'మీతో మాట్లాడను. మీ అర్జీ తీసుకోను. వెళ్లిపోండి' అని జేసీ శుభం బన్సల్ తమను అనడం బాధించిందని నాయుడుపేటకు చెందిన తీగల రాజేశ్వరి, భాస్కర్ దంపతులు మీడియాతో అన్నారు. పుదూరు గ్రామంలో 1.80ఎకరాలు సాగరమాల రోడ్డుకు భూసేకరణకు అడగ్గా.. తగిన పరిహారం ఇవ్వాలని లేదా అంతే భూమిని ఎక్కడైనా ఇవ్వాలని అటు ఆర్డీవో, ఇటు తహసీల్దారును కోరామన్నారు. వారి నుంచి నిర్లక్ష్యంగా సమాధానం రావడంతో కోర్టును ఆశ్రయించామని చెప్పారు. ఇదే విషయంపై పీజీఆర్ఎస్‌లో జేసీకి అర్జీ ఇవ్వగా.. ఇలా మాట్లాడం బాధకలిగించిదన్నారు. అంతకు ముందు అధికారులతో వీరికి వాగ్వాదం చోటు చేసుకుంది.

రోడ్డున పడ్డాం.. ఆదుకోండి



డీఆర్వో ఎదుట కన్నీరుమున్నీరు అవుతున్న రేణుక

తిరుపతి ఎస్‌బీఐ కాలనీకి చెందిన రేణుక తన ఇద్దరు పిల్లలతో పాటు తల్లితో అద్దె ఇంట్లో ఉంటున్నారు. రెండు నెలల క్రితం ఆమె భర్త మోహన్‌రెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో కుటుంబ పోషణ భారంగా మారింది. ఇద్దరు బిడ్డలు, వృద్ధురాలైన తల్లిని తీసుకుని కలెక్టరేట్‌లో అధికారులను కలిశారామె. 'అద్దె ఇంటి వారు ఖాళీ చేయాలంటున్నారు. నా ఆరోగ్యం సరిగా లేదు. భర్త మరణించడంతో రోడ్డున పడ్డాం. వితంతు పింఛనుతో పాటు నా బిడ్డల చదువుకు ఆసరా కల్పించండి' అంటూ ఆమె అధికారులను ప్రాధేయపడ్డారు. డీఆర్వో నరసింహులు, డీఆర్‌డీఏ పీడీ శోభన్‌బాబు ఆమెను ఓదార్చి మే నెల నుంచి వితంతు పింఛను ఇచ్చేలా, పిల్లలకు బీసీ హాస్టల్‌లో చదువుకోవడానికి వెంటనే అవకాశం కల్పించాలని, ఆర్థికంగా ఎదగడానికి భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు.



'సాగరమాల' రోడ్డు పనుల అడ్డగింత

● సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేయాలంటూ రైతుల ఆందోళన

నాయుడుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేట మండలం చిలమత్తూరు వద్ద సోమవారం సాగరమాల రోడ్డు పనులను రైతులు అడ్డుకొన్నారు. గతంలో నరసారెడ్డికండ్రిగ వద్ద పనులను అడ్డుకొన్న విషయం తెలిసిందే. 'సాగరమాల రోడ్డు 13 అడుగుల ఎత్తులో నిర్మిస్తున్నారు. దీనికి రెండువైపులా మాకు పొలాలు ఉన్నాయి. అండర్ బ్రిడ్జిలు ఏర్పాటు చేసిన చోట్ల నుంచి సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేస్తే పొలాలకు వెళ్లే వీలుంటుంది. ఆయా గ్రామాల ప్రజలకూ అనువుగా ఉంటుంది. లేకుంటే పొలాలకు వెళ్లే దారిలేకుండా పోతోంది. సర్వీస్ రోడ్డు ఏర్పాటు చేసే వరకు ఆందోళనలు ఉధృతం చేస్తాం' అని రైతులు చెప్పారు. ఈ ఆందోళనలో జలదంకి వెంకటకృష్ణారెడ్డి, సన్నారెడ్డి హరనాథ్‌రెడ్డి, వాకాటి సుధాకర్‌రెడ్డి, రత్నయ్య, బాలాజీ, రమణయ్య, శ్యామ్‌కుమార్‌రెడ్డి, కామిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, చంద్రమోహన్, మధుసూదన్‌రెడ్డి, రాజశేఖర్ తదితరులున్నారు.



ర్యాలీ బృందంతో షార్ డైరెక్టర్ రాజరాజన్, ఇతర అధికార బృందం

తీర ప్రాంత భద్రతకు సీఐఎస్ఎఫ్ సైక్లోథాన్ ర్యాలీ

తడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): దేశంలో తీర ప్రాంతాల భద్రత కోసం సీఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన సైక్లోథాన్ ర్యాలీ సోమవారం సూళ్లూరుపేటకు చేరింది. హోలిక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై షార్, రెవెన్యూ అధికారులు, పోలీసులు వీరికి స్వాగతం పలికారు. అనంతరం జాతీయ రహదారి మీదుగా తడ మండలం అక్కంపేట వద్దనున్న జైన్ టెంపుల్‌కు చేరుకొన్నారు అక్కడ ఇస్రో అధికారులు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ర్యాలీ సిబ్బందికి షార్ డైరెక్టర్ రాజరాజన్, నాయుడుపేట డీఎస్పీ స్వాగతం పలికి అభినందించారు. మార్చి 7న కోల్‌కత్తా నుంచి ప్రారంభమైన సైక్లోథాన్ ర్యాలీ.. మార్చి 31న కన్నియాకుమారికి చేరడంతో ముగుస్తుందని శ్రీహరికోట సీఐఎస్ఎఫ్ కమాండెంట్ సంజిత్ కుమార్ తెలిపారు. సముద్ర మార్గాల్లో ఉగ్రవాదుల చొరబాటు, మాదకద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. అనంతరం ర్యాలీ తమిళనాడులోకి ప్రవేశించింది. ఈ కార్యక్రమంలో షార్ కంట్రోలర్ ఎం.శ్రీనివాసుల రెడ్డి, సూళ్లూరుపేట సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ కొండపనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నాయుడుపేటలో వైసీపీకి భారీ షాక్

● పార్టీ వీడిన ముగ్గురు కౌన్సిలర్లు, మరికొందరు నేతలు



ఎమ్మెల్యే విజయశ్రీ, నరసింహయాదవ్, నెలవల సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

నాయుడుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేటలో వైసీపీకి షాక్ తగిలింది. ముగ్గురు కౌన్సిలర్లు, నాయకులు ఆ పార్టీని వీడి.. సోమవారం రాత్రి టీడీపీ జిల్లా అధ్యక్షుడు నరసింహయాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ, నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం సమక్షంలో ఆ పార్టీలో చేరారు. 2021 ఎన్నికల్లో 25కు 23 మంది కౌన్సిలర్లు వైసీపీ నుంచి గెలిచారు. ఎన్నికల సమయంలో వైస్ చైర్మన్ రఫీ టీడీపీలో చేరారు. వైసీపీలో గ్రూపు రాజకీయాలతో కొందరు నాయకులు, కౌన్సిలర్లు సతమతమవుతూ వచ్చారు. ఈ క్రమంలో సోమవారం కౌన్సిలర్లు మల్లు నీరజ, ఆబోతుల మస్తానమ్మ, కరీంబాయి విజయలక్ష్మితో పాటు మొదలియార్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కరీంబాయి చెంచయ్య, జువ్వలపాళెం సర్పంచ్ రమణయ్య, మాజీ కౌన్సిలర్ ఆబోతుల బాబు, వైసీపీ నాయకులు నాగిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, తెమ్మాని హరిరెడ్డి, సీహెచ్ రాజేష్ తదితరులు టీడీపీలో చేరారు.

హరియాణా మద్యం కేసులో కారు డ్రైవర్ ఎక్కడ?

● ప్రధాన పాత్రధారిని పట్టుకోవడంలో మీనమేషాలు

● ఎక్సైజ్ అధికారుల దర్యాప్తుపై విమర్శలు ● ఇప్పటికీ సాగుతున్న మద్యం దందా

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హరియాణా మద్యం కేసులో ప్రధాన పాత్రధారి, కారు డ్రైవరు చల్లా శ్రీనివాసులురెడ్డి ఎక్కడ? 11 రోజులుగా ఇతడు దొరకలేదా? అతడిని పట్టుకునే దిశగా గట్టి ప్రయత్నాలు జరగలేదా? ఇదీ ఈ కేసుకు సంబంధించి ఎదురవుతున్న ప్రశ్నలు. హరియాణాలో అతి తక్కువకు మద్యం దొరకడం.. ఇక్కడితో పోలిస్తే దాదాపు రూ.700 వ్యత్యాసం ఉండటంతో దీనిని అక్రమ సంపాదనగా మార్చుకున్నాడు ఆ రాష్ట్రానికి చెందిన గజేంద్ర శర్మ. తిరుపతిలో ఉంటున్న కూల్‌డ్రింక్ షాపు యజమాని బాబునూ భాగస్వామిగా చేసుకున్నాడు. గజేంద్రశర్మకు అన్ని విధాలుగా రూట్ అధికారిగా ఉంటూ, అన్నీ తానై ముందుండి నడిపించాడు కారు డ్రైవర్ చల్లా శ్రీనివాసులురెడ్డి. ఢిల్లీ మీదుగా మద్యాన్ని తీసుకొచ్చి గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, తిరుపతిలలో విక్రయించేవారు. ఈ క్రమంలో ఈనెల 13వ తేదీన ఎక్సైజ్ అధికారులు ముందస్తు ప్లాన్‌తో భారీ ఎత్తున హరియాణా మద్యం స్వాధీనం చేసుకున్నారు. ప్రధాన సూత్రధారి, హరియాణాకు చెందిన గజేంద్ర శర్మ, కూల్‌డ్రింక్ షాపు దుకాణదారు బాబును అరెస్టు చేశారు. అప్పట్నుంచి కారు డ్రైవరు శ్రీనివాసులురెడ్డిని పట్టుకోలేకున్నారు. సమగ్ర విచారణతో ఇతడిని పట్టుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు.. ఆ దిశగా చర్యలు లేవన్న విమర్శలు వినవస్తున్నాయి. మరోవైపు ఇద్దరు అరెస్టయినా, హరియాణా మద్యం విక్రయాలు మాత్రం ఆగలేదు. తిరుపతిలోని గజేంద్రశర్మ అనుచరులు ఇద్దరు ఆదివారం సత్యనారాయణపురంలోని ఇద్దరికి హరియాణా మద్యం విక్రయించినట్లు విశ్వసనీయ సమాచారం. ఇలా అక్రమంగా నాన్ డ్యూటీ పెయిడ్ మద్యం అక్రమాలు సాగడం వెనుక కొంతమంది పోలీసు, ఎక్సైజ్ సిబ్బంది హస్తం ఉందన్న ప్రచారమూ జరుగుతోంది. ఇప్పటికైనా అధికారులు దర్యాప్తులో వేగం పెంచి కారు డ్రైవరును అదుపులోకి తీసుకుని.. హరియాణా మద్యం వ్యాపారాన్ని అరికట్టాల్సి ఉంది.

ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ కానిస్టేబుళ్ల సంఘం అధ్యక్షుడిగా రామచంద్రయ్య

● ఉపాధ్యక్షుడిగా జయశంకర్



డీసీ విజయశేఖర్‌ను కలిసిన నూతన కార్యవర్గం

తిరుపతి(నేరవిభాగం), మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుళ్ళ, కానిస్టేబుళ్ల సంఘం నూతన అధ్యక్షుడిగా తిరుపతి ఎక్సైజ్ ఎన్‌ఫోర్సుమెంటులో హెడ్ కానిస్టేబుల్ ఎస్.రామచంద్రయ్య ఎన్నికయ్యారు. సోమవారం తిరుపతిలో సమావేశమై కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా కానిస్టేబుల్ జయశంకర్, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా ఎస్.ప్రతాప్, ప్రధాన కార్యదర్శిగా కె.వేణుగోపాల్, కోశాధికారిగా పి. అయ్యప్ప రెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భారతి రాజా, సంయుక్త కార్యదర్శులుగా ఎ.సురేంద్రబాబు, ఎస్.శ్రావణి, ప్రెస్ కార్యదర్శులుగా ఎస్. రమేష్, ఆర్. నాగరాజు, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా శాలక్ష్మి, గాయత్రి, బోసుకుమార్, విజయ్ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా చిత్తూరు ఏఈఎస్ కృష్ణకిషోర్‌రెడ్డి, ఎన్‌ఫోర్సుమెంటు ఏఈఎస్ సుబ్రహ్మణ్యం వ్యవహరించారు. ఎక్సైజ్ డీసీ విజయశేఖర్, ఏసీ శ్రీనివాసులును నూతన కార్యవర్గం మర్యాదపూర్వకంగా కలిసింది.

తాత్కాలిక మెడికల్ కౌన్సిల్‌లో తిరుపతి వైద్యుడికి చోటు

తిరుపతి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ తాత్కాలిక మెడికల్ కౌన్సిల్ సభ్యుడిగా తిరుపతి వైద్యుడు డాక్టర్ దగ్గుమాటి శ్రీహరిరావు నియమితులయ్యారు. ప్రముఖ రేడియాలజిస్టు అయిన ఈయన గతంలో ఏపీ మెడికల్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడిగా పనిచేశారు. కొంతకాలంగా రాష్ట్ర మెడికల్ కౌన్సిల్ నియామకం జరగలేదు. రోజువారీ కార్యలాపాల నిర్వహణ కష్టంగా మారడంతో ప్రభుత్వం సోమవారం తాత్కాలిక ప్రాతిపదికన కౌన్సిల్‌ను ఏర్పాటు చేసింది. అందులో వైద్య కళాశాలల నుంచీ బోధనా సిబ్బంది కోటాలో ఇద్దరిని.. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోటాలో నలుగురిని నియమించింది. రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్స్ కోటా నుంచీ శ్రీహరిరావు ఎంపికయ్యారు.

ఎర్రచందనం స్మగ్లర్‌పై పీడీ యాక్ట్



శివమణి గోవింద

మంగళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో తమిళనాడు తిరువణ్ణామలై జిల్లా జమునమిత్తూరు మండలం నల్లపట్టు గ్రామానికి చెందిన శివమణి గోవిందం(35) అలియాస్ శివమణిపై పీడీయాక్ట్ అమలుకు ఆదేశాలు జారీ అయ్యాయని టాస్క్‌ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు తెలిపారు. శివమణిపై పీడీయాక్టు అమలుకు సిఫార్సు చేయగా కలెక్టర్, జిల్లా మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్ అనుకూలంగా స్పందిస్తూ ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ క్రమంలో శివమణిని కడప సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలి

మంగళం, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శేషాచల కొండల్లో ఎర్రచందనం అక్రమ రవాణా అరికట్టేందుకు వ్యూహాత్మకంగా వ్యవహరించాలని సీసీఎఫ్ సెల్వం సూచించారు. తిరుపతి బయోట్రీమ్‌లో సోమవారం జరిగిన అటవీ శాఖ, టాస్క్‌ఫోర్సు అధికారుల సమన్వయ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇతర రాష్ట్రాల నుంచి శేషాచల అడవులల్లకి వస్తున్న స్మగ్లర్లను ముందుగానే పసిగట్టి కట్టడి చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ వారిపై పీడీయాక్టు ప్రయోగించాలన్నారు. ఇపుడు స్మగ్లింగ్ చేస్తూ పట్టుబడ్డ వారికి కఠిన శిక్షలు పడుతున్నాయన్నారు. తిరుపతిజిల్లా అటవీశాఖ అధికారి వివేక్, టాస్క్‌ఫోర్సు ఎస్పీ శ్రీనివాస్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, మూడు సర్కిళ్లలోని అధికారులు పాల్గొన్నారు.

2030 నాటికి క్షయను పూర్తిగా నిర్మూలిస్తాం



జాతీయ క్షయ నిర్మూలన పై ర్యాలీ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

నాయుడుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచ ఆరోగ్యసంస్థ ప్రకారం 2030 సంవత్సరం నాటికి భారత్‌ను క్షయవ్యాధిలేని దేశంగా మారుస్తామని డాక్టర్ సుబ్బారావు అన్నారు. నాయుడుపేటలో సోమవారం జాతీయ క్షయ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా పట్టణ పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్షయ బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మందులతోపాటు నెలకు రూ.1000లు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రకళ, డాక్టర్ వికాష్, టీబీ సూపర్ వైజర్ బొమ్మన రమణయ్య, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన ఉండాలి

డక్కిలి, మార్చి 24 : (ఆంధ్రజ్యోతి) : పోక్సో చట్టంపై ప్రజలకు అవగాహన ఉండాలని ఎస్ఐ శివశంకర్ తెలియజేశారు. సోమవారం రాత్రి పల్లెనిద్ర కార్యక్రమంలో భాగంగా కమ్మపల్లి గిరిజన కాలనీలో పోలీసులు సమావేశం నిర్వహించారు. పోక్సో చట్టం, బాల్య వివాహల నియత్రణపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూరాత్రిపూట ఇంటిలో పల నిద్రించాలని సూచిం చారు. కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానాస్పదంగా ఉన్నా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

అనుమానాస్పద స్థితిలో సెక్యూరిటీ గార్డు మృతి

నాయుడుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట -మేనకూరు పారిశ్రామిక వాడలోని ఓ పరిశ్రమలో సెక్యూరిటీ గార్డు అనుమానాస్పది స్థితిలో మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. ఒడిశా రాష్ట్రానికి చెందిన మనోజ్‌కుమార్ (22) కొంతకాలంగా మేనకూరులోని ఓ కర్మాగారంలో సెక్యూరిటీ గా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం అస్వస్థతకు గురికావడంతో వెంటనే సహచరులు నాయుడుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తీసుకెళ్లారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు.

భార్యపై దాడి కేసులో భర్త అరెస్టు

నాయుడుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : భార్యపై దాడిచేసిన కేసులో భర్తను పోలీసులు అరెస్టు చేశారు. అర్బన్ సీఐ బాబి కథనం మేరకు.. పట్టణంలోని కుమ్మరివీధికి చెందిన సురేష్, పూజలత దంపతులు. వీరి మధ్య గత ఫిబ్రవరి ఒకటో తేదీన ఘర్షణ జరిగింది. ఆ సమయంలో భర్త సురేష్ భార్యపై కత్తితో దాడిచేసి గాయపరిచాడు. ఈ క్రమంలో కేసు నమోదు చేసి అతడిని అరెస్టు చేసి కోర్టుకు తరలించారు.

ఆటో నుంచి జారిపడి రైతు మృతి


మృతిచెందిన వెంకటయ్య

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో గల ఎన్ఐటీ కార్యాలయం వద్ద సోమవారం ఆటోలో నుంచి జారిపడి వెంకటయ్య (60) అనే రైతు అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికుల కథనం మేరకు.. వాకాడు మండలం దుగరాజపట్నం గ్రామానికి చెందిన వెంకటయ్య పురుగుల మందు తీసుకునేందుకు కోట నుంచి ఆటోలో గూడూరుకు బయలుదేరాడు. చిట్టేడు ఎన్ఐటీ కార్యాలయం వద్ద ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి సమాచారం లేదు.

క్షయవ్యాధిపై అవగాహన ర్యాలీ


ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా సోమవారం పేర్నాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సిబ్బంది ఆధ్వర్యంలో సూళ్లూరుపేటలో క్షయవ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సంద ర్భంగా స్థానిక ప్రభుత్వ వైద్యశాలలో జరిగిన సమావేశంలో డాక్టర్ రమణయ్య మాట్లా డుతూ క్షయవ్యాధి వ్యాపించిన సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చర్యలను వివరిం చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది బాల, ఆనంద్ పాల్గొన్నారు.

సామాజిక తనిఖీలకు సహకరించాలి


మాట్లాడుతున్న సీఆర్‌పీలు, ఏపీవో

కోట, మార్చి 24 (ఆంధ్ర జ్యోతి): మండల పరిధిలోని 21 పంచాయతీలలో 2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీలో జరిగిన పనులపై సామాజిక తనిఖీలు జరుగుతాయని జిల్లా రిసోర్స్ పర్సన్‌లు శంకర్, రవి, ఏపీవో పూర్ణిమ కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సామాజిక తనిఖీలపై క్షేత్ర సహాయకులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మొదటి రోజు చిట్టేడు, జరుగుమల్లి, పుచ్చలపల్లి గ్రామాల్లో సామాజిక తనిఖీలు ప్రారంభమయ్యాయని వివరించారు. కూలీలతోపాటు క్షేత్ర సహాయకులు సహకరించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యుడికి సన్మానం

గూడూరు అర్బన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : గూడూరు డివిజన్ ఎస్సీ ఎస్టీ, విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యుడుగా దాసరి సురేష్ చైతన్య ఎంపికయ్యారు. ఈ క్రమంలో సోమవారం యువజన నాయకుడు షోడవరం చైతన్యకుమార్, గూడూరు కృష్ణ ఆయన్ను అభినందించారు. శాలువా కప్పి సన్మానించారు.

రైతు సేవా కేంద్రాల్లో రైతుల అవస్థలు

- భూముల వివరాల నమోదుకు తిప్పలు
- కంప్యూటర్‌లో కనిపించని అసైన్డ్ భూముల వివరాలు

ఓజిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఏ పథకం కింద లబ్ధి చేకూరాలన్నా వారి భూముల వివరాలు తప్పనిసరిగా రైతు సేవా కేంద్రాల్లో నమోదు చేసుకుని ఉండాలని వ్యవసాయ శాఖ అధికారులు అంటున్నారు. దీంతో రైతులు రైతు సేవా కేంద్రాలకు పరుగులు తీస్తున్నారు. అయితే అక్కడ వారి భూముల వివరాలు నమోదు చేస్తుంటే సెటిల్మెంట్ (సొంత)కు సంబంధించి సర్వర్ మొరాయిస్తోంది. ఇక అసైన్మెంట్ భూములకు సంబంధించి అయితే కంప్యూటర్‌లో సంబంధిత వెబ్‌సైట్ పనిచేయడంలేదు. చాలారోజులుగా ఇదే పరిస్థితి. రైతులు రావడం నమోదు కాకపోవడం మామూలైపోయింది. అన్ని రైతు సేవా కేంద్రాలలో పరిధిలో ఇదే పరిస్థితి ఉంది. మండలంలోని ఓజిలి సచివాలయం పరిధిలోని ఓజిలి, రాచపాళెం గ్రామాలకు చెందిన 445 మంది రైతుల భూముల వివరాలు మాత్రమే నమోదు అయ్యాయని తెలిసింది.

ఈ నెల 27, 29 తేదీల్లో పలు రైళ్ల రద్దు

తడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 27, 29 అంటే వచ్చే గురువారం, శనివారం రెండు రోజులపాటు పలు రైళ్ల రద్దుకానున్నట్లు చెన్నై సదరన్ రైల్వే అధికారులు ఓ ప్రకటన విడుదల చేశారు. తమిళనాడు పొన్నేరి, కవరేపేట రైల్వే స్టేషన్‌ల మధ్య కొంత కాలంగా పట్టాల మార్పిడి, సిగ్నలింగ్ వ్యవస్థ బలోపేతం వంటి ఇంజనీరింగ్ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా వచ్చే గురు, శనివారాలలో రెండు రోజులపాటు మధ్యాహ్నం 1.20 నిమిషాల నుంచి సాయంత్రం 5.40 నిమిషాల వరకు ఆ పనులను కొనసాగించేందుకు అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో సూళ్లూరుపేట నుంచి ఉదయం 8.10 నిమిషాలకు నెల్లూరుకు బయలుదేరి వెళ్లే మెమో రైలు, 10.30 గంటలకు నెల్లూరు నుంచి చెన్నైకు బయలుదేరి వెళ్లే మెమో రైలుతోపాటు చెన్నై, సూళ్లూరుపేట, చెన్నైల మధ్య నడిచే పలు సబర్బన్ రైళ్లను పూర్తిగా రద్దుచేశారు. రద్దు అయిన రైళ్లలో సూళ్లూరుపేట నుంచి చెన్నైకు మధ్యాహ్నం 12.35, 1.10 నిమిషాలు, 3.10 నిమిషాలకు బయలుదేరి వెళ్లే సబర్బన్ రైళ్లు ఉన్నాయని సదరన్ రైల్వే అధికారులు ప్రకటించారు.

ద్విచక్ర వాహనం సీజ్

వెంకటగిరిటౌన్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): స్థానిక రాజా వీధిలో ఓ బాలుడు తన బైక్‌కు సైలెన్సర్ మార్చి అధిక శబ్ధంతో నడపడంతో పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు. అలాగే ఆ వాహనాన్ని కూడా సీజ్ చేశారు. ఎస్ఐ సుబ్బారావు మాట్లాడుతూ పట్టణంలోని అధిక శబ్ధం వస్తున్న వాహనాలను సీజ్ చేస్తున్నామని తెలిపారు. అలాగే యువత క్రికెట్ బెట్టింగ్‌లకు దూరంగా ఉండాలని కోరారు.

మేత పోరంబోకు స్థలంలో రోడ్డు నిర్మాణం ఆపాలి: కాంగ్రెస్

చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బూదనం గ్రామంలో మేత పొరంబోకు స్థలంలో ఓ పరిశ్రమ అక్రమంగా చేపట్టిన రోడ్డు నిర్మాణంపై అధికారులు చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పంటా శ్రీనివాసులురెడ్డి కోరారు. ఈ విషయమై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు.

ఏపీవోగా జ్యోతి

బాలాయపల్లి, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బాలాయపల్లి ఏపీవో జ్యోతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె వడమాలపేట మండలం నుంచి ఇక్కడికి వచ్చారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న ఏపీవో ఆశారాణి పాకాలకు వెళ్లారు.

అర్జీల పరిష్కారంపై దృష్టి పెట్టండి

డక్కిలి, మార్చ 24 : (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను సత్వరం పరిష్కరించడంపై దృష్టి పెట్టాలని తహసీల్దార్ శ్రీనివాసులు అన్నారు. సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహిం చారు. ఇందులో ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజలను కార్యాలయం చుట్టూ తిప్పుకోవద్దన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ప్రసన్న రాణి, వీఆర్వోలు, పాల్గొన్నారు.

చెంగాళమ్మ హుండీ ఆదాయం రూ.23 లక్షలు



సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దైవమైన చెంగాళమ్మ ఆలయ హుండీ ఆదాయాన్ని సోమవారం దేవదాయశాఖ ఆధ్వర్యంలో లెక్కించారు. మొత్తం 47 రోజులకుగాను రూ.23,11,485 నగదు, బంగారు 95 గ్రాములు, వెండీ 50 గ్రాములు వచ్చిందని సహాయ కమిషనర్ ప్రసన్న లక్ష్మీ తెలిపారు. విదేశీ కరెన్సీ యుఎస్ఏ డాలర్స్ 20, మలేషియా రింగట్స్ 1, కెనడా డాలర్స్ 20 వచ్చాయని వివరించారు. ఈ కార్యక్రమంలో దేవదాయశాఖ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాస బాబు సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు రూ.11లక్షల ఆదాయం



చిల్లకూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసివున్న ముత్యాలమ్మ అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమాన్ని సోమవారం దేవదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 112 రోజులకు గాను భక్తులు హుండీలో వేసిన కానుకల ద్వారా రూ. 11,85,692 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈవో నవీన్‌కుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లాం దేవస్థానం ఈవో శశాంక్, సురేంద్రరెడ్డి, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీ ఎదుట మురుగునీటితో నిరసన



నాయుడుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నాయుడుపేట మున్సి పాలిటీ పరిధిలోని భూపయ్యకాలనీలో మురుగునీటి కాలువలు నిర్మించాలని కాలనీలోని గిరిజనులు కోరారు. ఈ మేరకు సోమవారం మురుగునీటితో వచ్చి మున్సిపాలిటీ ఎదుట నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి శివకవిముకుంద మాట్లాడుతూ కాలనీలో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. అనంతరం కమిషనర్ ఫజులుల్లాకు వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ


చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ నియోజకవర్గ పరిధిలోని పలువురు లబ్ధిదారులకు రూ. 26.32 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ఎవరైనా వైద్యం కోసం ఇబ్బందులు పడుతుంటే స్థానిక కార్యాలయాన్ని సంప్రదించి సీఎం సహాయనిధి ద్వారా లబ్ధిపొందవచ్చునన్నారు. అనంతరం టీడీపీ సభ్యత్వ కార్డులను అందజేశారు. శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, బిల్లు చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, మట్టం శ్రావణి, వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలయ్య, సురేంద్ర, చైతన్య పాల్గొన్నారు.

నాయుడుపేట: నాయుడుపేట టీడీపీ కార్యాలయంలో సోమవారం రాత్రి పలువురు లబ్ధిదారులకు 73.50 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే విజయశ్రీ అందజేశారు. టీడీపీ జిల్లా అధ్యక్షుడు, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, నియోజక వర్గ టీడీపీ ఇన్‌చార్జి నెలవల సుబ్రహ్మణ్యం ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, టీడీపీ నాయకులు సన్నారెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, సంచి కృష్ణయ్య, కట్టా రమణారెడ్డి, వేమసాని శ్రీనివాసులు నాయుడు, మైలారి రాజశేఖర్, గంగాప్రసాద్, జీవీఆర్ నాయుడు తదితరులు ఉన్నారు.


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నరసింహయాదవ్, నెలవల తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి

తడ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి):ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం మండల పరధిలోని అండగుండాల గ్రామంలో ఆమె టీడీపీ నాయకులతో కలసి పర్యటించారు. ప్రజల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను, రోడ్ల నిర్మాణ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గృహాలు మంజూరు చేస్తామన్నారు. అంతకు ముందు ఆమె టీడీపీ నాయకులతో కలిసి అక్కంపేట నుంచి అండగుండాల వరకు ఉన్న రోడ్డును పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కామిరెడ్డి మురళిరెడ్డి, శెల్వం, వేనాటి శ్రీకాంత్‌రెడ్డి, వేనాటి జనార్ధన్ రెడ్డి, నీలకంఠం, వేనాటి రాజారెడ్డి, కళానిధి, జీవా, విజయమ్మ, టీకే రవి, శివాజీ తదితరులు పాల్గొన్నారు.

12 మంది బడిబాట



ఓజిలి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వలస కుటుంబాలకు చెందిన 12 మంది పిల్లలను ఎంఈవో శైలజ ఆధ్వర్యంలో బడిలో చేరారు. మండలంలో సోమవారం ఎన్రోల్మెంట్ డ్రైవ్ చేపట్టారు. ఈ క్రమంలో రాజుపాళెంలో మైసూరు నుంచి వచ్చిన వలస కుటుం బాలలో 12 మంది పిల్లలు బడికి వెళ్లకుండా ఉండడాన్ని స్థానిక హెచ్ఎం ఆది నారాయణ, ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు గుర్తించారు. ఎంఈవో శైలజ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆమె వారి తల్లిదండ్రులతో మాట్లాడి పిల్లలం దరినీ పాఠశాలలో చేర్పించారు. పిల్లలకు పలకలు అందించారు. కాగా ఈ పిల్లలకు ఆధార్ కార్డులు లేవని వాటిని ఇప్పించేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో కోరారు.

వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్తు


రైతుల సమస్యలు తెలుసుకొంటున్న ఏఈ మోహిని పక్కనే సిబ్బంది

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ శాఖ ఏఈలు పూర్ణిమ, మోహిని దేవి తెలిపారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని మన్నారుపోలూరు, మండల పరిధిలోని మన్నెముత్తేరి సబ్‌స్టేషన్లలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయాలు ఏర్పడుతున్నాయని అధికారుల దృష్టికి తెచ్చారు. ఏఈలు స్పందిస్తూ వ్యవసాయానికి 9 గంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లైన్ ఇన్‌స్పెక్టర్ సురేంద్ర తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

మన్నెముత్తేరి సబ్ స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని సూళ్లూరుపేట రూరల్ ఏఈ మోహిని ఒక ప్రకటనలో తెలిపారు. మరమ్మతుల కారణంగా ఈ సబ్‌స్టేషన్‌లో పరిధి లోని పిండిపాళెం, ఆబాక, మన్నెముత్తేరి, సర్వారెడ్డికండ్రిగ, సామంతమల్లాం తదితర గ్రామాల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు, రైతులు సహకరించాలని కోరారు.

ఉరుసు నిర్వహణకు అందరూ సహకరించాలి


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, నెలవల సుబ్రహ్మణ్యం, రఫీ, విజయభాస్కర్‌రెడ్డి తదితరులు

నాయుడుపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నాయుడుపేటలోని హజరత్ అమీర్‌షావలి దర్గా 74వ ఉరుసు నిర్వహణకు అందరూ సహకరించాలని ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ కోరారు. నాయుడుపేట హజరత్ అమీర్‌షావలి దర్గా వద్ద సోమవారం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఉరుసు గంధోత్సవ వాల్ పోస్టర్లను నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల, సుబ్రహ్మణ్యం, మున్సిపల్ వైస్ చైర్మన్ రఫీ, ఏఎంసీ మాజీ చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి తదితర నాయకులతో కలసి ఆమె ఆవిష్కరించారు. అనంతరం ఆమె మాట్లా డుతూ ఉరుసు గంధోత్సవం 9 సంవత్సరాల విరామం తర్వాత దర్గా వ్యవస్థాపక కమిటీ సభ్యులు, వక్ఫ్‌బోర్డు కమిటీ సభ్యులు సమన్వయంతో నిర్వహించనుండడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో దోర్నాదుల వాసు, నిజాం, లక్ష్మీపతి, రషీద్, చంద్రశేఖర్, సుభానీ, నాయకులు పార్థసారధి, నెలవల రాజేష్, ఉయ్యాల ప్రవీణ్, అవధానం సుధీర్, గంగాప్రసాద్, నానాబాల సుబ్బారావు, రవి, పసల చెంగయ్య, జీవీఆర్ నాయుడు తదితరులు ఉన్నారు.

అభ్యంతరాలుంటే చెప్పండి


కొత్తపట్నంలో రైతుల వివరాలను సేకరిస్తున్న రెవెన్యూ అధికారులు, సిబ్బంది

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నష్టపరిహారం విషయంలో అభ్యంతరాలుంటే చెప్పాలని చెన్నై-బెంగళూరు కోస్టల్ కారిడార్‌తో భూములు కోల్పోతున్న కొత్తపట్నంలోని రైతులను రెవెన్యూ అధికారులు కోరారు. మండల పరిధిలోని కొత్తపట్నంలో సోమవారం చెన్నై-బెంగళూరు కోస్టల్ కారిడార్ భూములకు సంబంధించి అభ్యంతరాలపై రెవెన్యూ బృందాలు పరిశీలన ప్రారంభించాయి. కోట, బాలయ్యపల్లి తహసీల్దారులు జయజయరావు, శ్రీనివాసులు వడమాలపేట డిప్యూటీ తహసీల్దారు సుధీర్ ఆర్ఐలు శ్రీకాంత్, మధులత, సర్వేయర్ గోపీరెడ్డి, బ్రహ్మయ్య, వీఆర్వో వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, భూపరిహారంపై పరిశీలన చేశారు. భూములు కోల్పోయే రైతుల జాబితాను ప్రకటించారు. ఎకరాకు ప్రభుత్వం రూ.8 లక్షల పరిహారం ఇవ్వనున్నట్లు వివరించారు.

నాన్‌టీచింగ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


సబ్‌కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

గూడూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కోట మండలం విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో పనిచేస్తున్న నాన్‌టీచింగ్ ఉద్యోగస్తుల సమస్యలను పరిష్కరించాలని సీపీఐ నాయకులు కోరారు. సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాల యంలో సీపీఐ ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ నాయకులు మాట్లాడుతూ నాన్ టీచింగ్ సిబ్బందికి ఉద్యోగభద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాలేషా, శశికుమార్, ఆదెయ్య, వెంట్రామిరెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

క్రీడా విజేతలకు అభినందన


క్రీడాకారులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళా శాలలో సోమవారం 12వ జేఎన్‌టీయూఏ అంతర్ కళాశాల క్రీడా పోటీలలో పాల్గొన్న, విజేతలుగా నిలిచిన క్రీడాకారులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయకుమార్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో కలికిరిలోని జేఎన్‌టీయూఏ కాలేజ్ అండ్ ఇంజనీరింగ్ కళాశాల నందు 12వ జేఎన్‌టీయూఏ అంతర్ కళాశాల క్రీడాపోటీలు జరిగాయి. ఈ క్రీడా పోటీల్లో 33 కళాశాలల నుంచి 800 మంది పాల్గొనగా ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల నుంచి పలువురు విద్యార్థులు పాల్గొని పలు బహుమతులు సాధించారు. అందులో టేబుల్ టెన్నిస్‌లో పురుషుల సింగిల్స్‌లో చందు, మహిళా విభాగంలో చందన, డబుల్స్‌లో చందు, వంశీధర్‌రెడ్డి గెలుపొందారు. అదేవిధంగా హ్యాండ్ బాల్‌లో మనోప్రియ, యాన్, గాయత్రి, సైక్, నజీమ, ఇందువర్షిణి, వెంకటసౌమ్య, వర్షిత, ఆర్యశ్రీ, లోకేశ్వరి, మౌనిక, లక్ష్మీప్రియ విజేతగా నిలిచి బహుమతులు సాధించారు. క్రీడాకారులను డైరెక్టర్ విజయ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ మల్లికార్జున్‌రెడ్డి, ఆయా విభాగాధిపతులు, షీల్డ్‌లు, మెమెంటోలతో అభినందించారు.

చిట్టేడులో మెగా రక్తదాన శిబిరం


రక్తదానం చేస్తున్న కార్మికులు

కోట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని చిట్టేడులో గల జీవీఆర్ రొయ్యల పరిశ్రమలో సోమవారం ఆ పరిశ్రమల అధినేత స్వర్గీయ గ్రంధి వెంకటేశ్వరరావు జయంతిని కార్మికులు, సిబ్బంది ఘనంగా నిర్వహించారు. వెంకటేశ్వర రావు చిత్రపటానికి రొయ్యల పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ గ్రంధి చల్లారావు, జీఎం కృష్ణన్‌లు పూలమాలలు వేసి నివాళులర్పిం చారు. ఈ సందర్భంగా 200 మంది కార్మికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. సేకరించిన రక్తాన్ని గూడూరు ఏరియా ఆస్పత్రికి అందించారు. అనంతరం పరిశ్రమలోని 1200 మంది కార్మికులకు గ్రంధి చల్లారావు ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు


అసోసియేషన్ కార్యవర్గాన్ని సన్మానిస్తున్న మందుల షాపుల యజమానులు

సూళ్లూరుపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ది సూళ్లూరుపేట కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీ వంగా ఎన్నుకొన్నారు. సోమవారం స్థానిక అలవల కంటి వైద్యశాల రోటరీ భవనంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్‌ల సమావేశం నిర్వహిం చారు. అధ్యక్షుడిగా అంకిరెడ్డి కృష్ణారెడ్డి, కార్యదర్శిగా కుమారస్వామి, కోశాధికారిగా మదన్మో హన్‌ను ఎన్నుకొన్నారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని మందుల షాపుల యజమానులు సన్మానించారు.